ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 18.03.2026 | సంపుటి :12 సంచిక : 238 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారు

"బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కాంగ్రెస్ వచ్చాక తెల్లరేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం ఇస్తోంది. రూ.20 వేల కోట్లతో యంగ్ ఇండి యా స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి రూ.11 వేల కోట్లు చెల్లించాం. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు కడుతున్నందుకు ధన్యావాదాలు చెప్పాలి. బీఆర్ఎస్ హయాంలో చేసిన మంచి కార్యక్రమాలు ఒక్కటైనా చెప్పాలి. అప్పులబా రిన పడిన రాష్ట్రాన్ని క్రమంగా గాడిలో పెట్టేందుకు యత్నిస్తున్నాం. రెండున్నరేళ్లలో రూ.3.25 లక్షల కోట్ల బకాయిలు చెల్లించాం. గవర్నర్ ప్రసంగానికి ధన్యావాదాలు చెప్పాలి. ప్రజలను మోసగించినందుకు క్షమాపణలు చెప్పాలి" - మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



## అయినా అభివృద్ధి చేస్తున్నాం

- నిరంకుశత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు బీఆర్ఎస్ నాయకులే
- స్పీకర్‌ను తప్పపడతారా అంటూ మంత్రి పొంగులేటి ఫైర్
- తీర్పు చదవకుండా వ్యాఖ్యలు సరికాదన్న స్పీకర్
- హామీలు అమలు చేస్తున్నందుకు ధన్యవాదాలు చెప్పాలి: మంత్రి కోమటిరెడ్డి
- బీఆర్ఎస్ నేతలు అబద్ధాలు ఆడితే ప్రజలు విశ్వసించరు: ఆది శ్రీనివాస్
- రాష్ట్రం కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళతాం
- అభివృద్ధి ఎజెండాగా మా ప్రయాణం
- జాతీయ పార్టీగా ఢిల్లీకి వెళుతూనే ఉంటాం
- కేసీఆర్ అనుభవం అసెంబ్లీకి అవసరం: మంత్రి శ్రీధర్‌బాబు
- గత ప్రభుత్వ పాపాలను మరచి మాట్లాడొద్దు
- ఏమేం చేశామో లెక్కలతో సహా వివరిస్తామన్న : డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్(జనంసాక్షి):** నిరంకుశత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు బీఆర్ఎస్ నాయకులని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ టికెట్‌పై గెలిచిన వ్యక్తి కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేస్తే.. ఆయనకు స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పందిస్తూ.. కేటీఆర్ జడ్జిమెంట్ కాపీని పూర్తిగా చదివి మాట్లాడాలన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్పీకర్ జడ్జిమెంట్‌ను కేటీఆర్ ప్రశ్నిం చడం ఆయన అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. పార్టీ ఫిరాయిం పుల్ని ప్రోత్స హించింది బీఆర్ఎస్ కాదా? అని ప్రశ్నించారు.తెలంగాణ శాసనసభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మిగతా 2లో..

## ఆరు గ్యారెంటీల చట్టబద్ధత ఏమైంది?

హామీలపై సీఎం సంతకం చేసిన ఫైల్ ఎక్కడ?: కేటీఆర్

2లో..

## ఇరాన్‌పై దాడిచేస్తే మోదీ.. మౌనమెందుకు ?

సోషల్ మీడియాలో దుష్ప్రచారమే బీఆర్ఎస్ పని

మహిళలకు ఎవరేం చేశారో వారినే అడుగుదాం:మంత్రి సీతక్క



## మీరు కేసీఆర్‌ను తీసుకురండి.. మేం సీఎం రేవంత్‌ను తీసుకొస్తాం

- అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం
- మండలిలో మహేశ్ గౌడ్ ఆవేశపూరిత ప్రసంగం

**హైదరాబాద్(జనంసాక్షి):** అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం..అందుకు మీరు సిద్ధమేనా అంటూ శాసన మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ చేశారు. మొయినాబాద్ ఫామ్ హౌజ్ డ్రగ్స్ కేసు సిగ్గు చేటని, బిఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. గత పదేళ్లలో గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు విస్తృతంగా మిగతా 2లో..

## మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో సిట్



- ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- కేసులో కీలక పరిణామం

### రోహిత్ రెడ్డికి షోకాజ్ నోటీసులు

- మొయినాబాద్ డ్రగ్స్ వ్యవహారంపై బీఆర్ఎస్ సీరియస్
- నోటీసులు జారీచేసిన గులాబీ పార్టీ
- వారంలోగా వివరణ ఇవ్వాలని ఆదేశం
- లేకుంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరిక

**హైదరాబాద్(జనంసాక్షి):** చర్చనీయాంశమైన మెయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు దర్యాప్తునకు మొత్తం 9 మంది అధికారులతో సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీపీ సుధీర్‌బాబు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం కేసును దర్యాప్తు చేయనుంది. భారాస నేత, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో మద్యం పార్టీ దుమారం రేపిన సంగతి తెలిసిందే. అక్కడ డ్రగ్స్ వినియోగిస్తున్నారన్న సమాచారంతో శనివారం రాత్రి తెలంగాణ ఈగల్ పోలీసులు ఆకస్మిక దాడి చేసి 11 మందిని పరీక్షించగా.. ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణైంది. పాజిటివ్ వచ్చిన వారిలో ఏపీలోని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, పైలట్ రోహిత్‌రెడ్డి ఉన్నారు. పోలీసులు సోదాలకు వెళ్లిన సమయంలో నమిత్‌శర్మ అనే వ్యక్తి కాల్పులు జరిపారు. రోహిత్‌రెడ్డి ఆదేశాలతోనే కాల్పులు జరిగినట్లు పోలీసులు అభియోగాలు నమోదు చేశారు. మొయినాబాద్ ఠాణాలో 11 మందిపై కేసు నమోదవగా రోహిత్‌రెడ్డిని ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు. ఆయనతోపాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. మిగిలిన 8 మందికి స్టేషన్ బెయిలు ఇచ్చారు. పోలీసులు ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఉప్పర్‌పల్లిలో జడ్జి ముందు రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి, నమిత్‌శర్మలను ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ముగ్గురు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## దత్తత తీసుకున్నా 3 నెలల సెలవులు ఇవ్వాల్సిందే

- పితృత్వ సెలవులపైనా నిర్ణయం తీసుకోవాల్సిందే
- పిల్లల పెంపకంలో తండ్రులకు కూడా భాగస్వామ్యం
- ప్రసూతి సెలవుల విచారణలో సుప్రీం కీలక ఆదేశాలు

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం


ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ , తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ వేడుకలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పనిచేస్తున్నారని మిగతా 2లో..



## మహిళలకు వడ్డీ లేని రుణాలు రూ.57 వేల కోట్లు

- బీఆర్ఎస్ నేతలకు ఆడబిడ్డలపై ఏమాత్రం గౌరవం లేదు
- వరి బోనస్‌పై రైతులకు రూ.25 వేలు ఆదా
- డిప్యూటీ సీఎం భట్టి



## ఎవరి సాయం మాకు అవసరంలేదు

- మేమే సొంతగా హర్మోజ్ జలసంధి వ్యవహారం చూసుకుంటాం
- అమెరికా చాలా శక్తివంతమైన దేశం
- మిత్ర దేశాలకు ట్రంప్ ఘాటు హెచ్చరిక
- క్యూబాను కూడా తమ నియంత్రణలోకి తీసుకుంటామని వెల్లడి

**వాషింగ్టన్(జనంసాక్షి):** హోర్ముజ్ జలసంధిలో ముడి చమురు రవాణాకు రక్షణగా యుద్ధ నౌకలను పంపించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థనను పలు దేశాలు తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మీడియా సమావేశంలో ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ విషయంలో తమకు ఎవరి సాయం అవసరం లేదని అన్నారు. 'మాకు ఎవరి అవసరమూ లేదు. అమెరికా శక్తిమంతమైన దేశం. మా మిలిటరీ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనది' మిగతా 2లో..

## గ్యాస్ క్షేత్రాలపై నిప్పులవాన

- యూఏఈలో 'షా' గ్యాస్ క్షేత్రం లక్ష్యంగా ఇరాన్ డ్రోన్.. నిలిచిన కార్యకలాపాలు
- అమెరికా యుద్ధ నౌకలో అగ్ని ప్రమాదం.. వందలాది సైనికులకు అస్వస్థత
- ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ లారిజానీని మట్టుబెట్టాం: ఇజ్రాయెల్ ప్రకటన
- అమెరికా దాడి.. మృత్యువు నుంచి క్షణాల్లో బయటపడిన మొజ్తాబా ఖమేనీ

**హైదరాబాద్(జనంసాక్షి):** పర్షియన్ గల్ఫ్ చుట్టూ ఉన్న ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని 'షా' గ్యాస్ క్షేత్రం లక్ష్యంగా డ్రోన్ దాడికి పాల్పడింది. దీంతో పెద్దఎత్తున మంటలు చెలరేగగా.. అధికారులు అక్కడి కార్యకలాపాలను నిలిపివేశారు. గ్యాస్ క్షేత్రంపై జరిగిన డ్రోన్ దాడితో పెద్దఎత్తున మంటలు చెలరేగినట్లు అక్కడి మీడియా పేర్కొంది. దట్టమైన పొగ వ్యాపించిందని వెల్లడించింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది అతికష్టంమీద వాటిని అదుపులోకి తీసుకొచ్చారని తెలిపింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టంచేశారు. దాడిలో గ్యాస్ క్షేత్రానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు అక్కడ జరిగే కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

**చమురు ట్యాంకర్‌పై దాడి**

ఇదిలాఉండగా.. యూఏఈ తూర్పు తీరంలో ఉన్న ఒక చమురు ట్యాంకర్‌పై క్షిపణి దాడి జరిగింది. మంగళవారం తెల్లవారుజామున ఈ దాడి జరిగిందని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ పేర్కొంది. ఫుజైరా సమీపంలోని ఒమన్ గల్ఫ్‌లో ఆ నౌక ఉన్నట్లు తెలిపింది. దాడి కారణంగా ట్యాంకర్ స్వల్పంగా మిగతా 2లో..





## యుద్ధం ముగింపునకు చర్చలే మార్గం

- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్
- దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎక్కడా కొరత లేదు: కేంద్రం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం ముగింపునకు చర్చలు, దౌత్య మార్గాల అవశ్యకతను భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రస్తావించారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ మిగతా 2లో..

## నేను రాజీనామా చేస్తే అది సంజయ్ వల్లే..

- కాంగ్రెస్‌లో చిచ్చు పెడుతున్నదే అతడు
- తనతో కలసి పనిచేయాలనడానికి ఆయన ఎవరు?
- ఇంతకు ఆయన ఏ పార్టీకి చెందిన వారో చెప్పాలి
- నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ బంధాన్ని తెంపే కుట్ర
- నేనే పార్టీ మారితే అందుకు కారణం సంజయ్ మాత్రమే
- మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**జగిత్యాల బ్యూరో(జనంసాక్షి):** తనను కాంగ్రెస్ నుంచి బయటకు పంపించేందుకు బిఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌ను ఎవరో వెనక ఉండి ప్రోత్సహిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనతో కలిసి పనిచేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తనకు ఆఫర్ ఇచ్చాడని సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి చెప్పారు. మిగతా 2లో..



ఘటనలో 400 మంది దుర్మరణం

మంటల్లో చిక్కుకున్న ఆస్పత్రి భవనం

## కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి

అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం • దాడి మేంచేయలేదంటూ తోసిపుచ్చిన పాక్

**కాబూల్(జనంసాక్షి):** అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడి చేసిందని.. ఈ దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోయారని తాలిబన్లు ప్రకటించారు. ఈ దాడిలో ఆస్పత్రి పూర్తిగా ధ్వంసమైందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. ఇదిలాఉంటే.. అఫ్గాన్ ప్రభుత్వ ఆరోపణల్ని పాకిస్థాన్ కొట్టిపడేసింది. కాబూల్‌లోని ఏ ఆస్పత్రిని కూడా తాము టార్గెట్ చేసుకోలేదని పేర్కొంది. అఫ్గానిస్థాన్ చెప్పేదాంట్లో నిజాలు లేవంది. ఇదిలావుంటే పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ దేశాల మిగతా 2లో..

## దీదీ x సువేందు

- ఖరారైన పోటీ
- టీఎంసీ అభ్యర్థుల జాబితా విడుదల



**కోల్‌కతా(జనంసాక్షి):** వచ్చే నెలలో పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పూర్తి జాబితాను విడుదల చేశారు. ఎన్నికల్లో 294 స్థానాలకు గాను 291 స్థానాల్లో టీఎంసీ పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. డార్జిలింగ్ ప్రాంతంలోని 3 స్థానాల్లో అనిత్ థాపా నేతృత్వంలోని బీజీపీఎం పోటీ చేయనున్నట్లు తెలిపారు. భవానీపూర్ నుంచి తాను ఎన్నికల బరిలో దిగుతున్నట్లు మమత వెల్లడించారు. భాజపా తరఫున ఆ స్థానం నుంచి ప్రస్తుత శాసనసభలో మిగతా 9లో..

## హ్యామ్ రోడ్ల పేరుతో స్కామ్

- 18వేల కోట్ల కుంభకోణానికి తెరలేపిన కాంగ్రెస్ సర్కారు
- కమీషన్ల కోసం 10 శాతం మొబిలైజేషన్ చెల్లింపు
- కాంగ్రెస్ ఎన్నికల ఖర్చు కోసం రేవంత్ సన్నాహాలు
- బీఆర్ఎస్ నేత హరీశ్ ఆరోపణలు



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి సంచలన ఆరోపణలు వెలువడ్డాయి. అసెంబ్లీలో జరిగిన చిట్‌చాట్ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు రాష్ట్రంలో భారీ కుంభకోణం జరుగుతోందని మిగతా 2లో..

## యువతకు ఉన్నత విద్యామండలి కొత్త కోర్సులు

11లో..

- యూజీ , పీజీ విద్యార్థుల కోసం 39 స్పెషల్ కోర్సులు
- విజన్ 2047 లక్ష్యంగా కార్యాచరణ
- ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

## ఐసీస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు

మొరాదాబాద్‌లో డెంటల్ విద్యార్థి అరెస్ట్

2లో..

## 61 వేల మంది రైతులకు 'ఫార్మర్ కిట్ల' పంపిణీ

రైతు నేస్తం 86వ ఎపిసోడ్ వేదికగా

కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల

ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని రైతులకు పిలుపు

## ఆరు గ్యారెంటీల చట్టబద్ధత ఏమైంది?

హైదరాబాద్(జనంసాక్షి): 'నేనే రాజు.. నేనే మంత్రి' అని మిడిసిపడ్డ వారు సంపద మూటగట్టుకుపోలేరని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ఆయన మాట్లాడారు. "ఎన్నికల హామీ దస్త్రంపై సీఎం సంతకం చేశారని 2023 నాటి గవర్నర్ ప్రసంగంలో ఉంది. ఏళ్లు గడిచినా సీఎం సంకల్పం, చిత్తశుద్ధి ఏమైంది?తొలి క్యాబినెట్‌లోనే ఆరు హామీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. బహిరంగ వేదికపై సీఎం సంతకం చేసిన దస్త్రం ఏమైంది? సీఎం ఫైల్‌కే దిక్కు లేకపోతే కాంగ్రెస్ మాటలు ఎవరు నమ్ముతారు?మాయమైన దస్త్రం కోసం సిట్ ఏర్పాటు చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు దిల్లీ వెళ్లి నిధులు తెస్తారనుకుంటే.. నిధులు ఇచ్చి వస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. "2023లో ఐటీ ఉద్యోగుల సంఖ్య 9.46లక్షలు. తాజాగా గవర్నర్ ప్రసంగంలో ఆ సంఖ్య 9.39లక్షలుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 7వేల ఉద్యోగాలు తగ్గాయనేది వాస్తవమా? కాదా?ఉద్యోగాలు ఎందుకు తగ్గాయి?బీఆర్ఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తక్కువగా వచ్చినా రాష్ట్రాన్ని దీటుగా నిలబెట్టాం. మనది కేంద్రంపై ఆధారపడే రాష్ట్రం కాదు"అని కేటీఆర్ అన్నారు.

## మీరు కేసీఆర్‌ను తీసుకురండి.. మేం సీఎం రేవంత్‌ను తీసుకొస్తాం

వ్యాపించాయని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తాను డ్రగ్ టెస్టుకు సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తానని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిద్ధమా? అని మహేష్ గౌడ్ సవాల్ విసిరారు. 'మీరు మీ నాయకుడిని డ్రగ్స్ టెస్టుకు తీసుకురండి. నేను మా సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తాను' అంటూ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇటీవల డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్‌కు చెందిన ఒక నాయకుడు పట్టుబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఆ పార్టీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకుందో ప్రశ్నించారు. ప్రజలకు, ముఖ్యంగా యువతకు సరైన సందేశం ఇవ్వాల్సిన బాధ్యత నాయకులపై ఉందని అన్నారు. డ్రగ్స్ సమస్యపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా కోరారు. డ్రగ్స్ కేసుల్లో ఎంత పెద్దవారైనా వదిలే ప్రసక్తే లేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులకు బీ-ఫారమ్ ఇచ్చే ముందు డ్రగ్స్ టెస్టులు చేయాలని సూచించారు. కొందరు నాయకులు డ్రగ్స్ వ్యాపారంలో నేరుగా పాల్గొంటున్నారనే ఆరోపణలు కూడా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. గాంధీ విగ్రహం అంశంపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మూసీ నది పరిస్థితిపై కూడా స్పందిస్తూ.. అభివృద్ధి లేకపోతే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రానికి, దేశానికి సేవ చేసిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం తాత్కాలికమేనని, ప్రజలు వాస్తవాలను గుర్తిస్తారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వంద సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

## దత్తత తీసుకున్నా..3 నెలల సెలవులు ఇవ్వాల్సిందే

పితృత్వ సెలవులపైనా నిర్ణయం తీసుకోవాల్సిందే
పిల్లల పెంపకంలో తండ్రులకు కూడా భాగస్వామ్యం
ప్రసూతి సెలవుల విచారణలో సుప్రీం కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మూడు నెలల కంటే ఎక్కువ వయసు ఉన్న బిడ్డను ఒక మహిళ దత్తత తీసుకుంటే.. ఆమెకు ప్రసూతి సెలవులను నిరాకరించడం సరికాదని తీర్పులో పేర్కొంది. ఆ బిడ్డ వయసుతో సంబంధం లేకుండా ఆ తల్లికి 12 వారాల సెలవు పొందడానికి అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. దత్తత వంటి మార్గాల్లో కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవడం చట్టబద్ధమేనని వ్యాఖ్యానించింది. దత్తత తీసుకున్న బిడ్డకు కన్నబిడ్డకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండదు. ప్రసూతి సంరక్షణ కనీస హక్కు అని పేర్కొంది. మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ ప్రకారం.. 3 నెలల కంటే తక్కువ వయసు ఉన్న బిడ్డను దత్తత తీసుకునే మహిళా ఉద్యోగులు 12 వారాలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవు తీసుకోవడానికి అర్హత ఉంది. ఈ క్రమంలో పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్రానికి సుప్రీంకోర్టు తాజాగా సూచించింది. పిల్లలు, వారి తల్లిదండ్రుల అవసరాలకు అనుగుణంగా సెలవులను నిర్ణయించాలని పేర్కొంది. మాతృత్వ సెలవులపై కేసులో విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు మంగళవారం పితృత్వ సెలవులపై కూడా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తండ్రులకు కూడా సెలవులు ఉండాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. పిల్లల పెంపకం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాదని పేర్కొంది. తండ్రికి కూడా సమాన బాధ్యత ఉంటుందని తెలిపింది. మాతృత్వ సెలవుల తరహాలోనే.. వేతనంతో కూడిన పితృత్వ సెలవులు కల్పించాలని సూచించింది. పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష తగ్గాలంటే ఇలాంటి చట్టాలు అవసరమని సుప్రీంకోర్టు పేర్కొంది. పితృత్వ సెలవులు ప్రైవేట్ రంగంలోనూ అమలు చేసేలా నిబంధనలు రూపొందించాలని కేంద్రానికి సూచించింది. పిల్లల ఎదుగుదలలో తండ్రి పాత్రను గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఇక మూడు నెలలలోపు వయసున్న పిల్లల్ని దత్తత తీసుకున్న మహిళలకు మాత్రమే 12 వారాల మాతృత్వ సెలవులను కేటాయించడం సరికాదని కూడా సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ మేరకు సోషల్ సెక్యూరిటీ కోడ్-2020లోని నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. దత్తత తీసుకున్న పిల్లల వయసుతో సంబంధం లేకుండా తల్లులకు 12 వారాల మాతృత్వ సెలవులు మంజూరు చేయాలని స్పష్టం చేసింది.

## హ్యామ్ రోడ్ల పేరుతో స్కామ్

ఆరోపించారు. హ్యామ్ రోడ్ల పేరిట సుమారు రూ.18 వేల కోట్ల స్కాం జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆనాడు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారని.. ఇప్పుడు 10 శాతం మొబిలైజేషన్ ఇస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. ఈ రకంగా రాష్ట్రంలో అతిపెద్ద కుంభకోణం జరుగుతోంది. హ్యామ్ రోడ్ల పేరుతో రూ.18 వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారు. రోడ్స్ అండ్ బిల్డింగ్స్ లో రూ.12 వేల కోట్లు, పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌లో రూ.6 వేల కోట్లు కలిపి భారీ స్థాయిలో అవకతవకలు జరుగుతున్నాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే అప్పటి ప్రతిపక్ష నాయకుడు రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారు. ఇప్పుడు అదే ప్రభుత్వం 10 శాతం మొబిలైజేషన్ ఇస్తోంది. ఇందులో కమిషన్లు తీసుకుని ఎన్నికల ఖర్చు కోసం పంపబోతున్నారు. ఈ వ్యవహారం పెద్ద స్థాయి స్కాం గా మారే ప్రమాదం ఉంది' అని ఆరోపించారు. ఈ టెండర్లకు సీఓటీ అనుమతి కూడా అవసరం లేకుండా, డిపార్ట్‌మెంట్ స్థాయిలోనే అనుమతులు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం**
దేవాదాయ-ధర్మాదాయ శాఖ
వల్మిడి గ్రామం పాలకుర్తి మండలం-జనగాం జిల్లా,తెలంగాణ

సీల్డ్ టెండర్లకు బహిరంగ వేలం ప్రకటన
తేది: 17.03.2026

సదరు దేవస్థానములో 2026-27 సంవత్సరమునకు గాను తేది:22.03.2026 నుండి 21.03.2027 వరకు(1 సంవత్సర కాలమునకు) అవసరమైన 1.కొబ్బరికాయలు మరియు పూజా సామాగ్రి అమ్ముకునే హక్కు 2.లడ్డు పులిహోర అమ్ముకునే హక్కు 3.కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కు నిమిత్తం తేద:21.03.2026న ఉ॥ 11.30 గం॥లకు బహిరంగ వేలం కం సీల్డ్ టెండర్ నిర్వహించడానికి నిర్ణయించడమైనది. టెండరులో పాల్గొనదలచిన వారు. టెండరు షెడ్యూల్ మరియు ఇతర వివరముల కొరకు దేవస్థానము కార్యాలయ పనివేళలో సంప్రదించగలరు. సంప్రదించాల్సిన ఫోన్ నెం.9030932493.

సం/- కార్యనిర్వహణాధికారి
DIPR No.17184-PP/CL/ADVT/1/2025-26

# రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారు

మధ్య మాటల సంవాదం చోటుచేసుకుంది. హామీలు అమలు చేయనందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపాలా అని కేటీఆర్ ప్రశ్నించారు. దీనిపై స్పందించిన కోమటిరెడ్డి గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. అయినప్పటికీ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలపాలని పేర్కొన్నారు. డ్రగ్

**టెస్టులకు కాంగ్రెస్ నేతలు సిద్ధం: మహేశ్‌కుమార్**

బీఆర్ఎస్ నేతలు అబద్ధాలు ఆడితే ప్రజలు విశ్వసించరు: ఆది శ్రీనివాస్

హైదరాబాద్: ఈనెల 22 నుంచి రైతుభరోసా నిధులు పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో 60లక్షల మందికి పైగా రైతులకు ఈ నిధులు జమ చేస్తామన్నారు. తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం చర్చలో ఆయన మాట్లాడారు. "బీఆర్ఎస్ హయాంలో రైతులు వరి వేస్తే ఉరి అన్నారు. సన్న బియ్యం పండించే రైతులకు రూ.500 బోనస్, యంత్ర పరికరాలు అందిస్తున్నాం. రైతులు, ప్రజల మద్దతుతో మున్సిపల్, ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయం దక్కింది. బీఆర్ఎస్ నేతలు అబద్ధాలు ఆడి తప్పుదోవ పట్టిస్తే ప్రజలు విశ్వసించరు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు తీసుకోకపోయినా 71.86లక్షల టన్నుల ధాన్యం పండించాం. ఎల్లంపల్లి నీటితో పెద్ద ఎత్తున వరి పండింది. బీఆర్ఎస్ హయాంలో మోటార్లకు కూడా బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. గత ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయింది. ఇందిరమ్మ రాజ్యం నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ సేవలందిస్తున్నాయి" అని ఆది శ్రీనివాస్ అన్నారు.

కేసీఆర్ అనుభవం అసెంబ్లీకి అవసరం: శ్రీధర్‌బాబు

హైదరాబాద్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ విషయంలో స్పీకర్‌దే తుది నిర్ణయమని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జీవన్‌రెడ్డిని పార్టీ ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదన్నారు. బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షనేత కేసీఆర్ రావాలని కోరారు. " కేసీఆర్ అనుభవం అసెంబ్లీకి అవసరం. మంత్రుల మార్పులు, చేర్పుల్లో సీఎంకే పూర్తి స్వేచ్ఛ ఉంది" అని శ్రీధర్‌బాబు అన్నారు. అసెంబ్లీ సహా సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అట్టర్ ఫ్లాప్ అయిందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో శ్రీధర్‌బాబు మాట్లాడారు. అంతకు ముందు కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు శ్రీధర్‌బాబు దీటుగా జవాబిచ్చారు. దీంతో వారి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఈ వార్త చదివారా: హామీలపై సీఎం సంతకం చేసిన ఫైల్ ఏమైంది?: కేటీఆర్

గత ప్రభుత్వ పాపాలను మరచి మాట్లాడొద్దు:భట్టి

గవర్నర్ ప్రసంగంపై కెటిఆర్ మాట్లాడుతున్నంత సేపు మంత్రులు పలు అంశాల్లో తిప్పి కొట్టారు. గత హయాంలో చేసిన తప్పులు మరచి, ప్రభుత్వాన్ని తప్పుపట్టడమే లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. టెక్నికల్‌గా మాట్లాడితే బీఆర్ఎస్ ఒక్క రూపాయి కూడా రుణం ఇవ్వలేదన్నారు. మహిళలంటే ఎందుకు చులకన అని మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు. మహిళా సాధికారతపై కేటీఆర్ హేళనగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 'మీరు పావలా వడ్డీ ఇవ్వలేదు.. మేము ఇస్తున్నాం. గోబెల్స్ ప్రచారంలో బీఆర్ఎస్‌ను మించిన వారు ఈ ప్రపంచంలోనే ఎవరూ లేరు. కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వకపోతే మీరు ఎక్కడ ఉండేవారు. ఈరోజు కాంగ్రెస్‌పై అడ్డగోలుగా మాట్లాడుతున్నారు' అంటూ కేటీఆర్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగంలో ఎంవోయూ, పెట్టుబడులపై ఆయన వివరణ ఇచ్చారు. సిఎం పదేపదే ఢిల్లీకి వెళుతున్నారని కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి తిప్పికొట్టారు. కేంద్రంతో కొట్లాడి అయినా నిధులు తెచ్చి, రాష్ట్రాన్ని బాగు చేస్తామని అన్నారు. ప్రధాన మంత్రిని కలవడంలో తప్పేముందని అన్నారు. గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్ష సభ్యులు సలహాలు ఇస్తారని ఆశించామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని.. దిల్లీకి ఎన్నిసార్లయినా వెళ్తామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దిల్లీ వెళ్లి ప్రధాని, కేంద్రమంత్రులను కలుస్తున్నామన్నారు. ప్రాంతీయ పార్టీగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ నేతలు ఎన్నోసార్లు దిల్లీకి చక్కర్లు కొట్టారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి కేటీఆర్ సలహాలు, సూచనలు ఇస్తారని అనుకున్నామని.. ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను చదువుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో కానీ అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటులో కానీ జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్‌అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## 61 వేల మంది రైతులకు 'ఫార్మర్ కిట్ల' పంపిణీ

హైదరాబాద్(జనంసాక్షి):జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నేడు సచివాలయ ప్రాంగణం నుండి నిర్వహించిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ 86వ ఎపిసోడ్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంపిక చేసిన రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతులకు ప్రత్యేక 'ఫార్మర్ కిట్లను' అందజేసి రాష్ట్రవ్యాప్తంగా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వాడకం వల్ల మానవ ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు వాతావరణం కలుషితం అవుతున్న తరుణంలో, మన పూర్వీకులు ఆచరించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులే రైతులకు, సమాజానికి క్షేమకరమని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 489 క్లస్టర్లను గుర్తించి, ఒక్కో క్లస్టర్ నుండి 125 మంది చొప్పున మొత్తం 61,125 మంది రైతులను ఈ పథకం కోసం ఎంపిక చేశారు. వీరికి అవగాహనతో పాటుగా ఫార్మర్ కిట్లను అందజేశారు. 20, 21, 22 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించనున్న 'రైతు మహోత్సవ' కార్యక్రమానికి రైతులు భారీగా తరలిరావాలని మంత్రి పిలుపునిచ్చారు. 50కి పైగా స్టాల్స్, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉంటుందని అన్నారు. 22న సీఎం చేతుల మీదుగా యాసంగి సీజన్ రైతు భరోసా నిధుల జమ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. ల్త÷తులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుంటూ అధిక ఆదాయాన్ని గడించాలన్నారు

## ఇరాన్‌పై దాడి చేస్తే మోదీ మౌన మెందుకు ?

హైదరాబాద్(జనంసాక్షి): ఇరాన్‌పై దాడి చేస్తే మోదీ మౌనంగా ఎందుకున్నారని మంత్రి సీతక్క ప్రశ్నించారు. మహిళలంటే మాజీ మంత్రి కేటీఆర్‌కు చిన్నచూపని అన్నారు. తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్‌పై మంత్రి సీతక్క విరుచుకుపడ్డారు. కుటుంబ సభ్యులైనా, బయట మహిళలనైనా ఎదగనీయాలంటూ కేటీఆర్‌కు మంత్రి చురకలంటించారు. ఫ్రీ బస్‌పై కేటీఆర్ సెటైర్లు, తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. కేటీఆర్ సత్యదూరమైన మాటలు, ఎగతాళి మాటలు బంద్ చేయాలన్నారు. పదేళ్ళు మంత్రిగా మహిళల కోసం కేటీఆర్ ఏం చేశారని సీతక్క ప్రశ్నించారు. మహిళా సంఘాలు ఐదు లక్షల కంటే ఎక్కువ తీసుకోకుండా బారికేడ్లు పెట్టారని.. ఇప్పుడు ఆ బారికేడ్లను తొలగిస్తున్నామని చెప్పారు. ఎవరి హయాంలో మహిళా సంఘాలు బాగా నడుస్తున్నాయో వెళ్లి మహిళలను అడగాలని మంత్రి సవాల్ చేశారు. అభయ హస్తం డబ్బులను కూడా గత ప్రభుత్వం వాడుకుందని సీతక్క ఆరోపించారు. శ్రీనిధి ద్వారా వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇస్తున్నామని మంత్రి వివరించారు. మహిళలకు చెందిన అభయ హస్తం డబ్బులను కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాడుకుందని ఆరోపించారు. కేటీఆర్ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.

## మహిళలకు వడ్డీ లేని రుణాలు రూ.57 వేల కోట్లు

హైదరాబాద్(జనంసాక్షి):రైతు భరోసా కాకుండా ఒక్కో రైతుకు వరి ధాన్యం బోనస్ పేరిట 25000 హాజరవుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. రైతుల శ్రమను గుర్తించి సన్నధాన్యం పండించిన రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ రైతుల ఖాతాలో వేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో 9,000 కోట్లు కేవలం తొమ్మిది రోజుల్లో వారి ఖాతాలో జమ చేశారు అన్నారు. వడ్డీ లేని రుణాల కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు సంవత్సరానికి 20వేల కోట్ల పైగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు ఇప్పటివరకు వడ్డీ లేని రుణాల కింద 57 వేల కోట్లను మహిళల ఖాతాలో జమ చేశామని తెలిపారు. మహిళలు బాగుపడితే కుటుంబం మొత్తం బాగుపడుతుంది తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని వివరించారు. టిఆర్ఎస్ నేతలకు మహిళల పట్ల ఏమాత్రం గౌరవం ఉందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని అన్నారు. ప్రతి సందర్భంలో కేటీఆర్ మహిళల మనసు గాయపరుస్తున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ మహిళల గురించి జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడాలి అన్నారు. కేటీఆర్ దారి తప్పి మాట్లాడుతున్నారు అనిపిస్తుంది, మహిళల అభివృద్ధి గురించి వారికి శ్రద్ధ ఉంటే వారి క్యాబినెట్లో మహిళలకు అవకాశం కల్పించేవారు అని అన్నారు. కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు వడ్డీ లేని రుణాలు చెక్కులు చెల్లించుకుంటూ పోతున్నాం, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని అన్నారు

## యుద్ధం ముగింపునకు చర్చలే మార్గం

చెప్పారు. యూరోపియన్ యూనియన్ నేతల ఆహ్వానం మేరకు బ్రసెల్‌లో పర్యటించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. "మా విదేశాంగ మంత్రి జై శంకర్ బ్రసెల్స్ పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలోనే ఈయూ విదేశాంగ వ్యవహారాల కౌన్సిల్ సమావేశంలో పాల్గొనాల్సిందిగా ఈయూ ఉన్నత ప్రతినిధి, ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్ ఆయనను ఆహ్వానించారు. ఈ సమావేశంలో భారత్-ఈయూ సంబంధాలపై చర్చించడంతో పాటు ప్రపంచ సవాళ్లపై ముఖ్యంగా పశ్చిమాసియాలోని పరిస్థితిపై, ఇంధన భద్రతపై దాని ప్రభావాలతో సహా చర్చించారు. ఇందులో జైశంకర్?తో పాటు యూరోపియన్ యూనియన్‌లోని ఇతర మంత్రులు, ఈయూలోని వివిధ దేశాల విదేశాంగ మంత్రులు హాజరయ్యారు. ఈ క్రమంలోనే సంక్షోభాన్ని త్వరగా ముగింపు పలకడానికి చర్చలు, దౌత్య మార్గాలను అనుసరించాల్సిన అవసరాన్ని మంత్రులు చర్చించారు." అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు.

### ఐసిస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు

లక్నో(జనంసాక్షి):యుపిలో టెర్రరిస్ట్ సంబంధాలు ఉన్నవారిపై దాడులు కొనసాగుతున్నాయి. నిషేధిత ఉగ్రవాద సంస్థ ఐసిస్‌తో ఆన్‌లైన్‌లో సంబంధాలున్నాయనే ఆరోపణలతో 19 ఏళ్ల వైద్య విద్యార్థిని యుపి పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భారత్‌లో పనిచేస్తున్న ఐసిస్ అనుబంధ ఆన్‌లైన్ నెట్‌వర్క్ కార్యకలాపాలపై కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, షహరాన్‌పూర్ జిల్లాకు చెందిన హారీష్ అలీని ఆదివారం మొరదాబాద్‌లో అరెస్ట్ చేసినట్లు ఏటిఎస్ ఒక ప్రకటనలో తెలిపింది.

### కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి

మధ్య ఘర్షణలు మూడో వారానికి చేరుకున్నాయి. ఇరుపక్షాలు భీకర దాడులకు పాల్పడుతున్నాయి. సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని.. పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో నలుగురు అఫ్గాన్ సైనికులు చనిపోయినట్లు ఆ దేశాధికారులు చెప్పారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే కాబుల్‌లోని ఆస్పత్రిపై వైమానిక దాడికి పాల్పడినట్లు అఫ్గాన్ ఆరోపించింది.'

### నేను రాజీనామా చేస్తే అది సంజయ్ వల్లే..

అసలు సంజయ్ ఏ పార్టీలో ఉన్నారు?, తనను ఎలా కలిసి రమ్మంటారని మండిపడ్డారు. నేను ప్రస్తుతానికి కాంగ్రెస్ పార్టీలో ఉన్నాను. కాంగ్రెస్‌ని వదిలిపెట్టడానికి సంజయ్ కారణం అవుతారు. సంజయ్‌ని ఎవరు ప్రోత్సహిస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ సమస్య పరిష్కారం అవుతుందని నేను అనుకోవడం లేదు. కాంగ్రెస్‌లోని మిత్రులు ఈ విషయంలో మాట్లాడుతున్నారు. నాకు కార్యకర్తల అభిప్రాయాలు ముఖ్యం. కాంగ్రెస్ అధిష్టానంది కూడా బాధ్యతే. నేను పార్టీని వీడటంలో సంజయ్‌ది ఒక్కటే పాత్ర కాదు. ఆరు గ్యారంటీల అమల్లో జాప్యం ఉంది.. అసంతృప్తి ప్రజల్లో ఉంది. నేను పార్టీని వీడితే పార్టీ అగుతుందా?, ఒక్కడు పోతే ఆగదు. కాంగ్రెస్లోకి వచ్చిన 10 మంది ఎమ్మెల్యేలను దూరం పెట్టడమే పరిష్కారం" అని ఆయన స్పష్టం చేశారు.

# గ్యాస్ క్షేత్రాలపై నిప్పులవాన

దెబ్బతిన్నట్లు వెల్లడించింది. అయితే, ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొంది. ఇరాన్ ఈ క్షిపణి దాడికి పాల్పడినట్లు అనుమానం వ్యక్తంచేసింది. దాడిపై అధికారులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించారని.. ఈ ప్రాంతం మీదుగా వెళ్తున్న నౌకలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

అమెరికా యుద్ధ నౌకలో అగ్ని ప్రమాదం..

ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా కొనసాగిస్తోన్న ఆపరేషన్‌లో అమెరికా విమాన వాహక నౌక జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఎర్రసముద్రంలో తనవంతు సహకారాన్ని అందిస్తోంది. ఇటీవల ఈ నౌకలో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ఘటనను అమెరికా సైనిక అధికారులు ధ్రువీకరించారు. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం.. వారం క్రితం జెరాల్డ్ నౌకలోని ప్రధాన లాండ్రీ విభాగంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అనంతరం వెంటిలేషన్ డక్ట్‌ల ద్వారా ఇతర భాగాలకు మంటలు వ్యాపించాయి. నౌకలోని పలు ప్రదేశాల్లో దాదాపు 30 గంటల పాటు అగ్నికీలలు ఎగసిపడ్డాయి. దీంతో పలు కంపార్ట్‌మెంట్లలో ఉన్న అమెరికా సైనికులు, నావికులు విష వాయువులు పీల్చి అస్వస్థతకు గురయ్యారు. ఘటన జరిగిన సమయంలో నౌకలో 4,500 మంది సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో 600 మంది సెయిలర్ల పడకలు అగ్నికి ఆహుతి అయ్యాయి. 30 గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పివేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రాణ నష్టానికి సంబంధించి ఎటువంటి సమాచారం వెలువడలేదు. నౌకలో తీవ్రంగా మంటలు చెలరేగినప్పటికీ పెద్ద నష్టం జరగలేదని అమెరికా సైనిక అధికారులు వెల్లడించారు. విమాన వాహక నౌక పూర్తిస్థాయిలో పనిచేస్తోందన్నారు. అస్వస్థతకు గురైన సిబ్బందికి చికిత్స అందిస్తున్నామన్నారు. అగ్ని ప్రమాదానికి గురైన కంపార్ట్‌మెంట్లను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాధారణంగా అమెరికాకు చెందిన విమాన వాహక నౌకలు సుమారు ఏడు నెలల పాటు సముద్రంలో మోహరించి ఉంటాయి. అయితే యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో పది నెలలుగా జెరాల్డ్ పలు ప్రదేశాల్లో మోహరిస్తూ సముద్రంలోనే ఉంది. మొదట మధ్యధరా సముద్రంలో పనిచేసిన ఈ నౌకను వెనెజువెలాపై దాడి సమయంలో కరేబియన్‌కు మళ్లించారు. ఆ తర్వాత ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా వైపు తరలించారు. ప్రస్తుతం ఈ నౌక ఎర్ర సముద్రం నుంచి సౌదీ అరేబియాలోని జెడ్డా ఓడరేవు వైపు ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్కువకాలం సముద్రంలో మోహరించి ఉండడం వల్ల ఇందులో పలు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

**ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ లారిజానీని మట్టుబెట్టాం: ఇజ్రాయెల్**

ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ అలీ లారిజానీని మట్టుబెట్టినట్లు ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ప్రకటించారు. లారిజానీని లక్ష్యంగా చేసుకుని టెహ్రాన్‌లో వైమానిక దాడులు జరిపినట్లు అంతకుముందు ఇజ్రాయెల్ సైనిక అధికారులు తెలిపారు. ఇతర దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన బసిజ్ పారామిలిటరీ ఫోర్స్ కమాండర్ గోలమ్‌రెజా సోలేమాని హతమైనట్లు వెల్లడించారు. ఈ ఘటనలను ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు. ఇటీవల మృతి చెందిన ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీకి లారిజానీ కుడిభుజంగా వ్యవహరించారు. దేశ భద్రత, ఇరాన్ అణు కార్యక్రమం తదితర వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారు. 'సుప్రీం కౌన్సిల్ ఆఫ్ ది కల్చరల్ రివల్యూషన్'లోనూ సభ్యుడిగా ఉన్నారు. అలీ ఖమేనీ మరణానంతరం లారిజానీని ఇరాన్‌లో శక్తిమంతమైన నేతగా పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. మరోవైపు.. గోలమ్‌రెజా సోలేమాని నేతృత్వంలోని బసిజ్ దళాలు ఇరాన్‌లో ప్రజా నిరసనలను ఉక్కుపాదంతో అణచివేశాయని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఆయనపై అమెరికా, ఈయూ ఆంక్షలు విధించాయి. బసిజ్ డిప్యూటీ కమాండర్, ఇతర ఉన్నతాధికారులను కూడా అంతమొందించినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. పాలస్తీనా ఇస్లామిక్ నేత అక్రమ్ అల్- అజౌరీ తదితరులపైనా దాడులు చేసినట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో అల్- అజౌరీ మరణించి ఉండొచ్చని పేర్కొంది. గాజా, వెస్ట్ బ్యాంక్ కేంద్రాలుగా ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొంటున్న వీరు టెహ్రాన్‌లోని ఒక సురక్షిత స్థావరంలో దాక్కుని ఉండగా దాడి చేసినట్లు తెలిపింది.

## ఎవరి సాయం మాకు అవసరంలేదు

అని వ్యాఖ్యానించారు. యుద్ధ నౌకలను పంపించాలన్న ట్రంప్ అభ్యర్థనపై నాటో దేశాలు ఆచితూచి స్పందించిన విషయం తెలిసిందే. యుద్ధ నౌకలను పంపే విషయమై చర్చలు జరుగుతున్నాయని యూకే పేర్కొంది. జపాన్ కూడా దాదాపుగా ఇదే ప్రకటన చేసింది. తమకు యుద్ధ నౌకలను పంపే యోచనే లేదని ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. అసలు తమను ఈ విషయమై ఎవరూ సంప్రదించలేదని కూడా ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ పేర్కొన్నారు. ఇక ట్రంప్ అభ్యర్థనను జర్మనీ నిర్ద్వంద్వంగా తోసి పుచ్చింది. యుద్ధం ప్రారంభించే ముందు అమెరికా గానీ ఇజ్రాయెల్ గానీ తమను సంప్రదించలేదని జర్మనీ ఛాన్సలర్ ఫ్రీడ్రిక్ మెర్జ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు కొన్ని చట్టపరమైన పరిమితులు ఉన్నాయని చెప్పారు. ఐక్యరాజ్య సమితి, ఐరోపా సమాఖ్య, నాటో నుంచి తమకు అనుమతులు లేవని చెప్పారు. ఇరాన్ విషయంలో నాటో దేశాల నుంచి తాను ఆశించిన స్పందన లేకపోవడంతో ట్రంప్ గతంలోనూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమిలో భాగమైనా కూడా వారు అమెరికాకు సాయం చేసేందుకు ముందుకు రావట్లేదని అన్నారు. సమిష్టి రక్షణ బాధ్యతను పట్టించుకోవట్లేదని విమర్శించారు. హోర్ముజ్ జలసంధిని పట్టించుకోకపోతే నాటో దేశాల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని కూడా హెచ్చరించారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తెలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు. ఇరాన్‌తో యుద్ధాన్ని కొనసాగిస్తోన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా క్యూబాను స్వాధీనం చేసుకోవడంపై దృష్టిసారించారు. ఆ ద్వీప దేశాన్ని తమ నియంత్రణలోకి తీసుకుంటామని వ్యాఖ్యానించారు. క్యూబా వ్యాప్తంగా.. విద్యుత్ వ్యవస్థ కుప్పకూలిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ.. 'క్యూబా ను స్వాధీనం చేసుకునే అవకాశం నాకు దక్కుతుందని నేను బలంగా నమ్ముతున్నాను. అది చాలా గొప్ప విషయం. అది నాకు పెద్ద గౌరవం. దాన్ని స్వాధీనం చేసుకోగలను. దానితో నేను ఆశించినది ఏదైనా దక్కించుకోగలను' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. కాగా.. అమెరికా చమురు ఆంక్షల నేపథ్యంలో క్యూబా లో విద్యుత్ వ్యవస్థ కుప్పకూలింది. దీంతో 9.6 మిలి యన్ల మంది ప్రజలు అంధకారంలో చిక్కుకుపోయారు. అమెరికా ఆంక్షల వల్ల గత మూడు నెలలుగా క్యూబాకు ఎలాంటి భారీ ఇంధన రవాణా జరగలేదని క్యూబా అధ్యక్షుడు మిగెల్ దియాజ్ కానెల్ గతవారం పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు

## రోహిత్ రెడ్డికి షోకాజ్ నోటీసులు

హైదరాబాద్(జనంసాక్షి):మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ బిగ్ షాక్ ఇచ్చింది. రోహిత్‌కు పార్టీ అధిష్ఠానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. డ్రగ్స్ కేసుకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. 'డ్రగ్స్ కేసులో మీ ప్రమేయం ఉన్నట్లు మీడియా ద్వారా వార్తలు వచ్చాయి. అదే విధంగా పోలీస్ కేసు నమోదు అయిన నేపథ్యంలో క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి నోటీసులు జారీ చేసినట్లు' నోటీసుల్లో పేర్కొంది. ఈ వ్యవహారం వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని రోహిత్ రెడ్డికి పార్టీ ప్రధాన కార్యదర్శి పేరుతో నోటీసులు జారీ అయ్యాయి. ఈ అంశంపై ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ ఆదేశించింది. గడువులోపు సంతృప్తికరమైన వివరణ ఇవ్వకపోతే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే క్రమశిక్షణాత్మక చర్యలు తీసుకుంటామని పార్టీ అధిష్ఠానం హెచ్చరించింది. ఇకపోతే పైలట్ రోహిత్ రెడ్డి వ్యవహారాన్ని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా ద్వారా వచ్చిన ఆరోపణలపై వారం రోజుల్లోగా స్పష్టంగా లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు. షోకాజు నోటీసుకు గడువులోపు వివరణ సమర్పించకపోతే.. పార్టీ నియమావళి ప్రకారం వేటు


# హుస్నాబాద్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మొక్కజొన్న రైతుల సౌకర్యార్థం మంగళవారం హుస్నాబాద్ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్న కొనుగోలుపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మాట్లాడి మొక్కజొన్న అమ్మకానికి ఇబ్బంది కలగకుండా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుండి కనీస మద్దతు ధరతో మొక్కజొన్నను కొనుగోలు చేయాలని కోరగా వెంటనే స్పందించిన సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మంగళవారం నుండి మొక్కజొన్నను కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చారని తెలిపారు. హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మీలు, బొలిశెట్టి శివయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ, మార్ఫ్ ఫెడ్ అధికారులతో కలిసి హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్నల కొనుగోలు ప్రారంభించారని, రైతులకు ఇబ్బంది కలుగకుండా జిల్లా వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే పూర్తిస్థాయిలో మొక్కజొన్న కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందరాదని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# పోలీసులకు చిక్కిన ఘరానా చిట్ ఫండ్ మోసగాడు

- రాష్ట్రవ్యాప్తంగా 96 చీటింగ్ కేసుల నమోదు
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా వందల మందిని చిట్ ఫండ్స్ నడుపుతూ వందల మంది డిపాజిట్స్‌కు డబ్బు తిరిగి చెల్లించకుండా మోసం చేసి గత కొన్ని నెలలుగా తప్పించుకుంటూ తిరుగుతూ ఉన్న ఘరానా మోసగాడు పేరాల శ్రీనివాసరావును అరెస్టు చేసి ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పలు వివరాలు వెల్లడించారు. ప్రైవేట్ చిట్ ఫండ్స్ నడిపే వారిని ప్రజలు అంత గుడ్డిగా నమ్మవద్దని జిల్లా ఎస్పి అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఎస్పి మాట్లాడుతూ నిందితుడు తన అక్షర చిట్ ఫండ్స్ సంస్థ ద్వారా ప్రజలను ఆకర్షించడానికి అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చిట్ స్కీములు ప్రారంభించాడు. విశ్వసనీయంగా కనిపించేలా కార్యాలయాలు ఏర్పాటు చేసి, ఏజెంట్ల ద్వారా ప్రజలను చిట్టీల్లో చేరేలా ప్రోత్సహించాడు. ఈ క్రమంలో ఆదిలాబాద్ జిల్లా సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వందల మంది డిపాజిటర్ల నుండి పెద్ద మొత్తంలో డబ్బులు సేకరించి, గడువు వచ్చిన తరువాత డబ్బులు తిరిగి చెల్లించకుండా మోసం చేశాడు. ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఇప్పటివరకు 12 కేసులు నమోదు కాగా, బాధితులు రూ.99 లక్షలు చెల్లించగా వారికి సుమారు రూ.1.11 కోట్లు తిరిగి ఇవ్వాల్సి ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా 96 చీటింగ్ కేసులు నమోదయ్యాయి. కేసులు నమోదు కావడంతో నిందితుడు ఆరు నెలలుగా పోలీసులను తప్పించుకుంటూ పరారీలో తిరుగుతున్నాడు. అయితే పోలీసుల ప్రత్యేక బృందం సాంకేతిక ఆధారాలు మరియు గోప్య సమాచారం ఆధారంగా నిందితుడిని గుర్తించి సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించారు. నిందితుని వద్ద నుండి 5 మొబైల్ ఫోన్లను, ఒక ఐపాడ్‌ను, ఒక డొంగల్ ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, టూ టౌన్ సీఐ కె నాగరాజు, ఎస్ఐ అఖిల్, ఆర్ఎస్ఐ గోపికృష్ణ, ఐటి కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాసర ట్రిబుల్ ఐటీ ఆసుపత్రిలో నిర్లక్ష్యం

**సరైన వైద్య సంరక్షణ లేకపోవడంతో విద్యార్థిని మృతి : టిఎస్ఏఎస్**



**బాసర, మార్చ్17 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా బాసర లోని ట్రిబుల్ ఐటీ కళాశాలకు చెందిన పియుసి -2 మల్లిపూడి తేజస్విని మంగళవారం అనారోగ్యంతో ఆసుపత్రిలో మరణించిందని బుధవారం టీఎస్ఏఎస్ విద్యార్థి సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా మృతురాలు ఈ నెల 13న క్యాంపస్‌లోని ఆసుపత్రిలో జ్వరం వస్తున్న కారణంగా చికిత్స చేయించుకుంది అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో ఆమెను గాంధీ హాస్పిటల్ కు తరలించగా అక్కడ ఆమెకు లుకేమియా వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలియజేశారు. దురదృష్టవశాత్తు మంగళవారం ఆమె మరణించగా టీఎస్ఏఎస్ విద్యార్థి సంఘం ఆర్జీయూకేటీ బాసర కళాశాలలో ఆసుపత్రిలో సరియైన చికిత్స ఇవ్వని కారణంగా సరైన సమయంలో వ్యాధిని నిర్ధారించడంలో వైద్యులు విఫలమయ్యారని, దీనికి కారణం ముమ్మాటికి వారి నిర్లక్ష్యమేనని ఆ ప్రకటనలో తెలిపారు. ఆమెకి ప్రారంభదశలో వ్యాధిని నిర్ధారించినట్లయితే ఆ విద్యార్థిని బలి అయ్యేది కాదని పేర్కొన్నారు. అక్కడి ఆసుపత్రిలో అదునాతన డయాగ్నొస్టిక్ సౌకర్యాలు, వైద్య మౌలిక సదుపాయాల వ్యవస్థ, ఎమర్జెన్సీ పరిస్థితుల్లో చికిత్స ఆలస్యం వంటి లోపాలు స్పష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటము ఆడకుండా ఆసుపత్రిలో సరైన సదుపాయాలు ఉంచాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా విద్యార్థి మృతి చెందడంతో ఇప్పటికే పుట్టెడంత దుఃఖంలో ఉన్న కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించాలని, క్యాంపస్లో డయాగ్నొస్టిక్ పరికరాలు అందుబాటులో ఉంచాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సరైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ, రక్తంలో ఇన్ఫెక్షన్లు, లుకేమియా వంటి తీవ్రమైన వ్యాధులను గుర్తించడానికి సరైన డయాగ్నొస్టిక్ పరికరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్యాంపస్‌లోని ఆసుపత్రిలో సరైన వైద్య సంరక్షణ లేకపోవ డమే ఆమె మరణానికి కారణమని మృతు రాలి తల్లిదండ్రులు అన్నారనీ పేర్కొన్నారు, ఇది సంఘటన కాదు అని ఇది విద్యార్థి భద్రత, బాధ్యత, అలాగే జవాబుదారితనం కాబట్టి తక్షణమే దీనిపై స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

# మియాపూర్ వద్ద ఫార్మా బస్సు బోల్తా

- ఒకరికి తీవ్ర గాయాలు... స్వల్పంగా ట్రాఫిక్ జామ్

**హైదరాబాద్, మార్చి 17 (జనంసాక్షి) :** హైదరాబాద్ మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ పార్మా కంపెనీకి చెందిన బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలవ్వగా.. మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. లీ ఫార్మా కంపెనీకి చెందిన మినీ బస్సు మంగళవారం ఉదయం 80 గంటలకు 10 మంది ఉద్యోగులతో కేపీహెచ్‌బీ నుంచి గడ్డిపోతారం బయల్దేరింది. 8.30 గంటల సమయంలో మియాపూర్ చౌరస్తా నుంచి బాచుపల్లి వెళ్లే మార్గంలో బీకే ఎన్‌క్లేవ్ సమీపంలో యూటర్న్ వద్ద రెండు బస్సులు సమాంతరంగా వెళ్తున్నాయి. ఈ క్రమంలో ఓ బస్సును ఆకస్మికంగా కుడి వైపునకు తిప్పారు. దీంతో లీ ఫార్మాకు చెందిన బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలివైపు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో బస్సు ముందు సీటులో కూర్చున్న వ్యక్తి తలకు గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. రహదారిపై బస్సు బోల్తా పడటంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది.

# వేప పువ్వు కరువైంది!

- డై బ్యాక్ తెగులు సమస్య
- అంతరించిపోతున్న వేప చెట్లను కాపాడుకోవాలి
- ప్రభుత్వం స్పందించాలంటున్న ప్రజలు

**వరంగల్ ఈస్ట్, మార్చి 17 (జనం సాక్షి) :** తెల్లవారితే ఉగాది కానీ వేప పువ్వు కరువైపోయింది, ఆయుర్వేద మెడిసిన్ అనుకుంటున్నటువంటి వేపచెట్టును దృష్టిలో పెట్టుకొని వేప చెట్లు కనుమరుగయ్యే అవకాశం ఉందని భయమేస్తుంది. మళ్లీ మన వేప చెట్టుని బతికించుకోవాలి. అంతరించిపోతున్న వేప చెట్లు – 'డైబ్యాక్' తెగులుపై ప్రభుత్వం స్పందించాలి. మన పర్యావరణానికి ఎంతో మేలు చేసే వేప చెట్లు ప్రస్తుతం ఒక ప్రమాదకరమైన వైరస్ (డైబ్యాక్ తెగులు) బారిన పడి ఎండిపోతున్నాయి. గత మూడు సంవత్సరాలుగా మన ప్రాంతంలో అనేక చెట్లు కొమ్మల నుండి ఎండిపోతూ చనిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఫంగస్ కారణంగా ఆకులు పసుపు రంగులోకి మారి రాలిపోతున్నాయి. కొమ్మలు పైనుండి కిందికి ఎండిపోతూ చెట్టు మొత్తం నిర్జీవంగా మారుతోంది. సరైన నివారణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో వేప చెట్లు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. వ్యవసాయ మరియు అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి, రైతులకు మరియు ప్రజలకు ఈ తెగులు నివారణపై (కాపర్ ఆక్సిక్లోరైడ్ పిచికారీ వంటివి) అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.




# నాది రోలెక్స్ కాదు.. పదివేల వాచే!

## కేటీఆర్ అండతోనే ఫేక్ అకౌంట్ల దుష్ప్రచారం



- తప్పుడు ప్రచారాలపై ఆది శ్రీనివాస్ ఫైర్
- దుబాయ్ కేంద్రంగా కుట్రలు.. విషప్రచారం చేస్తే సహించేది లేదు
- బీసీ నేత ఎదగడం ఇష్టం లేకే వ్యక్తిత్వ దుష్ప్రచారం
- స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానన్న ఎమ్మెల్యే

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న వాచ్ వివాదంపై వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఘాటుగా స్పందించారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు బీఆర్ఎస్ అనుబంధ ఫేక్ అకౌంట్లు చేస్తున్న "రోలెక్స్ వాచ్" దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. తాను ధరించినది రోలెక్స్ వాచ్ కాదని, అది మైఖేల్ కోర్స్ బ్రాండ్‌కు చెందిన సాధారణ వాచ్ అని ఆయన స్పష్టం చేశారు.?గల్ఫ్ నుంచి వచ్చిన ఒక స్నేహితుడు బహుమతిగా ఇచ్చిన ఈ వాచ్ ధర సుమారు రూ 10,000 నుండి రూ 20,000 మధ్యలో ఉంటుందని, కానీ దీన్ని కావాలనే రూ 97 లక్షల విలువైన రోలెక్స్ వాచ్‌గా చూపిస్తూ అబద్ధాలను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. దుబాయ్ కేంద్రంగా ఫేక్ అకౌంట్లు సృష్టించి, డిజిజ టీవీ వంటి వేదికల ద్వారా ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కుట్రపూరితంగా ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఒక సామాన్య బీసీ వర్గానికి చెందిన వ్యక్తిగా తాను కష్టపడి ఎదిగి అసెంబ్లీకి చేరడం కొందరికి జీర్ణం కావడం లేదని, అందుకే ఇటువంటి నీచమైన ప్రచారాలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో తీసిన ఫోటోలను తప్పుగా వాడుకోవడం సభా నియమాలకు విరుద్ధమని, ఈ విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తానని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి నిరాధార ఆరోపణలు ఆపాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# బైక్‌ను ఢీకొన్న బస్సు

- విద్యార్థి మృతి

**గద్వాల, మార్చి17 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గద్వాల రైల్వే స్టేషన్ సమీపంలో బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న ఒక విద్యార్థి మృతిచెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి సమాచారం తెలియగానే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాము (17)గా గుర్తించారు. గాయపడిన మరో ఇద్దరిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. బాధితులను హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కాలేజీ విద్యార్థులుగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట ఆశాల ధర్నా

- అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు



**నాగర్‌కర్నూల్, మార్చి17 (జనంసాక్షి) :** తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారించాలని కోరుతూ నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముందు ఆశ కార్యకర్తలు ధర్నాకు దిగారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అయితే ధర్నా చేస్తున్న ఆశలను పోలీసులు అరెస్టు చేశారు. వారిని బలవంతంగా పోలీస్ వ్యాన్‌లో ఎక్కించుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో కలెక్టరేట్ ఎదుట ఉద్రిక్త వాతారణం నెలకొంది. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ తమకు అనేక హామీలను ఇచ్చిందని.. కానీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తమ సమస్యల పరిష్కారానికై కలెక్టర్ కార్యాలయం ఎదుట 48 గంటల ధర్నాకు పూనుకున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఈ ధర్నా చేపట్టగా.. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. మంగళవారం సైతం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగగా.. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

# వ్యవసాయ శాఖకు రూ.2వేల కోట్లు కేటాయించండి

- తెలంగాణ రైతు సంఘం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** వ్యవసాయ శాఖకు రూ.2వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్ రావు, తీగల సాగర్ కోరారు. బడ్జెట్ ప్రవేశ పెడుతున్న దృష్ట్యా వ్యవసాయ రంగానికి కేటాయింపులపై మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 2025-26 సంవత్సరానికి వ్యవసాయ శాఖకు రూ.18,101 కోట్లు పశు సంవర్ధక శాఖకు రూ.1,657 కోట్లు కేటాయించారు. అడవులకు రూ.1,022 కోట్లు, సహకార శాఖకు రూ.158 కోట్లు కేటాయింపు చేశారని, వ్యవసాయ శాఖ కేటాయింపులో నిర్వహణ పద్దు కింద రూ.1,138.42 కోట్లు, ప్రగతి పద్దుకింద రూ.16,962 .87 కోట్లు కేటాయించారని, వ్యవసాయ పథకాలకు ప్రగతి పద్దులో రూ.16,230 కోట్లు కేటాయించారు. ఇందులో రైతు భరోసా రూ.9,000ల కోట్లు చేరాయని వివరించారు. రాష్ట్రంలో వ్యవసాయ పరిశోధనలు క్రమంగా తగ్గించి వేశారని, రాష్ట్రంలో 27 పరిశోధన కేంద్రాలకు నిధులు లేక పనిచేయడం లేదని, రాష్ట్రం నుండి 20దేశాలకు విత్తనాలు సరఫరా చేస్తున్న తెలంగాణ రాష్ట్రానికి వ్యవసాయ పరిశోధనలు లేకపోవడంతో విదేశాల నుండి దిగుమతి చేసుకున్న టెక్నాలజీపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారని, సమశీతోష్ణ రాష్ట్రంగా ఉన్న తెలంగాణకు దిగుమతి చేసుకున్న టెక్నాలజీ విత్తనాల వల్ల ఉత్పాదకత తగ్గి, ఉత్పత్తి పడిపోతున్నది. హరిత విప్లవ కాలంలో 36 డిగ్రీల వేడి ఉన్నప్పుడు కనిపెట్టబడ్డ విత్తనాలు నేడు 46 డిగ్రీల వేడికి వాతావరణం పెరగడంతో పాత టెక్నాలజీ విత్తనాలు దిగుబడులు పెంచడం లేదని తెలిపారు. రాష్ట్రంలోని పరిశోధన కేంద్రాలను నిర్వహించడానికి వ్యవసాయ. హార్టికల్చర్, పశు సంరక్షణ విశ్వవిద్యాలయాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, వ్యవసాయ శాస్త్రవేత్తలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎఫ్ 1, హైబ్రీడ్, హై యీల్డింగ్, సర్టిఫైడ్ విత్తనాలను రైతులకు అందుబాటులో పెట్టాలని, నాణ్యత లేని, కల్తీ విత్తనాల వల్ల యేటా రైతులు 5,6 లక్షల ఎకరాల్లో పంటల దిగుబడులను నష్టపోతున్నారని తెలిపారు. ప్రతి మూడు గ్రామాలకు ఒక అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఆఫీసర్‌ను కేటాయించాలని, హార్టికల్చర్ శాఖలో ఉన్న 600ల ఖాళీలను భర్తీ చేయాలని, వ్యవసాయ శాఖను మారుతున్న వాతావరణానికి అనుగుణంగా రైతులకు సలహాలు ఇవ్వడానికి, ట్రైనింగ్ ఇవ్వడానికి ప్రదర్శన క్షేత్రాల సందర్శనకు అనుగుణంగా నిధులు కేటాయించి కార్యక్రమాలు రూపొందించాలి. భూసార పరీక్షలు జరిపి ఏ భూములలో ఏ పంటలు వేయాలో తెలియజేస్తూ "సాయిల్ హెల్త్ కార్డులు " ప్రతి రైతుకు ఇవ్వాలని కోరారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం "యాక్షన్ ప్లాన్" వివరాలతో పుస్తకంగా ప్రింట్‌చేసి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భారీ ప్రాజెక్టులను, మధ్య తరహా ప్రాజెక్టులకు ప్రాధాన్యతా క్రమంలో సమయం నిర్ణయించి, తగిన నిధులు కేటాయించి పూర్తి చేయాలని, కరువు ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, 70శాతం పూరైయిన ప్రాజెక్ట్‌లకు బడ్జెట్ నిధులు కేటాయించాలని, సాగు నీటికి కేటాయించిన నిధులను ప్రగతి పద్దుకు వ్యయం చేయాలని డిమాండ్ చేశారు.

# ప్రతిరోజూ అక్కడ రోడ్డు ప్రమాదాలే!

- ప్రమాదాలకు నిలయంగా ఉరుసు పై ఓవర్ బ్రిడ్జి ప్రాంతం
- గాయాల పాలవుతూ ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి
- సమస్య పరిష్కరించాలని ప్రజల విన్నపం



**వరంగల్ ఈస్ట్, మార్చి 17 (జనం సాక్షి) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని హంటర్ రోడ్ నుండి ఉరుసు బైపాస్ వెళ్లే ఫ్లైఓవర్ బ్రిడ్జి( ఫాదర్ కొలంబో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) మెడికల్ కాలేజీ వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహన చోదకులు, పాదచారులు గాయాల పాలై ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి కనిపిస్తుంది. ప్రధానంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుండి ఉరుసు వైపు వెళ్తున్న వాహనాలు, ఉరుసు బైపాస్ నుండి హంటర్ రోడ్ వైపు వెళ్తున్న వాహనాలు బ్రిడ్జ్ వద్దకు రాగానే ప్రమాదాలకు గురి అవుతున్నాయి. ప్రధానంగా ఇక్కడ ఉన్నటువంటి మెడికల్ కాలేజ్ వద్ద ఈ ప్రమాదాలు మరి ఎక్కువగా జరుగుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఇటు మెడికల్ కాలేజీకి వెళ్లేటువంటి వాహనాలు, మెడికల్ కాలేజ్ నుండి బయటకు వచ్చే వాహనాలు, అటు హంటర్ రోడ్ నుండి ఉరుసు రోడ్డు ఖమ్మం ప్రధాన రహదారి వైపు వెళ్లే సమానాలు, అటు నుంచి ఇటు వచ్చే వాహనాల వల్ల, వాటి వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు సమాచారం. మెడికల్ కాలేజ్ వద్ద సరైన సెక్యూరిటీ లేకపోవడం వల్ల వాహనాలు కంట్రోల్ కాకుండా ప్రమాదాల గురవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఉరుసు ప్రాంతానికి చెందిన ఈర్ల మల్లేశం అతని భార్య రాధిక స్కూటీ మీద వెళ్తుండగా హాస్పటల్ లోపలికి వెళ్తున్న కారు వేగంగా రావడంతో స్కూటీని కంట్రోల్ చేసుకునే ప్రయత్నం చేస్తున్న క్రమంలో వెనుక నుంచి వచ్చినటువంటి మరో వాహనం ఢీ ఢీ కొట్టింది. దీంతో స్కూటీ నడుపుతున్నటువంటి ఈర్ల మల్లేశం అతని భార్య రాధికకు గాయాలయ్యాయి. వీళ్ళ పక్కనే ఉన్నటువంటి ఎస్సార్ ప్రైమ్ స్కూల్లో పనిచేస్తున్న యాకూబ్ రెడ్డి కి కూడా గాయాలైనట్లు తెలిపారు. ఈ విషయమై మిల్స్ కాలనీ పోలీసులకు బాధితులు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇదే ప్రాంతంలో రెండు రోజుల క్రితం ఆటో ప్రమాదం, కారు ప్రమాదం జరిగాయి. ఇందులో పలువురు తమ ప్రాణాలను కోల్పోయినట్లు సమాచారం. రాత్రుల్లో ఇదే ప్రాంతంలో లైట్లు లేక చీకట్లు అలుముకోవడం వల్ల కూడా ప్రమాదాల సంఖ్య నిత్యం పెరుగుతుంది. ప్రమాదాల నివారణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు ప్రజలు కోరుతున్నారు. మెడికల్ కళాశాల నిర్వాహకులు కూడా తమ సెక్యూరిటీని పెంచి హాస్పిటల్‌కు వచ్చే పోయే వారిని కంట్రోల్ చేస్తూ ప్రమాదాల నివారణకు పాటుపడాలని కోరుతున్నారు.


అమెరికా-జియోనిస్ట్ దాడులకు వ్యతిరేకంగా

# వీరోచిత ఇరాన్ ప్రజా ప్రతిఘటనతో ఐక్యత ప్రకటిద్దాం!

అంతర్జాతీయ చట్టాలన్నింటినీ, యుద్ధానంతర ఒప్పందాలు, కన్వెన్షన్లు, చట్టబద్ధ ప్రమాణాలను పూర్తిగా ఉల్లంఘిస్తూ 2026 ఫిబ్రవరి 28న ప్రారంభమైన అమెరికా-జియోనిస్ట్ దాడులు ఇరాన్‌పై ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి;రోజు రోజు కీ మరింత భయానక రూపం దాల్చుతున్నాయి. ప్రపంచ ప్రజల ప్రధాన శత్రువైన అమెరికా సామ్రాజ్యవాదం, దాని మధ్యప్రాచ్య సైనిక అవుట్‌పోస్ట్‌గా పనిచేస్తున్న జియోనిస్ట్ ఇజ్రాయెల్ కలిసి, చర్చలు జరుగుతున్న సమయంలోనే ఈ దుర్మార్గ దాడిని ప్రారంభించాయి.

ఇరాన్ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమెనీని హత్య చేయడం నుండి ప్రారంభమైన ఈ దాడుల్లో, ఒక ప్రాథమిక పాఠశాలపై బాంబుదాడి చేసి సుమారు 175 మందిని, అందులో 160 మంది చిన్నారులను అమానుషంగా హతమార్చారు. ఈ దాడులు ఇప్పటికే మొత్తం మధ్యప్రాచ్య ప్రాంతాన్ని అస్థిరతలోకి నెట్టేశాయి. అపారమైన పౌర మరణాలు, పర్యావరణ నాశనం, ఆర్థిక పతనం, చమురు ధరల ఆకాశాన్నంటిన పెరుగుదల ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్ ప్రజల వీరోచిత ప్రతిఘటన నేపథ్యంలో, ట్రంప్-నెతన్యాహు, వారి ఇస్లాం వ్యతిరేక మిత్రుల లెక్కలన్నిటిని తారుమారు చేస్తూ పరిస్థితి అణు యుద్ధ ప్రమాదాల దిశగా నెట్టబడుతోన్నది. చట్టవిరుద్ధంగా అణు ఆయుధాలను సంపాదించుకున్న జియోనిస్ట్ పాలక వర్గం ఉన్నందున ఈ ప్రమాదం మరింత తీవ్రమవుతోన్నది. ఈ యుద్ధం ఎలాంటి ముగింపుకు వచ్చినా ఒక విషయం మాత్రం స్పష్టమైంది: మధ్యప్రాచ్య ప్రాంతంలోని భౌగోళిక-ఆర్థిక సమీకరణాలు ఇక ముందు ఎప్పటికీ మునుపటి విధంగా ఉండవు. ఈ క్రూర సామ్రాజ్యవాద దాడి ప్రపంచ పరిస్థితిలో పెరుగుతున్న అతి తీవ్రవాద నయా-ఫాసిస్టు ధోరణులను మరోసారి బహిర్గతం చేసింది. ప్రపంచంలో అతిపెద్ద సైనిక యంత్రాంగాన్ని నియంత్రిస్తున్న దుర్మార్గమైన మరియు మానసికంగా వికృతమైన పాలక వర్గాలకి ఎదురు నిలుస్తూ ఇరాన్ ఒంటరిగా పోరాడుతోంది. ఇది సామ్రాజ్యవాద వ్యవస్థ యొక్క తీవ్ర పతనాన్ని, క్షీణతను ప్రతిబింబిస్తోన్నది. దీనికి స్పష్టమైన ఉదాహరణగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో గల్ఫ్ సహకార మండలి (GCC) ప్రతిపాదించిన తీర్మానం నిలిచింది. భారతదేశం సహా 135 దేశాలు దీనికి మద్దతు ఇచ్చాయి. ఈ తీర్మానం ఇరాన్ దాడులను వెంటనే నిలిపివేయాలని కోరుతూ, హోర్ముజ్ సముద్రసంధి ద్వారా అంతర్జాతీయ నావిగేషన్‌ను అడ్డుకుంటోందని ఇరాన్‌ను ఖండించింది. అమెరికా-జియోనిస్ట్ దాడులను ఖండించాల్సిన బదులు, ఈ తీర్మానం సామ్రాజ్యవాదానికి మోకరిల్లిన నయా వలస విధేయతకు నిదర్శనంగా నిలిచింది.

ఆసియా-ఆఫ్రికా-లాటిన్ అమెరికా దేశాల్లోని అనేక ప్రభుత్వాలు ఈ పక్షపాత తీర్మానానికి దూరంగా ఉండటం ప్రోత్సాహకరమైన విషయం. చైనా, రష్యా కూడా తమ స్వార్థ ప్రయోజనాల దృష్ట్యా దీనికి మద్దతు ఇవ్వలేదు. మరోవైపు, ఇరాన్ తన ఆత్మరక్షణ వ్యూహంలో భాగంగా ఇరాక్, కువైట్, జోర్డాన్, యుఎఇ వంటి దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణి, డ్రోన్ దాడులు ప్రారంభించింది. ఇది అమెరికా అతివిశ్వాసానికి తీవ్రమైన దెబ్బగా నిలిచింది. ఇదే సమయంలో ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు 20 శాతం జరిగే హోర్ముజ్ సముద్రసంధి మార్గాన్ని ఇరాన్ పరిమితం చేసింది. ఫలితంగా ప్రపంచ చమురు,గ్యాస్ ధరలు ఒక్కసారిగా పెరిగి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేశాయి. ఈ చర్య అమెరికా ఆధిపత్యానికి వ్యూహాత్మక దెబ్బగా మారింది. అసలు విషయం ఏమిటంటే, ఇరాన్ ఇప్పుడు అమెరికా-జియోనిస్ట్ సంయుక్త సైనిక శక్తికి ఎదురు నిలుస్తోంది. గత అర్ధ శతాబ్దంలో మధ్యప్రాచ్యంలో ఉన్న మొత్తం అమెరికా సైనిక నెట్‌వర్క్‌కు ప్రత్యక్ష సవాలు విసిరిన ఏకైక దేశం ఇరాన్ మాత్రమే. ఇది ట్రంప్ పాలనకు మాత్రమే కాదు, రెండు శతాబ్దాలుగా ప్రపంచాన్ని దోపిడీ చేస్తున్న ఆంగ్లో-సాక్సన్ సామ్రాజ్యవాద వ్యవస్థకు కూడా సవాలుగా నిలుస్తోంది. ఇరాన్‌పై జరిగిన ఈ దాడి ఒక్కరోజులో జరిగిన పరిణామం కాదు. 2018లో ట్రంప్ తన మొదటి పదవీకాలంలో ఇరాన్ అణు ఒప్పందం (JCPOA) నుంచి ఏకపక్షంగా వైదొలగడం నుంచే ఈ పరిస్థితికి పునాది పడింది. 2003లో ఇరాక్‌పై "విపరీత విధ్వంస ఆయుధాలు" ఉన్నాయని తప్పుడు ఆరోపణలతో బుష్-బ్లెయిర్ చేసిన దాడిలానే, ఇప్పుడు కూడా ఇరాన్‌పై అణు కార్యక్రమం పేరిట ఈ దాడి న్యాయీకరించబడుతోంది. అయితే ఇరాన్ ప్రజల నిరంతర ప్రతిఘటన ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైనిక యంత్రాంగానికి గట్టి దెబ్బలు ఇస్తూ అమెరికా సామ్రాజ్యవాదం వ్యూహాత్మక బలహీనతను బయటపెట్టింది. ఈ పరిస్థితుల్లో యుద్ధం ముగియాలంటే ఇరాన్ మూడు ప్రధాన షరతులను ప్రతిపాదించింది. మధ్యప్రాచ్య ప్రజలు గల్ఫ్ ప్రాంతం మొత్తం నుంచి అమెరికా సైనిక స్థావరాలను తక్షణమే తొలగించాలని గట్టిగా డిమాండ్ చేయాలి. విధంగా గాజా, ఇతర ఆక్రమిత ప్రాంతాల నుంచి జియోనిస్ట్ ఇజ్రాయెల్ పూర్తిగా వెనక్కు వెళ్లి, అన్ని మతాలకు చెందిన స్థానిక ప్రజలకు సమాన హక్కులు కలిగిన ప్రజాస్వామ్య, లౌకిక పాలస్తీనా రాష్ట్రం ఏర్పడాలి.



**అంతర్జాతీయ విభాగం**
**సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్**
**తెలుగు స్వేచ్ఛానువాదం:**
**కొల్లిపర వెంకటేశ్వరరావు, కేంద్ర కమిటీ సభ్యుడు,సిపిఐ(యం,యల్)రెడ్ స్టార్**
**9392325652,**

# వినాశపు అంచున విశ్వం

## అభివృద్ధి ముసుగులో అంతమవుతున్న ఆకుపచ్చని ఆశలు!

**ప్రకృతి మాత నిశ్శబ్దంగా రోదిస్తోంది. అడవులు అంతరిస్తున్నాయి. నదులు విషతుల్యమవుతున్నాయి, పీల్చే గాలి ప్రాణాంతకమవుతోంది. మనం దేనిని అభివృద్ధి అని పిలుచుకుంటున్నామో, అది నిజంగా మన పురోగతా లేక మన సమాధిని మనమే తవ్వుకుంటున్న అజ్ఞానమా? నేటి సమాజం ఎదుర్కోవాల్సిన అత్యంత కఠినమైన ప్రశ్న ఇది. ప్రకృతికి మనం ఇచ్చే గౌరవం ఏమిటి? గుప్పెడు కాంక్రీటు అడవుల కోసం ఎకరాల కొద్దీ పచ్చని అడవులను బలిపీఠం ఎక్కించడమేనా? ఆధునిక మానవుడు తన సౌకర్యాల కోసం ప్రకృతిని ఒక బానిసలా చూస్తున్నాడు.**

అడవులు మాయమవుతున్నాయి, నదులు కలుషితమవుతున్నాయి, ఆకాశం దట్టమైన పొగమంచులో మునిగిపోతోంది, సముద్రాలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. ఇవన్నీ ఎక్కడో అమెరికాలోనో, ఆఫ్రికాలోనో జరుగుతున్న సంఘటనలు కావు,మన కళ్ల ముందే, మన ఊళ్లలో, మన నగరాల్లో, మన పెరటి గాలిలో ప్రతిరోజూ మనం అనుభవిస్తున్న చేదు నిజాలు. అయినప్పటికీ, మనం అభివృద్ధి అనే ఆకర్షణీయమైన ముసుగులో ఈ విధ్వంసాన్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం. ఇది కేవలం ఒక పొరపాటు కాదు ఇది భవిష్యత్ తరాల పట్ల మనం చేస్తున్న ఒక క్షమించరాని మహా అన్యాయం. నిజానికి అభివృద్ధి అంటే ఏమిటి? కేవలం ఆకాశహర్మ్యాలు నిర్మించడమా? లేక మనిషి జీవన నాణ్యత మెరుగుపడటమా? ఆ అభివృద్ధి కోసం ప్రకృతిని పూర్తిగా ఆహుతి చేస్తే, ఆ పురోగతి ఎంతకాలం నిలబడుతుంది? ప్రాణవాయువు లేని చోట బంగారు భవనాలు ఉంటే ఏం లాభం? ఈ ప్రాథమిక ప్రశ్నలకు సమాధానం వెతకడమే నేటి అత్యవసర అవసరం. మన దేశంలో ప్రతి ఏటా లక్షల హెక్టార్ల అడవులు గొడ్డలికి బలైపోతున్నాయి. విశాలమైన రహదారులు, భారీ గనుల తవ్వకాలు, అంతం లేని పారిశ్రామికీకరణ వీటి కోసం అడవుల గుండెల్లో గునపాలు దించుతున్నాం. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో సాగునీటి ప్రాజెక్టులు, ఇతర మౌలిక సదుపాయాల పేరుతో వేల ఎకరాల అటవీ భూమిని కాంక్రీటు మయం చేస్తున్నాం. అడవి అంటే కేవలం కొన్ని వేల చెట్ల సమూహం మాత్రమే కాదు; అదొక సజీవ వ్యవస్థ. అవి మేఘాలను రమ్మని పిలుస్తాయి, భూమి కోతకు గురికాకుండా కాపాడతాయి, వేలాది మూగజీవాలకు నీడను ఇస్తాయి. అన్నిటికంటే ముఖ్యంగా, మనం వదిలే విషపూరిత కార్బన్ డయాక్సైడ్ను పీల్చుకుని మనకు స్వచ్ఛమైన ఆక్సిజను ప్రసాదిస్తాయి. ఒక్క చెట్టును నరకడం అంటే ఒక సంక్లిష్టమైన జీవవైవిధ్యాన్ని అంతం చేయడమే. శాస్త్రవేత్తల హెచ్చరికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా వెలువడుతున్న కార్బన్ ఉద్గారాల్లో 10 నుండి 15 శాతం కేవలం అటవీ నిర్మూలన వల్లే సంభవిస్తున్నాయి. అడవులు లేకపోతే వర్షాలు ఉండవు, వర్షాలు లేకపోతే వ్యవసాయం కుంటుపడుతుంది. రైతు కన్నీరు పెడితే దేశానికి అన్నం ఉండదు. ఇది కేవలం పర్యావరణ వేత్తల గోడు మాత్రమే కాదు; ఇది సామాన్య మనిషి మనుగడకు సంబంధించిన మరణశాసనం.తెలుగు సంస్కృతిలో నదులకు దైవత్వం ఆపాదించాం. కృష్ణా, గోదావరి, తుంగభద్ర వంటి నదులను తల్లిలా భావించి పూజిస్తాం. కానీ ఆచరణలో మనం చేస్తున్నదేమిటి? పారిశ్రామిక వ్యర్థాలను నేరుగా నది గర్భంలోకి వదులుతున్నాం. పొలాల్లో వాడే రసాయన ఎరువులు వర్షపు నీటితో కలిసి నదుల్లో చేరుతున్నాయి. శుద్ధి చేయని నగర మురుగు నీరు నదులను విషతుల్యం చేస్తోంది. ఫలితంగా నది నీరు తాగడానికి కాదు కదా, కనీసం పొలాలకు పారించడానికి కూడా వీలులేకుండా పోతోంది. ఒకప్పుడు హైదరాబాద్ నడిబొడ్డున స్వచ్ఛంగా ప్రవహించిన మూసీ నదిని నేడు చూస్తే కన్నీళ్లు వస్తాయి. అదొక మురుగు కాలువగా, రోగాల నిలయంగా మారిపోయింది. అందులో చేపలు బతకలేవు, గట్టున ఉన్న పక్షులు నీరు తాగలేవు. ఇది కేవలం మూసీ కథ కాదు, దేశంలోని మెజారిటీ నదుల దైన్య స్థితి.

**స్వచ్ఛమైన గాలి, తాగడానికి శుభ్రమైన నీరు, పక్షుల కిలకిలారావాలు కూడా అభివృద్ధి సూచికలే.మనం ఈ భూమిని మన పూర్వీకుల నుండి వారసత్వంగా పొందలేదు, మన పిల్లల నుండి అప్పుగా తీసుకున్నాం. ఆ అప్పును మనం ఎలా తిరిగిస్తాం?**

నదులు కలుషితం కావడం వల్ల మత్స్యకారులు తమ జీవనాధారాన్ని కోల్పోతున్నారు. తీర ప్రాంత ప్రజలు రోగాల పాలవుతున్నారు. మనం సాధించిన అభివృద్ధి మన నదులను శవనదులుగా మారుస్తోంది. భారతదేశంలోని అనేక నగరాలు వాయు నాణ్యతలో అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్నాయి. మితిమీరిన వాహనాలు, భారీ విద్యుత్ కేంద్రాల నుండి వెలువడే



పొగ, నిర్మాణ పనుల వల్ల రేగే దుమ్ము ఇవన్నీ కలిసి మనం పీల్చే గాలిని విషపూరితం చేస్తున్నాయి. ప్రతి శ్వాస ఇప్పుడు ఒక పోరాటంగా మారింది. వాయు కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, ఆస్తమా, గుండె జబ్బులు వంటి ప్రాణాంతక వ్యాధులు వృద్ధుల నుండి పసిపిల్లల వరకు అందరినీ వేధిస్తున్నాయి. అధ్యయనాల ప్రకారం, మన దేశంలో ఏటా పది లక్షల మందికి పైగా వాయు కాలుష్యం కారణంగానే కన్నుమూస్తున్నారు. ఇది ఏ యుద్ధం లేదా మహమ్మారి సృష్టించే విధ్వంసం కంటే తక్కువ కాదు. ఉద్యోగాలు వస్తున్నాయి, కర్మాగారాలు వెలుస్తున్నాయి అని సంబరపడుతున్నాం కానీ, ఆ అభివృద్ధి వల్ల ఆసుపత్రుల పాలై ఖర్చవుతున్న కోట్ల రూపాయలను ఎందుకు లెక్కించడం లేదు? ప్రాణవాయువు కొనుక్కోవాల్సిన దుస్థితికి మనం చేరుకుంటున్నాం అంటే, మనం అభివృద్ధి చెందుతున్నామా లేక వినాశనం వైపు పయనిస్తున్నామా? భారతదేశంలో సుమారు 30 శాతం భూమి ఇప్పటికే సారహీనంగా మారిపోయింది. రైతు అధిక దిగుబడి కోసం వాడే రసాయన ఎరువులు, పురుగు మందులు నేలను నిర్జీవం చేస్తున్నాయి. ఒక సెంటీమీటర్ సారవంతమైన నేల పొర తయారు కావడానికి ప్రకృతికి దాదాపు వెయ్యి ఏళ్లు పడుతుంది. కానీ మనం కొన్ని దశాబ్దాల్లోనే దానిని పనికిరాకుండా చేస్తున్నాం. నేల అంటే కేవలం మట్టి కాదు, అది కోట్ల సూక్ష్మజీవుల నివాసం. ఆ వ్యవస్థ దెబ్బతింటే మరుసటి తరం ఆహారం కోసం అల్లాడాల్సి వస్తుంది. రైతును దోషిగా అనలేం, ఎందుకంటే ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ అతనిని ఆ దిశగానే నడిపిస్తోంది. ప్రత్యామ్నాయ మార్గాలు లేని రైతు, రేపటి నష్టాన్ని మరిచి ఇవాల్టి దిగుబడి కోసం నేలతల్లిని విషం చేస్తున్నాడు. సముద్రాలు భూమికి ఊపిరిపోస్తాయి. వాతావరణాన్ని సమతుల్యం చేస్తాయి. కానీ నేడు సముద్ర గర్భం ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. మనం వాడి పారేసే ప్లాస్టిక్ సముద్ర జీవుల పొట్టల్లోకి చేరుతోంది. ఆ చేపలనే మనం ఆహారంగా తీసుకుంటున్నాం. అంటే అక్షరాలా మనం ప్లాస్టిక్ తింటున్నాం. జీవవైవిధ్యం దెబ్బతింటే పర్యావరణ గొలుసు తెగిపోతుంది. ప్రకృతిలో ఏ ఒక్క జీవి అంతరించినా దాని ప్రభావం మానవాళిపై ఖచ్చితంగా ఉంటుంది. తేనెటీగలు లేని లోకంలో పరాగసంపర్కం జరగదు, పంటలు పండవు. ప్రకృతిలోని ప్రతి అనుసంధానం అత్యంత కీలకమైనది. భూతాపం (Global Warming) ఇప్పుడు ఒక సిద్ధాంతం కాదు, అనుభవిస్తున్న వాస్తవం. మంచు పర్వతాలు కరుగుతున్నాయి, సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. అకాల వర్షాలు, భయంకరమైన తుఫానులు, ఎండల తీవ్రత ఇవన్నీ ప్రకృతి ఇస్తున్న హెచ్చరికలు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, ఈ కాలుష్యానికి ఏమాత్రం కారణం కాని పేద ప్రజలు, రైతులు దీని వల్ల ఎక్కువగా నష్టపోతున్నారు. ధనిక దేశాలు, పారిశ్రామిక వేత్తలు సృష్టించిన గందరగోళానికి సామాన్యుడు బలవుతున్నాడు. దీనినే పర్యావరణ అన్యాయం అంటారు. అభివృద్ధి, పర్యావరణం ఒకదానికొకటి శత్రువులు కావు. నిజమైన పురోగతి అంటే పర్యావరణంతో మమేకమై సాగడమే. పరిష్కార మార్గాలు స్పష్టంగా ఉన్నాయి. అడవులను కాపాడటం ప్రాథమిక ధర్మం. ప్రతి ఖాళీ ప్రదేశంలో చెట్లు నాటాలి. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు, సామాజిక బాధ్యత కావాలి. బొగ్గు, పెట్రోల్ వంటి శిలాజ ఇంధనాల వాడకం తగ్గించి సౌర, పవన విద్యుత్ వైపు మొగ్గు చూపాలి. వాడి పారేసే సంస్కృతికి స్వస్తి పలకాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ను పూర్తిగా నిషేధించాలి. నదుల్లోకి వ్యర్థాలు చేరకుండా కఠిన చట్టాలు అమలు చేయాలి. మురుగు నీటిని శుద్ధి చేసిన తర్వాతే వదలాలి. మట్టి ఆరోగ్యాన్ని కాపాడటానికి రసాయనాలకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. పర్యావరణ పరిరక్షణ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల రక్తంలో నిండాలి. చరిత్రలో గొప్ప గొప్ప నాగరికతలు పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేయడం వల్లనే అంతరించిపోయాయి. మెసపొటేమియా నుండి సింధూ నాగరికత వరకు అన్నీ ప్రకృతి ఆగ్రహానికి గురైనవే. మనం ఇప్పుడు అదే పతనం వైపు పయనిస్తున్నామా? జిడిపి పెరగడం మాత్రమే అభివృద్ధి కాదు. స్వచ్ఛమైన గాలి, తాగడానికి శుభ్రమైన నీరు, పక్షుల కిలకిలారావాలు కూడా అభివృద్ధి సూచికలే. మనం ఈ భూమిని మన పూర్వీకుల నుండి వారసత్వంగా పొందలేదు, మన పిల్లల నుండి అప్పుగా తీసుకున్నాం. ఆ అప్పును మనం ఎలా తిరిగిస్తాం? ఎండిపోయిన నదులు, నరికివేసిన అడవులు, విషపూరితమైన గాలిని ఇచ్చి వెళ్లామా? లేక పచ్చని ప్రకృతిని అందిద్దామా? సమయం మించిపోతోంది. ఇప్పుడు మనం మేల్కొనకపోతే, రేపటి తరానికి మనం ఇచ్చేది కేవలం ఒక శిథిలమైన భూగోళం మాత్రమే. అభివృద్ధి ప్రకృతిని తొక్కుకుంటూ కాదు, ప్రకృతితో కలిసి అడుగులు వేయాలి. ఇది మనకు ఉన్న ఒక ఆప్షన్ కాదు, ఇది మన మనుగడ కు ఉన్న ఏకైక మార్గం.


**డా.సూర్యదేవర రామకృష్ణ,**
**9490754169**

# బ్రిక్స్ ఆశయాలకు, భారత ప్రతిష్టకు మోదీ తిలోదకాలు

అంతర్జాతీయ సంబంధాల చరిత్రలో ఒక దేశం తన ప్రాధాన్యతలను, విలువలను, నైతిక బాధ్యతలను పక్కనపెట్టి మరొక దేశానికి లోబడి ప్రవర్తించడాన్ని 'రాజీ విదేశాంగ విధానం' అంటారు. నేడు భారతదేశం ఆ దిగజారుడు స్థితికి చేరుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా, అత్యంత ప్రాచీన నాగరికతగా, అలీన ఉద్యమానికి మూలస్తంభంగా నిలిచిన భారత్, నరేంద్ర మోదీ నాయకత్వంలో దౌత్యపరమైన బలహీనతకు, నైతిక దివాళాకు ప్రతీకగా మారింది. బ్రిక్స్ కూటమికి అధ్యక్షత వహిస్తున్న భారత్ పశ్చిమాసియా సంక్షోభంలో మౌనం వహించడం ఈ విదేశాంగ విఫలోద్యమానికి నిదర్శనం అని పార్లమెంటులో కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు.

బ్రిక్స్ అంటే బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా దేశాల సమూహం. ఇది పాశ్చాత్య దేశాల ఆధిపత్యాన్ని సవాల్ చేస్తూ, బహుళ ధ్రువ ప్రపంచాన్ని నిర్మించే లక్ష్యంతో ఏర్పడిన వేదిక. ఈ కూటమికి అధ్యక్షత వహించడమంటే ప్రపంచ దక్షిణార్ధ దేశాల తరఫున మాట్లాడే బాధ్యత, శాంతి, సుస్థిరత్వం కోసం కృషి చేసే నైతిక బాధ్యత స్వయంచాలకంగా వస్తుంది. కానీ ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా చేసిన వైమానిక దాడులపై భారత్ మౌనంగా ఉండిపోవడం బ్రిక్స్ అధ్యక్ష పదవి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న అవమానకరమైన వైఖరిని తెలియజేస్తోంది.

కేవలం ఇరాన్ దాడులు మాత్రమే కాదు. హిందూ మహాసముద్రంలో అమెరికా నేవీ ఇరాన్ నేవీకి చెందిన యుద్ధనౌకపై దాడి చేసింది,ఆ నావ భారత దేశ ఆహ్వానం మేరకు ఇక్కడకు అతిథి గా వచ్చింది. అలాగే గల్ఫ్ దేశాలలోని సైనికేతర లక్ష్యాలపై ఇరాన్ చేస్తున్న దాడులు- ఇవన్నీ భారత్ కు ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధించిన అంశాలే. ఇంతటి సున్నితమైన సమయంలో సమష్టి ప్రకటన విడుదల చేయడానికి కూడా భారత ప్రభుత్వం ధైర్యం చేయలేదు. ఎందుకు? కారణం స్పష్టం: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ను ప్రసన్నం చేసుకోవడం, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడం. ఈ రాజీ వైఖరి కొత్తదేమీ కాదు. గత వారం ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ హత్యపై మోదీ మౌనంగా ఉండిపోయారు. ఇరాన్ తో భారత్ చారిత్రక సంబంధాలను కలిగి ఉంది. 'చాబహార్' ఓడరేవు అభివృద్ధి ద్వారా ఆఫ్ఘనిస్తాన్, మధ్య ఆసియాకు ప్రవేశ ద్వారంగా ఇరాన్ వ్యవహరిస్తోంది. కానీ అమెరికా ఒత్తిడికి లొంగిపోయి, ఇజ్రాయెల్ అనుగ్రహం కోసం ఈ





సంబంధాలను బలి ఇవ్వడానికి మోదీ సిద్ధపడ్డారు.

విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పార్లమెంటులో చేసిన ప్రకటన పరిస్థితికి పూర్తి భిన్నంగా ఉంది. "చర్చలు, దౌత్యపరంగా సమస్య పరిష్కారమవుతుందని భారత్ నమ్ముతుంది" అని ఆయన అన్నారు. కానీ ఇరాన్ పై దాడులు జరుగుతున్నప్పుడు, అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్యసమితి చార్టర్ ఉల్లంఘించ బడుతున్నప్పుడు, మరణాలు సంభవిస్తున్నప్పుడు కేవలం నమ్మకాలతో దౌత్యం సాగదు. దౌత్యమంటే స్పందించడం, ఖండించడం, అభ్యంతరం తెలియజేయడం. అది జరగనప్పుడు ఆ దేశం విదేశాంగ విధానం బలహీనమైనదిగానే పరిగణించబడుతుంది. అని అంటూ రాహుల్ గాంధీ పార్లమెంటులో నూ,బయట విమర్శలు చేస్తూనే ఉన్నారు.

పశ్చిమాసియా సంక్షోభంపై పార్లమెంటులో చర్చ జరపాలని కాంగ్రెస్ గట్టిగా డిమాండ్ చేసినప్పుడు ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. రాజ్యసభ నుంచి కాంగ్రెస్ ఎంపీలు వాకౌట్ చేయవలసిన పరిస్థితి ఏర్పడింది, లోక్ సభలో నిరసనలు, ప్లకార్డుల ప్రదర్శన- ఇవన్నీ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం తమ విధి నిర్వహణలో భాగంగా చేయడమే. కానీ ప్రభుత్వం మాత్రం చర్చకు భయపడుతోంది. ఎందుకంటే చర్చ జరిగితే ప్రభుత్వ విదేశాంగ విధానం యొక్క బేషరతు స్వరూపం బయట పడుతుందనే భయం. అంతర్జాతీయ వేదికలపై ఈ మౌనం, ఈ రాజీ వైఖరి భారత ప్రతిష్టకు తీవ్రమైన దెబ్బ. బ్రిక్స్ దేశాల్లో భారత్ నాయకత్వ పాత్ర పోషించగలదా అనే ప్రశ్న తలెత్తుతోంది. పశ్చిమాసియా దేశాలు, ముఖ్యంగా అరబ్ దేశాలు, భారత్ తమ తరఫున నిలబడుతుందా అని సందేహిస్తున్నాయి. ఇరాన్ వంటి చారిత్రక మిత్రదేశం భారత్ పై నమ్మకం కోల్పోతోంది. అమెరికా, ఇజ్రాయెల్ అనుగ్రహం కోసం భారత్ తన విదేశాంగ విధానాన్ని అమ్ముకుంటోందనే భావన ప్రపంచవ్యాప్తంగా బలపడుతోంది.

మరోవైపు అదే సమయంలో, అమెరికా-ఇజ్రాయెల్ చర్యలను ఖండించే ధైర్యం లేని భారత్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను మాత్రం ఖండించింది. ఇది పక్షపాత విదేశాంగానికి, ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. ఒక వైపు మాత్రమే ఖండించడం, మరో వైపు మౌనంగా ఉండిపోవడం నైతికంగా సమర్థనీయం కాదు. జవహర్లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ కాలంలో భారత్ అంతర్జాతీయ వేదికలపై గళం విప్పి, అలీన దేశాల నాయకత్వం వహించింది. విజయలక్ష్మీ పండిట్ ఐక్యరాజ్యసమితిలో చేసిన ప్రసంగాలు, కాశ్మీర్ సమస్యపై భారత్ వాదన నేడు చరిత్ర పుటల్లో మిగిలిపోయాయి. నేడు మాత్రం అంతర్జాతీయ వేదికపై భారత్ స్వరం వినిపించడం లేదు. ప్రపంచంలో అత్యాచారాలు, అణచివేత, యుద్ధాలు జరుగుతున్నా భారత్ మౌనంగా ఉండిపోతోంది. ప్రధాని మోదీ తన అమెరికా, ఇజ్రాయెల్ స్నేహితుల కోసం బ్రిక్స్ అధ్యక్ష పదవి గౌరవాన్ని, బాధ్యతను,వాటి ఆదర్శాలు, లక్ష్యాలను త్యాగం చేస్తున్నారు. ఇది దేశ ద్రోహమే కాక, అంతర్జాతీయ సంబంధాల పట్ల అపరిపక్వ వైఖరి. ప్రపంచంలోని ప్రతి దేశంతో సమాన దూరం, సమాన సాన్నిహిత్యం అనే పంచశీల, అలీన విధాన సిద్ధాంతాన్ని విస్మరించి, కేవలం రెండు దేశాల అనుగ్రహం కోసం మిగిలిన ప్రపంచాన్ని దూరం పెట్టడం దేశ హితానికి విరుద్ధం. పశ్చిమాసియా సంక్షోభంపై పార్లమెంటులో చర్చ జరిగి తీరాలి. భారత విదేశాంగ విధానం ఎటువైపు పయనిస్తోందో ప్రజలకు, ప్రతిపక్షానికి తెలియాలి. ప్రధాని మోదీ పార్లమెంటులో నిలబడి, తన విదేశాంగ విధానాన్ని వివరించాలి. ఇరాన్ పై దాడులపై మౌనంగా ఉండడానికి గల కారణాలను వివరించాలి. బ్రిక్స్ అధ్యక్ష పదవి కేవలం ముసుగు మాత్రమేనా, లేక నిజమైన బాధ్యతా అనేది స్పష్టం చేయాలి. లేనిపక్షంలో, అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రతిష్ట మరింత దిగజారుతూనే ఉంటుంది. ప్రపంచ దేశాలు భారత్‌ను విశ్వసించడం మానేస్తాయి. ఇది కేవలం ఒక ప్రభుత్వం యొక్క వైఫల్యం మాత్రమే కాదు, 140 కోట్ల భారతీయులకు అవమానం.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# 'కాసర్ల' జనపదానికి సినీజగత్తు ఫిదా

ఒకనాడు ప్రతికథనాయకుడు, కమెడియన్ పాత్రలకే పరిమితమైన తెలంగాణ యాస మాటలను, నేడు మెయిన్ హీరోతో పాటు ముఖ్యమైన పాత్రలకు పెడుతున్న సందర్భం. ఈ అపూర్వరంగంలో తెలంగాణ జానపద శైలితో పాటకు పట్టం కడుతూ.. వెండితెరపై జనపదం దేదీప్యమానంగా ఓ వెలుగు వెలిగేలా సాహిత్య రచన చేస్తున్నారు హనుమకొండ పిలగాడు కాసర్ల శ్యామ్. ఆయన కలం నుంచి జాలువారుతున్న సైన్మా పాటలు సినీ జగత్తులో రాజ్యమేలుతూ..మస్తు మజా ఇస్తూ.. నెట్టింట పొట్టు పొట్టు వైరల్ అవుతున్నాయి. తాజాగా ఆయన రచించిన నాని 'ప్యారడైజ్' చిత్రంలోని 'ఆయా షేర్' నెట్టింట హల్‌చల్ చేస్తున్నది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్" ఉస్తాద్ భగత్ సింగ్" చిత్రంలో 'కాలర్ ఎత్తరా ' పాటలో అశేష పవన్ అభిమానులు మెచ్చేలా చక్కటి సాహిత్యం అందించారు శ్యామ్. ఎక్కే దిగే కిక్కులో ఏముంది.. సచ్చేదాక కిక్కే ఉండాలే..అంటూ. కోట మీద జెండాల ఉండాలే అని ఉత్తేజిత భావాలు ఆవిష్కరించారు. సినిమా పాటకు తెలంగాణ జానపద శైలిని సమకూర్చిన రచయితగా కాసర్ల శ్యామ్ పేరు గడించారని చెప్పొచ్చు. వేణు యెల్దండి దర్శకత్వంలో తెరకెక్కిన 'బలగం' సినిమాలోని 'ఊరు పల్లెటూరు' పాటకుగాను కాసర్ల శ్యామ్‌కు ఉత్తమ గేయ రచయితగా జాతీయ అవార్డు లభించింది. అందరి హృదయాలను హత్తుకునేలా సాహిత్యం అందించిన కాసర్ల శ్యామ్.. తెలుగు చిత్ర సీమ నుంచి జాతీయ అవార్డు అందుకున్న ఐదో గేయ రచయిత కావడం విశేషం.

**పల్లె పదాలతో పాటకు పట్టం**

పోరాటల పురిటిగడ్డ ఓరుగల్లు ముద్దుబిడ్డ కాసర్ల శ్యామ్.. ఎలాంటి సినీ బ్యాక్ గ్రౌండ్ లేకున్నా తన టాలెంట్‌తో ఇండస్ట్రీకి వచ్చి.. సత్తా చాటుతున్నాడు. క్లాస్, మాస్ అనే తేడా లేకుండా అన్ని రకాల పాటలను శ్యామ్ తన కలం ద్వారా ఇంపుగా, సొంపుగా అందిస్తున్నారు. తెలంగాణ యాసను ఒడిసి పట్టుకున్న శ్యామ్.. రచించిన 'మహాత్మ' సైన్మాలోని 'నీలపురి గాజుల ఓ నీలవేణి నిల్సుంటే క్రిష్ణవేణి' పాట అప్పట్ల పెద్ద సంచలనమైంది. 'రాములో రాములో' పాటతో జనాలను ఆగమాగం జేసిండు. మాస్ హీరోగా ఎలివేషన్‌ను తారస్థాయికి తీసుకెళ్లేలా 'చల్ మావాడొచ్చింర్రా' అని మొదటి చరణంలోనే చెబుతూ..'జడలురో జడలురో హడలురో ధడలురో..కొడుతరో తోడలురో.. తీస్తారో తోలురో'.. 'మొల్దారం లేనోన్ని..ర.. ఏం పీకుతవుర.. ప్యారడైజ్‌కు అడ్రస్ నైత..' అని కథలో బలమైన కథానాయకుడి పాత్రను సుస్పష్టంగా చెప్పారు.ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఈ పాటకు జంగిరెడ్డి, దేవయ్య గాత్రం అందించగా, అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ స్పెషల్ అట్రాక్షన్. ఇటీవల వచ్చిన చాంపియన్ చిత్రంలోని 'గిరగిరగిర గింగిరగిరే' పాట నెట్టింట.. ఇన్‌స్టా రీల్స్‌లో ఫుల్ ఫేమస్ అయింది. 'ఎర్రెర్ర బొట్టు దిద్ది ఎండి మేఘం మెరిసిందే' అంటూ పల్లె వాతవరణం.. ప్రకృతి మధ్య పోలిక, అభివర్ణణ అత్యద్భుతంగా చేశారు. 'పొట్లం గట్టిన బిర్యానీకి బొట్టూ బిళ్ల పెట్టినట్టు', 'ఎన్నెల', సందమామ, గమ్మతి, సెమట సుక్కలు, చెమ్కీలు, చెంటిపోరడు, వంటి చక్కటి తెలంగాణ యాస పల్లెపదాలను దండలో పూలను గుదిగుచ్చినట్లు బంధంగా పేర్చి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయడం కాసర్ల శ్యామ్ కలం బలమని చెప్పొచ్చు. ఆయన మరిన్ని పాటలను రాస్తూ.. సాహితీయజ్ఞం కొనసాగించాలని, జాతీయ అవార్డును మరోసారి సొంతం చేసుకుని తెలుగు వారి సత్తాను, కళాకారుల ఖిల్లా ఓరుగల్లు కీర్తిని మరోసారి చాటాలని ఆకాంక్షిస్తున్నా.



**అంబీర్ శ్రీకాంత్,**
**సెల్ : 8185968059**

## షడ్రుచుల పండుగ

తెలుగు రుచులన్నీ కలగలిపి
ఒక నవపర్వం జాడ కనిపిస్తుంది
షడ్రుచులను కలిపిన వేళ
ఉగాది పండుగ ఉదయిస్తుంది...

కోకిల గొంతులో మధుర స్వరం
మామిడి పూతలో పరిమళ హారం
ప్రకృతి అంతా పాడుతూ ఆడుతూ
నవ్వుల్లో వికసిస్తుంది...

చేదంతా తెలుపై మిగిలి
పులుపంతా పసుపై నిలిచి
తీపంతా తేనెలై జారి
మనసులో నిండిపోతుంది...

ఉప్పంతా అనుబంధంగా మారి
కారం అంతా ఉత్సాహంగా నిలిచి
వగరు అంతా జ్ఞాపకాలై
నిశ్శబ్దంగా విరుస్తుంది...
ఉగాది పర్వపు మధురిమలను
కురిపిస్తుంది..
అహంకారపు జాడలను వదిలి
నిర్మల హృదయులుగా మారమని
పరాభవ సంవత్సరం నేర్పిస్తుంది..

**శిరీష శ్రీభాష్యం**
**హన్మకొండ**

## చైత్రోదయం

చైత్రోదయపు తొలిపొద్దు
కొత్త భాష్యపు ఊసులతో
తొలి వెలుగుల కిరణాలై
పచ్చని చిగుళ్ల పలకరింపు
పైర గాలుల పరవళ్లతో
వసంత రుతువు ఆగమనంతో
ప్రకృతి కాంత పులకరించగా
కోకిలమ్మ ల స్వాగతాలతో
యుగానికి ఆది
యుగాదిగా
జీవన గమన పయనమై
పరాభవ నామ నవాబ్ది
ఉల్లాస వీచికలతో విచ్చేసి
ఉన్నతంగా ఎదగాలి ఈ ఏడాది

**పత్తెశీ వసంత, కరీంనగర్**

# దేశ సాంకేతిక రంగాల్లో సి-డాక్ సేవలు కీలకం

సికింద్రాబాద్, మార్చి 17 (జనంసాక్షి) : దేశ సాంకేతిక రంగాల్లో సి-డాక్ సేవలు కీలకమని ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ పేర్కొన్నారు. అధునాతన కంప్యూటింగ్ అభివృద్ధి కేంద్రం (సి-డాక్) 39వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను తార్నాక లోని ఐఐసిటీ లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికతా శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ వర్చువల్ గా ప్రసంగించారు. అత్యున్నత స్థాయి కంప్యూటింగ్, సైబర్ భద్రత, సెమీకండక్టర్ సాంకేతికతలు, ఇతర అధునాతన డిజిటల్ రంగాల్లో దేశ సమర్థతను మెరుగుపరచడంలో సి-డాక్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జాతీయ సూపర్ కంప్యూటింగ్ మిషన్, జాతీయ సెమీకండక్టర్ మిషన్, జాతీయ క్వాంటం మిషన్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో సి-డాక్ సేవలను ఆయన వివరించారు. అత్యాధునిక పరిశోధన, మౌలిక సదుపాయాల ద్వారా ఎన్నో ఏళ్లుగా ఈ సంస్థ దేశ వైజ్ఞానిక, డిజిటల్ వ్యవస్థను బలోపేతం చేస్తోందన్నారు. ఆపరేటింగ్ సిస్టంలు, డేటా బేస్‌ల వంటి మౌలిక సాంకేతికత వంటివాటిలో స్వావలంబన సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. క్వాంటం కంప్యూటింగ్, ఆర్ఐఎస్సీ-వి, బ్లాక్ చెయిన్, ఐవోటీ వంటి అధునాతన రంగాలపై దృష్టిపెట్టడం అత్యావశ్యకమని ఆయన స్పష్టం చేశారు. పరిశ్రమలు, విద్యా సంస్థలు, రక్షణ రంగాలతో బలమైన సహకారంతో పాటు.. వాస్తవిక ఫలితాలనిచ్చే అనువర్తిత పరిశోధన ప్రాధాన్యాన్ని గుర్తు చేశారు. పరిశ్రమలతో సి-డాక్ భాగస్వామ్యాలు విస్తరిస్తుండడం,



వ్యూహాత్మక రంగాల్లో భాగస్వామ్యం పెరుగుతుండడం అభినందనీయమన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ మాట్లాడుతూ.. దేశ అంతరిక్ష, డిజిటల్ సామర్థ్యాలను పెంపొందించడంలో సి-డాక్ అత్యంత కీలక పాత్ర పోషించిందన్నారు. పరమ్ సిరీస్ ద్వారా సూపర్ కంప్యూటింగ్‌లో సంస్థ బలమైన పరంపరను, అలాగే అంతరిక్ష కార్యక్రమాల కోసం కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్ వ్యవస్థల అభివృద్ధిలో ఇస్రోతో సి-డాక్ సహకారాన్ని ఆయన వివరించారు. అంతర్జాతీయంగా ప్రస్తుత పరిణామాలను పేర్కొంటూ... ఉపగ్రహ సమూహాల వేగవంతమైన విస్తరణ, ఏఐ ఆధారిత స్వయంప్రతిపత్తి వ్యవస్థల వినియోగం పెరుగుతుండడం, అభివృద్ధి చెందుతున్న రంగాలతో అంతరిక్ష సాంకేతికతల అనుసంధానాన్ని ఆయన ప్రస్తావించారు. చిన్న ఉపగ్రహ వేదికలు, సరఫరా వ్యవస్థలు, కీలక భాగాలను దేశీయంగా అభివృద్ధి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సాంకేతిక స్వావలంబన సాధించడం అత్యావశ్యకమని స్పష్టం చేశారు. జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా తన సూపర్ కంప్యూటింగ్ మిషన్‌ను మార్చుకోవాలని, అధునాతన కంప్యూటింగ్ - అంతరిక్ష సాంకేతికతల్లో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ సంయుక్త కార్యదర్శి సుదీప్ శ్రీవాస్తవ మాట్లాడారు. అధునాతన సాంకేతికతల్లో భారత్ సామర్థ్యాలను పెంపొందించడంలో సి-డాక్ కీలక పాత్ర పోషిస్తోందంటూ అభినందించారు. ప్రజలే కేంద్రంగా సాంకేతిక అభివృద్ధి విధానాలపై దృష్టి సారించడం అత్యావశ్యకమని ఆయన స్పష్టం చేశారు. పరిశోధన - వాణిజ్యీకరణ మధ్య అంతరాలను తొలగించాలని, అత్యున్నత నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆయన సూచించారు. ఆవిష్కరణ, పేటెంట్లు, ఉన్నతిని సాధించే దిశగా నిరంతర కృషి అత్యంత ప్రధానమైన అంశాలని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో సి-డాక్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఇ. మాగేశ్, టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో, ఎండీ డాక్టర్ రణ్‌ధీర్ ఠాకూర్, సీఎస్ఐఆర్ - భారత రసాయన సాంకేతిక సంస్థ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస రెడ్డి, ఐఐటీ-గాంధీనగర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రజత్ మూనా, రక్షణ పరిశోధన - అభివృద్ధి సంస్థ డీజీ (ఎంఈడీ, సీవోఎస్, సీఎస్) షీనా రాణి. ఆర్ తదితరులు పాల్గొన్నారు.

# నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దాలి

- జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్
- జూబ్లీహిల్స్ సర్కిల్ లో కమిషనర్ ఆకస్మిక పర్యటన



ఖైరతాబాద్, మార్చి 17 (జనం సాక్షి) : హైదరాబాద్ నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పిలుపునిచ్చారు. మంగళవారం జూబ్లీహిల్స్ సర్కిల్ లో కమిష నర్ ఆకస్మిక పర్యటన చేపట్టారు. దీనదయాళ్ నగర్, ఫిలిం నగర్, వినాయక నగర్, లోటస్ పార్క్ ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్రస్థాయిలో పారిశుద్ధ కా ర్యక్రమాల తనిఖీ చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమా లు ఎఫెక్టివ్ గా చేపట్టాలని అధికారులకు కమిషన ర్ ఆదేశించారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల (జీవీపీ) నిర్మూలనపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని అధికారులకు సూచించారు. నిర్మాణ వ్యర్థాలు(సి అండ్ డి వేస్ట్) ఎక్కడా పేరుకుపోకుండా వెంటనే తొలగించాలని, అలాగే రహదారులు, అంతర్గత రోడ్లు, పార్కులు, సరస్సులు, ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవా లని అధికారులను ఆదేశించారు. పాల్గొన్నవారు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ప్రియాంక అలా, జాయింట్ కమిషనర్ రవి కిరణ్, ఏ ఎం హెచ్ ఓ , టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హెచ్‌సీఏ, విశాఖ మధ్య జరిగిన ఒప్పందంపై తక్షణమే సీబీఐ దర్యాప్తు చేపట్టాలి

సికింద్రాబాద్, మార్చి 17 (జనంసాక్షి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, విశాఖ మధ్య జరిగిన ఒప్పందంపై తక్షణమే సిబిఐ దర్యాప్తు చేపట్టాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ), విశాఖ మధ్య కుట్రపూరిత ఒప్పందం జరిగిందని, గత దశాబ్ద కాలంలో రూ600 కోట్లకు పైగా అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం టిసిఏ ఆధ్వర్యంలో మీడియాకు లేఖను విడుదల చేశారు. హెచ్‌సీఏలో దీర్ఘకాలికంగా వ్యవస్థాపరమైన లోపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. హెచ్‌సీఏ,విశాఖ మధ్య అక్టోబర్ 16, 2004 న ఒప్పందం జరిగిందని, చెల్లింపులు మాత్రం మార్చి 2004 నుంచే ప్రారంభమైనట్టు వివరించారు. అధికారిక ఒప్పందం కుదరకముందే రూ,2.32 కోట్లు చెల్లించబడినట్టు చెప్పారు. చట్టబద్ధ ఒప్పందం లేకుండా ఈ చెల్లింపులు ఏ ఆధారంపై జరిగాయని గురువారెడ్డి ప్రశ్నించారు. ఉప్పల్ స్టేడియం పేరు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంగా మారిన దశలో సరైన అనుమతులు, మీటింగ్ మినిట్స్, రికార్డులు ఎందుకు లేవున్నారు. ఈ ఒప్పందంలో ఉన్న కొన్ని క్లాజులు ముందస్తు ఆర్థిక కట్టుబాట్లను సూచిస్తూ, అనుమతులను వెనుక తేదీలతో నమోదు చేయడంతో పలు అనుమానాలకు దారి తీస్తుందన్నారు. తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి కోసం టీసీఏ, హెచ్‌సీఏ మధ్య సమన్వయం అవసరమని తెలిపారు. హెచ్‌సీఏ కార్యకలాపాలను హైదరాబాద్‌కే పరిమితం చేసిందన్నారు. రూ600 కోట్లకు పైగా వ్యవస్థపరమైన దుర్వినియోగం జరిగిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా లేని స్టేడియం నిర్మాణం, డిజైన్ అనుమతులు ఎందుకన్నారు. ఫైర్ సేఫ్టీ వంటి చట్టబద్ధ అనుమతుల్లో కూడా లోపాలు ఉన్నాయన్నారు. "కానోపీ స్కాం" సహా మౌలిక వసతుల వ్యయాల్లో అవకతవకలు జరిగాయన్నారు. ప్రాపర్టీ ట్యాక్స్, ఇన్‌కమ్ ట్యాక్స్, కమర్షియల్ ట్యాక్స్ వంటి అవకతవకలతో ఆర్థిక అవకతవకలు జరిగాయన్నారు. వెండర్ చెల్లింపులు,సిబ్బంది జీతాలు,విద్యుత్ బిల్లులు, ఆహారం, పరికరాల కొనుగోలు, మాజీ క్రికెటర్ల పెన్షన్లు, సరైన ఆడిట్లు లేకపోవడం, అనధికారిక బ్యాంకు లావాదేవీలు, హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా నిధుల ఉపసంహరణ, ప్రత్యర్థి న్యాయవాదులకు చెల్లింపులు, జట్ల ఎంపికలో, అనధికార "బీ టీమ్స్" పంపడంలో అవకతవకలు,అర్హతలేని వ్యక్తులను సీఈఓ, ఒంబుడ్స్‌మన్, సపోర్ట్ స్టాఫ్‌గా నియమించడం జరిగిందన్నారు.

# బీజేపీ రంగారెడ్డి జిల్లా ఐటీ ఇన్‌చార్జ్‌గా వెంకట్ రమణ గుప్త నియామకం



రాజేంద్రనగర్, మార్చి 17 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా బీజేపీ ఐటీ ఇన్‌చార్జ్‌గా నియమితులైన బాబుల్ రెడ్డి నగర్‌కు చెందిన వెంకట్ రమణ గుప్త కి మైలార్దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి తరఫున అభినందనలు తెలియజేశారు. 2001 సంవత్సరం నుంచి బీజేపీకి అంకితభావంతో పనిచేస్తున్న వెంకట్ రమణ గుప్త, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూనే పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ క్రమశిక్షణ గల కార్యకర్తగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన శాలువా సన్మాన కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర నాయకులు అడికే రాజు, వై నర్సు రెడ్డి, బల్ల శ్రీనివాస్ యాదవ్, గురుడి అంజి, కొండల, వేణు, జోగు విజయ్, ప్రేమ్, మహేష్, వినోద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వెంకట్ రమణ గుప్త తనకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

# కాసుల వేటలో అక్రమార్కులు

- 'మౌన'బాటలో అధికారులు

ధారూర్, మార్చి 17 (జనంసాక్షి) : మండలంలో పలు గ్రామాలలోని నాగసముందర్. రుద్రారం. గట్టేపల్లి ప్రాంతాల్లో ఇసుక మాఫియా ఆగడాలు పరాకాష్ఠకు చేరాయి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ 'కాసుల వేటలో' అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తూ లక్షలు గడిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కుల దందా మూడు పువ్వులు ఆరు కాయలు'గా సాగుతుంటే, యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు 'మౌనం'వ్యవహరించడం గమనార్హం. అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ససేమిరా అంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపంతో కాస్తా అక్రమార్కులకు వరంగా మారింది. అక్రమార్కుల భరతం పట్టవలసిన అధికారులు ఆ దిశగా కనీస చర్యలు చేపట్టడం లేదని ప్రజలు అంటున్నారు. వరుసగా వివిధ పత్రికల్లో



వార్తలు వస్తున్నా స్థానికులు మొరపెట్టుకున్నా అధికారుల్లో చలనం లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. తప్పు ఎవరిది. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన వారే మౌనం వహించడంతో అసలు తప్పు ఎవరిది అక్రమార్కులదా...?లేక పట్టించుకోని అధికారులదా...?అని స్థానికులు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. ఇసుక మాఫియా ఆగడాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని జిల్లా ఉన్నతాధికారులు స్పందించి. నాగసముందర్. రుద్రారం. గట్టే పల్లి. మనసన్పల్లి. ప్రాంతాల్లో విచారణ జరిపి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మెట్రోలో పెరుగుతున్న రద్దీ

- ఎండలతో ఉప్పల్ స్టేషన్ కిటకిట

ఉప్పల్, మార్చి 17 (జనం సాక్షి) : ఎండలు రోజురోజుకు తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరుగుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లో జనసంచారం కిటకిటలాడుతోంది. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు మెట్రో ప్రయాణానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో బయట ప్రయాణం చేయడం కష్టంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఎయిర్ కండిషనింగ్ సౌకర్యం, సమయపాలన, ట్రాఫిక్ ఇబ్బందులు లేకపోవడం వంటి కారణాలతో ప్రజలు మెట్రోను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా పీక్ అవర్స్‌లో రైళ్లు నిండుకుపోతుండగా, టికెట్ కౌంటర్లు, ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫార్మ్‌ల వద్ద కూడా భారీ రద్దీ కనిపిస్తోంది. కొంతమంది ప్రయాణికులు బస్సులు, ఆటోలు కంటే మెట్రోలో ప్రయాణం సౌకర్యంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో మెట్రో అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. అదనపు రైళ్లు నడపడం, సిబ్బందిని పెంచడం వంటి చర్యలు చేపడుతున్నారని అధికారులు తెలిపారు. వేసవి కాలంలో ఇదే రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్న అధికారులు, ప్రయాణికులు సహకరించాలని సూచిస్తున్నారు.

# ఆశా వర్కర్ల సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హామీ



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 17 (జనంసాక్షి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను తప్పకుండా పరిశీలించి పరిష్కారం అందిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లను అదనపు కలెక్టర్ కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పరిష్కరించగల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. జిల్లాలో పరిష్కారం కాని సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక చొరవతో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారితో చర్చించి నియమ నిబంధనలకు అనుగుణంగా సమస్యలను పరిష్కరించే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించడంతో ఆశా వర్కర్లు సంతోషం వ్యక్తం చేస్తూ తమ సమస్యలు, డిమాండ్లను వివరించిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు.

# ఉప్పల్ భగాయత్‌లో 10 ఎకరాల స్థల కేటాయింపు

- మూసీ తీరాన 'మల్కాజిగిరి కార్పొరేషన్' (ఎంఎంసి) పరిపాలనా సౌధం!
- రూ. 98 కోట్లతో అత్యాధునిక హంగులతో నిర్మాణం
- క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీలు
- అన్ని నియోజకవర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్ణయం



ఉప్పల్, మార్చి 17 (జనం సాక్షి) : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎం ఎం సి) నూతన కార్యాలయ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. ఉప్పల్ నియోజకవర్గంలోని మూసీ నది తీరాన ఉన్న ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో ఈ భారీ పరిపాలనా భవనాన్ని నిర్మించనున్నారు. మంగళవారం నాడు అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలు మధుయాష్కీ గౌడ్ (ఎల్బీనగర్), తోటకూర వజ్రేష్ యాదవ్ (మేడ్చల్), మందుముల పరమేశ్వర్ రెడ్డి (ఉప్పల్)లు ఈ ప్రతిపాదిత స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**అందరికీ అందుబాటులో 'భగాయత్'**

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోకి వచ్చే ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్బీనగర్, మేడ్చల్ నియోజకవర్గాల ప్రజలందరికీ ఉప్పల్ భగాయత్ ప్రాంతం భౌగోళికంగా కేంద్ర బిందువుగా ఉంటుందని తెలిపారు. మెట్రో రైలు, మెరుగైన రవాణా సౌకర్యాలు ఉండటంతో సాధారణ ప్రజలు కార్యాలయానికి చేరుకోవడం సులభతరమవుతుందని పేర్కొన్నారు. అందుకే సంబంధిత విభాగాల అధికారులు ఈ స్థలాన్ని ఎంపిక చేశారని వివరించారు.

**రూ. 98 కోట్లతో చారిత్రాత్మక కట్టడం**

సుమారు 10 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో రూ. 98 కోట్ల భారీ వ్యయంతో ఈ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ఆధునిక హంగులతో, కార్పొరేట్ తరహా సదుపాయాలతో మున్సిపల్ సేవలు ఒకే చోట లభించేలా ఈ భవనం రూపుదిద్దుకోనుంది. చరిత్రలో నిలిచిపోయేలా ఈ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వారు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు:

సామాన్య ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఉప్పల్ భగాయత్‌లో ఎంఎంసీ కార్యాలయ ఏర్పాటుకు అంగీకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి నేతలు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల నాలుగు నియోజకవర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, మాజీ బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, ధన్పాల్, పవని రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్ బిల్లు 2026ను వెంటనే వెనక్కి తీసుకోవాలి

ముషీరాబాద్, మార్చి 17 (జనం సాక్షి) : ట్రాన్స్‌జెండర్ల అస్తిత్వం పై బిజెపి ప్రభుత్వం అప్రకటిత యుద్ధం చేస్తుందని తెలంగాణ ట్రాన్స్ జెండర్ పీపుల్స్ అసోసియేషన్ మండిపడింది. తక్షణమే కేంద్ర ప్రభుత్వం 2026 ట్రాన్స్ జెండర్ బిల్లును వెనక్కి తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బాగ్లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ట్రాన్స్ జెండర్ పీపుల్స్ అసోసియేషన్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్ల అస్తిత్వం పై కేంద్ర ప్రభుత్వం అప్రకటిత యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ట్రాన్స్ జెండర్ పీపుల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మోనాలిసా మాట్లాడుతూ.. ఈ చట్టం ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉందని, సుప్రీంకోర్టు తీర్పును సైతం ధిక్కరిస్తుందని అన్నారు. ఈ చట్టం వల్ల ట్రాన్స్‌జెండర్‌ల హక్కులు హరించబడుతున్నాయన్నారు. హక్కును కాల రాసే ఏ చట్టాన్ని



అయినా తిప్పి కొట్టడమే ప్రజాస్వామిక హక్కు అని అన్నారు. ట్రాన్స్ జెండర్ హక్కులను కాలరాస్తే కాలగర్భంలో కలిసిపోతారని హెచ్చరించారు. ఆల్ ఇండియా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ ప్రతినిధి రచన ముద్రబోయిన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ కొత్త నిబంధనలు ట్రాన్స్‌జెండర్ల ను మరింత వివక్షకు గురిచేసేలా ఉందన్నారు. మా గుర్తింపును మేమే నిర్ణయించుకునే హక్కును ప్రభుత్వం లాక్కోవాలని చూస్తోందనీ, ఈ అప్రకటిత యుద్ధాన్ని మేం ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. వివాదాస్పద 2026 ట్రాన్స్‌జెండర్ బిల్లును తక్షణమే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ట్రాన్స్‌జెండర్లకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రక్షణ కల్పించాలని కోరారు. సాంస్కృతిక, సామాజిక రంగాల్లో ట్రాన్స్‌జెండర్ల పై జరుగుతున్న అణచివేతను అడ్డుకోవాలని అన్నారు. త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి మేధావులు ప్రజాసంఘాలు సామాజిక సంఘాలు సహకారంతో ఉద్యమాన్ని చేపడతామన్నారు. మార్చి 18 న ధర్నా చౌక్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ హక్కుల కార్యకర్తలు.. రింకు , పప్పీ , సోనా రాథోడ్, అక్షర, నిత్య, వాసవి, శృతి, సిల్క్ అప్పు, అభి తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ తోఫా అందజేత



కోహెడ, మార్చి 17 (జనంసాక్షి) : రంజాన్ పవిత్ర మాసమును పురస్కరించుకొని మండల కేంద్రం లోని ముస్లిం సోదరులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున వచ్చిన రంజాన్ తోఫా ను స్థానిక సర్పంచ్ బందెల సుజాత - బాలకిషన్, ఉప సర్పంచ్ కందాల వెంకటేష్, స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ గోరిట్యాల లక్ష్మణ్, వేల్పుల వెంకటస్వామి, శంశీర్, ముంజ తిరుపతి, గూడ స్వామి, ఖదీర్, శమీన్, షాహీన్, బిస్మిల్లా, సాదిక్ పాషా, యాదుల్ పాషా, అంజుమ్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
18 మార్చి 2026

# ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలి

**• జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా**



**గద్వాల నడిగడ్డ, మార్చి 17 (జనం సాక్షి) :** ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించడానికి బూత్ లెవల్ ఏజెంట్స్‌ను నియమించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శకమైన ఓటర్ల జాబితా కోసం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల పాత్ర చాలా ముఖ్యమని తెలిపారు. ఈ ప్రక్రియ ఓటర్ల పేర్లు తొలగించేందుకు కాదని, ఒకే వ్యక్తికి సంబంధించిన డూప్లికేట్ ఓటర్ నమోదులను తొలగించడం, వలసల వల్ల వచ్చిన లోపాలను సరిచేయడం ద్వారా స్పష్టమైన, పారదర్శకమైన కొత్త ఓటరు జాబితాను తయారు చేయడమే ప్రధాన ఉద్దేశమని అన్నారు. 2002 మరియు 2025 ఓటరు జాబితాలను పోల్చి ఓటర్లను ఏ, బి, సి, డి వర్గాలుగా విభజించి క్షేత్ర స్థాయిలో ధృవీకరణ జరుగుతున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్‌కు తప్పనిసరిగా బూత్ లెవల్ ఏజెంట్స్ లను నియమించాలని సూచించారు. నియమితులైన బూత్ లెవల్ ఏజెంట్లకు అధికారిక ఐడీ కార్డులు అందజేయబడతాయని తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్లు తప్పనిసరిగా ఆ గ్రామానికి చెందిన వారే ఉండాలని, తద్వారా క్షేత్ర స్థాయిలో ఓటర్ల వివరాల ధృవీకరణ, అవసరమైన పత్రాల సేకరణలో కీలకంగా పనిచేస్తారని తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాను 1--2 రోజుల్లోగా సమర్పించాలని, వారికి మార్చి 25లోపు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా గద్వాల్ పట్టణంలో పురోగతి సుమారు 48 శాతం మాత్రమే ఉన్నందున పనులను వేగవంతం చేయాలని సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్ల ద్వారా ఇంటింటి సర్వేలు నిర్వహించి, ఫారాల పంపిణీ మరియు సేకరణను చేపట్టనున్నట్లు తెలిపారు. వలసల కారణంగా ఓటర్ల వివరాల్లో ఉన్న సమస్యలతో పాటు కొత్తగా నమోదు అయిన ఓటర్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి రాజకీయ పార్టీలు, అధికారులు, సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏ.ఓ భూపాల్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరిటెండెంట్ మంజుల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వికసిత భారత్ బ్రోచర్ ఆవిష్కరణ



**పెబ్బేరు, మార్చి 17 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాల విద్యార్థులకు జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రజాస్వామ్యం పెను సవాళు అంశంపై నిర్వహించారు. ఉపన్యాస పోటీల బ్రోచర్లను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకట ప్రసాద్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మార్కెట్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి తో కలిసి ఆవిష్కరించారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడే దిశగా నేటి యువకులు ఎంతో పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, జిల్లా యువజన నాయకులు రంజిత్ కుమార్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, కౌన్సిలర్ లు దాసరి జమ్ములమ్మ, భాగ్యలక్ష్మి శివ, తాటికొండ కృష్ణ, శివసాయి, పర్వీన్ షకీల్, కాళశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులు కిసాన్ మేళాలో పాల్గొనాలి

**• జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**కౌడిపల్లి, మార్చి 17 (జనంసాక్షి) :** జిల్లా వ్యవసాయ శాఖా ఆధ్వర్యంలో 18-03-2026 బుధవారం రోజున రైతులకు ఉపయోగకరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు కిసాన్ మేళా కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రం తునికి లో నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, పాల్గొని పంటల దిగుబడి పెంపు, నేల ఆరోగ్యం పరిరక్షణ, సమగ్ర కీటక నియంత్రణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు విధానాలపై రైతులకు మార్గదర్శనం అందించనున్నారు. అదనంగా, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, రైతు ఆసక్తి గుంపులుకు సంబంధించిన శిక్షణలు, సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు కూడా నిర్వహించబడతాయి. ఈ కార్యక్రమంలో వివిధ వ్యవసాయ యంత్రాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సంబంధిత సాంకేతిక పరిజ్ఞానంపై ప్రదర్శనలు ఏర్పాటు చేయబడును. రైతులు తమ సమస్యలను నేరుగా శాస్త్రవేత్తలతో చర్చించి పరిష్కారాలు పొందుటకు అవకాశం కల్పించబడును. అందువలన, పరిసర ప్రాంతాల రైతులు అధిక సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

## నూతన వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభించండి

**• జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి బ్యూరో, మార్చి 17 (జనం సాక్షి) :** ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవనంలో వెంటనే విద్యార్థులకు తరగతులు ప్రారంభించేందుకు కావలసిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ కొత్త భవనాన్ని సందర్శించి, భవనంలో కొనసాగుతున్న ఫినిషింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భవనంలోని పలు విభాగాలను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులకు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే 10 రోజుల్లోనే మెడికల్ కాలేజీని కొత్త భవనంలోకి షిఫ్ట్ చేసి విద్యార్థులకు తరగతి గదులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు. ప్రస్తుతంకళాశాల కొనసాగుతున్న భవనం నుంచి అవసరమైన పరికరాలను త్వరితగతిన కొత్త భవనానికి తరలించాలని సూచించారు. అలాగే ఆర్ అండ్ బి అధికారులకు భవనంలో ఎటువంటి లీకేజీలు లేకుండా చూసుకోవాలని, ప్రతి గదికి గది నంబర్లతో కళాశాల ఆవరణలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సౌకర్యార్థం తరగతి గదులు మరియు ప్రయోగశాలల్లో అవసరమైన అన్ని పరికరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరలోనే ఈ భవనానికి ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేటాయించిన స్థలాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. స్కూల్ భవనాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులు ప్రణాళిక ప్రకారం కొనసాగించాలని ఇంజనీరింగ్ అధికారులు మరియు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, ఆర్ అండ్ బి కార్యనిర్వాహక ఇంజనీర్ దేశ్య నాయక్, ఈ డబ్ల్యూ ఐ డి సి కార్యనిర్వాహక ఇంజనీర్ రామచందర్, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## మృతుని కుటుంబసభ్యులు రోడ్డుపై బైఠాయించి ధర్నా

**• డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలి**



**గద్వాల టౌన్, మార్చి 17 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో విషాద ఘటన చోటు చేసుకుంది. పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. గద్వాల్ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఐజకు చెందిన రాము అనే యువకుడు ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదానికి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. రాము మృతదేహాన్ని గద్వాల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. డ్రైవర్‌పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేద్దాం

**• జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 17 (జనం సాక్షి) :** జిల్లాలో విద్యాభివృద్ధికి అందరం కలిసి కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. పేట జిల్లా కలెక్టర్ గా బాధ్యత లు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో పి ఆర్టి యు టిఎస్ నారాయణపేట జిల్లా బృందం మర్యాదపూ ర్వకంగా కలిసి మొక్కను నోటు పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ని పిఆర్టియు నాయకులతో మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో పాఠశాలలు చాలా చక్కగా పనిచేస్తున్నాయని రికార్డు ఉంది దానిని అలాగే కొనసాగిస్తూ జిల్లాలో విద్యాభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దామని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధిం చిన ఏమైనా సమస్యలు ఉంటే అందరూ ఎప్పుడైనా కలవచ్చు అని, వారికి పరి ష్కారం చేద్దామన్నారు. ము ఖ్యంగా వేసవి ప్రారంభమై నందున పాఠశాలలో పరిశుభ్రమైన తాగునీరు, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనము, మూత్రశాల నిర్వహణ ఉండే విధంగా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షు లు , ప్రధాన కార్యదర్శి జనా ర్దన్ రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లా డుతూ జిల్లాలో జిల్లా పరిష త్ లో పనిచేయుచున్న ఉపా ధ్యాయుల అకాల మరణం వలన వారి కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతు న్నాయని వారికి ఆధారపడి ఉన్న వారిని కారుణ్య నియ మాకాలలో నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట మండల అధ్యక్షులు ఎం రఘువీర్ దామరగిద్ద మండల అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయ ణరెడ్డి రమేష్ జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్ టిఆర్టి సీనియర్ నాయకులు శ్రీనివాస్ మహేష్ శేఖర్ రెడ్డి వెంకటేష్ బాలాజీ వెంకటేష్, రఘు రవికుమార్ వెంకట్ రాములు విమాన్స్ తదిత రులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం ఫార్మర్ కిట్లను అందజేసిన అధికారులు



**మల్దకల్, మార్చి 17 (జనంసాక్షి) :** మండలంలోని రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా మంగళవారం జాతీయప్రకృతి వ్యవసాయం గురించి చర్చించారు. వ్యవసాయ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరావు పకృతి వ్యవసాయం గురించి రైతులతో ముఖాముఖి చర్చలు జరిపారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్స్ ని అందజేయాలనిసూచించారు. ఈకిట్ లో ప్రకృతి వ్యవసాయంపై క్షేత్ర దర్శిని, పుస్తకము, క్లాత్ బ్యాగు, గుర్తింపు కార్డు, ప్రత్యేక క్యాలెండర్, టోపీ, పెన్ను, చిన్న డైరీ ఫార్మర్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమం లో మండలంలోని రైతువేదికలో ప్రకృతి వ్యవసాయ రైతులకు వ్యవసాయ అధికారులు కిట్స్ అందజేశారు. ప్రకృతి వ్యవసాయ రైతు గణపతి రెడ్డి తమ యొక్క అనుభావాలను రైతులతో పంచుకున్నాడు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ గోపాలు, వ్యవసాయ అధికారి కే రాజశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారులు కె కిషోర్ కుమార్, భాస్కర్, రాహుల్, జోహన్న , మేఘన, రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా రైతుభరోసా కొరకు కొత్తగా పాసుబుక్ తేదీ 28/02/2026 నాటికి వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని దీనికి గాను పట్టా పాసుబుక్, ఆధార్ కార్డ్ , బ్యాంకు బుక్, అప్లికేషన్ ఫారం వ్యవసాయ విస్తరణ అధికారులకు ఇవ్వాలని సూచించారు.

## కళలతో మానసిక ఆనందం



**పెబ్బేరు, మార్చి 17 (జనం సాక్షి) :** కళలు సాహిత్యం మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. పరాభవ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో మంగళవారం పెబ్బేర్ లో వనపర్తి జిల్లా రంగస్థల కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ “కళ కళల కోసం కాదు ప్రజల కోసం”అన్న నానుడిని అనుసరించి కళాకారులు ప్రజల ఆనందం కోసం మానసిక ఉల్లాసం కోసం తమ కళల్ని ప్రదర్శిస్తారని అన్నారు. అలా అభినయాన్ని తమ ప్రవృత్తిగా స్వీకరించి గత యాభై ఏళ్లుగా సరస్వతీ కళా సమితి ద్వారా పౌరాణిక జానపద చారిత్రక నాటకాలను పెబ్బేర్ కళాకారులు ప్రదర్శించడం అభినందనీయమని శంకర్ గౌడ్ కొనియాడారు. ఆనాటి నుంచి నేటి వరకు రంగస్థల కళకు సేవలందిస్తున్న జిల్లా కళాకారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎల్.ఉమామహేశ్వర్, సర్వారెడ్డి, సితార వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, కథల్ తదితరులను శంకర్ గౌడ్ శాలువా జ్ఞాపకాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళావేదిక ప్రతినిధులు వ్యాఖ్యాత బైరోజు చంద్ర శేఖర్, రాములు, గోవర్ధన్ చారి, శ్రీనివాస్, నరేశ్ మున్నగువారు పాల్గొన్నారు.

## విద్యార్థి వైద్య ఖర్చులకు 18 వేల ఉపాధ్యాయులఆర్థిక సహాయం



**నారాయణపేట, మార్చి 17 (జనం సాక్షి) :** నారాయణపేట మండలం జాజాపూర్ ఉన్నత పాఠశా లలో 8వ తరగతి చదువుతు న్న అనురాధ అనే విద్యార్థిని గత కొన్ని రోజులుగా అనా రోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతున్నది. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని ఉపాధ్యాయ బృందం అప్పంపల్లి లో ఉన్న అమ్మాయి ఇంటికి వెళ్లి అన్ని రకాలుగా ధైర్యం చెప్పి చికిత్స కోసం 18 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజే శారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రతాప్ భాను ప్రకాష్ లక్ష్మణ్ నరసింహ రఘురాం రెడ్డి మంగళ శశిరేఖ నిర్మల శ్రీదేవి శిరీష మరియు శ్రీ సాయి కృష్ణ మాణిక్యప్ప వెంకటేష్ నితిన్ రెడ్డి పాల్గొన్నారు.

## మల్టీ పర్పస్ వర్కర్లకు ప్రతినెల వేతనాలు ఇవ్వాలి




**మల్దకల్, మార్చి 17 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారంమీటింగ్ హాల్ తెలంగాణ గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ నాయకులుతో మండల స్థాయి కార్మికుల సమావేశం నిర్వహించడం జరిగింది. తాటికుంట మద్దెలబండ, ఎలుకూరు, సద్దలోనిపల్లి, దాసరపల్లి, తూముకుంట, నాగర్ దొడ్డి, మంగంపేట, అమరవాయి, బిజ్జవరం గ్రామాల నుండి 53 మంది సర్వీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మల్దకల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి మబీ, మంగంపేట గ్రామ పంచాయతి కార్యదర్శి గాయత్రి, గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ మహిళలతో శాలువా పూలమాలతో సన్మానం చేశారు. తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి నర్సింలు, ఇటిక్యాల మండలం మహిళా కార్యదర్శి ఎం వినోద పాల్గొన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూప్రతి గ్రామములో సర్వీస్ వర్కర్స్ గా పని చేస్తున్న వర్కర్స్ లు పాల్గొని వారి ఎదుర్కొంటున్న సమస్యల గురించి స్త్రీ పురుషులకు సమానంగా ఒక్క నెలకు ఒక్కరికి 20000 జీతభత్యాలు ఇవ్వాలి, రక్షణ దుస్తులు మాస్కులు బ్లౌజులు బూట్లు ఇవ్వాలి, గ్రామం శుభ్రపరచడానికి పారాగడపార, గంపలు పొరకలు ఇవ్వాలని, జీవిత బీమా ఇన్సూరెన్స్ మరణిస్తే తక్షణమే ఐదు లక్షలు ఇవ్వాలి, అందువలన కొత్తగా మల్టీపర్పస్ వర్కర్స్ ను కూడా మాన్ పవర్ పెంచాలి, ఆలస్య వేతనాలు వెంటనే ఇవ్వాలి ఇకనుంచి ప్రతి నెల నేరుగా వారి అకౌంట్లోనే డబ్బులు జమ చేయాలి ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి, ఉద్యోగ భద్రత కల్పించాలి, ఒక్కరోజు ఒక వ్యక్తి ఎనిమిది గంటలు మాత్రమే పని కల్పించాలి శ్రమ దోపిడిని అరికట్టాలి వారు డిమాండ్ చేశారు.

# ఐఎన్‌టీఎస్‌ఓ ఫలితాల్లో శ్రీచైతన్య తక్షశిల విద్యార్థుల ప్రభంజనం

**• 166 మంది ఉత్తీర్ణత**

**మహబూబ్‌నగర్ రూరల్, మార్చి 17 (జనం సాక్షి) :** పట్టణంలోని శ్రీచైతన్య (తక్షశిల ఉన్నత పాఠశాల) విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌ఓ సెకండ్ లెవెల్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ఘనవిజయం సాధించారు. ఈ పోటీల్లో పాఠశాల నుండి మొత్తం 166 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి మహబూబ్‌నగర్ విద్యా చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సౌమ్య సగర్వంగా ప్రకటించారు.

### విజయ కేతనం ఎగురవేసిన విజేతలు

జనవరి మాసంలో జరిగిన ఈ సెకండ్ లెవెల్ పరీక్షకు పాఠశాల నుండి 236 మంది విద్యార్థులు హాజరవ్వగా, అత్యంత కఠినమైన పోటీని ఎదుర్కొని 166 మంది అర్హత సాధించారు. వీరిలో: మెగా గ్రాండ్ ప్రైజ్: ఒక విద్యార్థి లెనోవో లాప్‌టాప్ కైవసం చేసుకున్నారు. ఆల్ ఇండియా ఫస్ట్ ప్రైజ్: ఒక విద్యార్థి ప్రతిష్టాత్మకమైన ట్యాబ్ గెలుచుకున్నారు. ర్యాంకులు: ఆల్ ఇండియా సెకండ్ ప్రైజ్ (ఒక్కరు), థర్డ్ ప్రైజ్ (ఇద్దరు), ఫోర్త్ ప్రైజ్ (ఇద్దరు), మరియు ఫిఫ్త్ ప్రైజ్ (ముగ్గురు) విద్యార్థులు సాధించారు.

ఇతర బహుమతులు: 40 మంది కన్సోలేషన్ ప్రైజులు, 12 మంది స్పెషల్ ప్రైజులు పొందగా, ఏకంగా 104 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించి పాఠశాల కీర్తిని దశదిశలా చాటారు.

### అభినందనల జల్లు

జిల్లా విద్యాశాఖాధికారి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థుల ప్రతిభను చూసి ముగ్ధులైన ఆయన, వారిని ప్రత్యేకంగా అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. శ్రీచైతన్య యాజమాన్యం విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, వారిలో



దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి నిరంతరం కృషి చేస్తుందని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, శ్రీవిద్య, ఏజీఎం భాస్కర్ రెడ్డి, కో-ఆర్డినేటర్ రఘు, డీన్ యాదయ్య, ప్రైమరీ ఇంచార్జ్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొని విజయ ఉత్సాహాన్ని పంచుకున్నారు.

# విద్యాసంస్థల్లో స్టూడెంట్స్ ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): విద్యాసంస్థల్లో స్టూడెంట్స్ ర్యాగింగ్ కు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. భూపాలపల్లి గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ హాజరై మాట్లాడుతూ విద్యాసంస్థల్లో అనుచితంగా ప్రవర్తించడం గాని, ర్యాగింగ్ వంటి చర్యలకు గాని పూర్తిగా దూరంగా ఉండాలని కోరారు. ర్యాగింగ్ నిషేధానికి సంబంధించి అమల్లో ఉన్న చట్టాల ప్రకారం, ర్యాగింగ్ ఒక శిక్షార్హ నేరమని, దీనికి పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. మెడికల్ విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే వైద్యులుగా ఎదగాల్సిన బాధ్యత కలిగి ఉన్నారని పేర్కొంటూ, పరస్పర గౌరవం, సహకారం, స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు. ర్యాగింగ్ కారణంగా విద్యార్థులు మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతారని తెలిపారు. అందువల్ల కాలేజీ ప్రాంగణంలో సురక్షితమైన, ప్రశాంతమైన విద్యా వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడినా, అలాంటి ఘటనలు గమనించినా వెంటనే కాలేజీ యాజమాన్యానికి గాని, పోలీసులకు గాని సమాచారం అందించాలని సూచించారు. అవసరమైతే యాంటీ ర్యాగింగ్ హెల్ప్‌లైన్ నంబర్ 1800-180-5522 లేదా డయల్ 100 కు కాల్ చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా. కే. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ కే. రాజేష్ (అడ్మినిస్ట్రేషన్), వైస్ ప్రిన్సిపాల్ డా. బి. శ్రీధర్ రావు (అకాడమిక్), అధ్యాపకులు, పోలీస్ అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు సకాలంలో రాయితీలను అందజేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- డ్రిప్పు విధానంలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్, మిర్చి పంటలను పరిశీలించిన కలెక్టర్



హనుమకొండ ప్రతినిధి, మార్చి 17 (జనంసాక్షి) : ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు సకాలంలో రాయితీలను అందించే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం ప్రభుత్వ రాయితీతో డ్రిప్పు విధానంలో హనుమకొండ జిల్లా దామెర మండలం పులకుర్తి లో ఆయిల్ పంప్ పంట, నడికూడ మండలం నర్సక్క పల్లి లో మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న మిర్చి పంటలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత రైతులకు ప్రభుత్వం నుండి రాయితీపై వచ్చిన డ్రిప్పు పరికరాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయా పంటలకు సంబంధించిన వివరాలను రైతులు, ఉద్యాన శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ మొక్కను జిల్లా కలెక్టర్ నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యాన పంటలకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్, మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న మిర్చి పంటల రైతులు రాయితీని సద్వినియోగం చేసుకొని మంచి లాభాలు వచ్చే విధంగా పంట ఉత్పత్తి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి అనసూయ, పరకాల ఆర్డిఓ నారాయణ, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఇంటింటా న్యాయ సేవల కార్యకలాపాల ప్రచారం

- వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యం.సాయికుమార్




వరంగల్ ఎంజీఎం, మార్చి 17(జనంసాక్షి): వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ ఆదేశాలను అనుసరించి వరంగల్ జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు న్యాయ సేవలను విస్తరించే లక్ష్యంతో మామునూరు, రామచంద్రాపురం, బొల్లికుంట గ్రామీణ ప్రాంతాల్లో వివిధ చట్టాలపై అవగాహన తీసుకురావడానికి ఇంటింటా న్యాయ సేవల కార్యకలాపాల ప్రచారం జరిగింది. ముఖ్యంగా ఈ ప్రచారం మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజల చట్టపరమైన అవసరాలను తీర్చడంలో సహాయపడతాయని తెలిపారు. ఎటువంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు ఉచిత న్యాయ సహాయం మరియు న్యాయ సహాయం అందించడం, చట్టపరమైన అవగాహన కల్పించడం, గ్రామాల్లో, ముఖ్యంగా సమాజంలోని బలహీన మరియు దుర్బల వర్గాలకు చట్టపరమైన మార్గదర్శకత్వం బాధిత వ్యక్తులకు వారి చట్టపరమైన హక్కులు, అర్హతలు మరియు పరిహారం లేదా ఉపశమనం పొందడానికి అవసరమైన చర్యల గురించి మార్గనిర్దేశం చేయడం, ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన, పేదరిక నిర్మూలన మరియు ప్రజా సంక్షేమం కోసం జాతీయ న్యాయ సేవాధికార సంస, తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా తెలిపారు. కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.శ్రీనివాసరావు అసిస్టెంట్ కౌన్సిల్ ఆర్.రజిని పాల్గొని, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి వారి సమస్యలను తెలుసుకున్నారని తెలిపారు.

## పశువులకు మెరుగైన వైద్యం అందించాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ (జనంసాక్షి) : జిల్లాలో ఉన్న పశువులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పశువుల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సామూహిక ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం తలమడుగు మండల కేంద్రంలోని పశువైద్యశాలలో 8వ విద్యా జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని, అవగాహన కల్పించే ప్రచార రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు టీకాలు వేసే ప్రక్రియను స్వయంగా పరిశీలించి, కార్యాలయ ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా ఉన్న 2,90,000 ఆవులు, 48,000 గేదెలకు ఈ నెల రోజుల పాటు సాగే ప్రత్యేక కార్యక్రమంలో టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి వల్ల పాడి రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని, అందుకే రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశువులకు ఉచితంగా టీకాలు వేయించుకోవాలని ఆయన కోరారు. ప్రచార రథం ద్వారా పల్లెల్లో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ పశు వైద్యశాల రికార్డులను తనిఖీ చేసి, అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం గ్రంథాలయాన్ని, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు, డాక్టర్ లావణ్య, తహసిల్దార్ రాజ్ మోహన్, రైతులు, గ్రామస్తులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో 'కోనేరు'కు పదవి దక్కేనా?

- మాజీమంత్రి కోనేరు నాగేశ్వర రావు తనయుడు సత్యనారాయణకు నామినేట్ పదవి ఎన్నడు
- కొత్తగూడెం కాంగ్రెస్ లో బలమైన నేతగా గుర్తింపు
- తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు గా పనిచేసిన చిన్ని
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం బరిలో తెలుగుదేశం అభ్యర్థిగా నిలిచిన కోనేరు చిన్ని
- పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్ లో చేరిన కోనేరు చిన్ని



ఖమ్మం బ్యూరో (జనంసాక్షి) : కోనేరు చిన్ని ..కొత్తగూడెం రాజకీయాల్లో పరిచయం అక్కర్లేని పేరు.మాజీ మంత్రి కోనేరు నాగేశ్వర రావు తనయుడు సత్యనారాయణ అలియాస్ చిన్ని.కమ్మ సామాజిక వర్గానికి చెందిన చిన్ని గూర్చి కొత్తగూడెం పొలిటికల్ సర్కిల్స్ లో ఎలాంటి నామినేట్ పదవి దక్కుతుందని చర్చ సాగుతుంది.

చిన్ని రాజకీయ ప్రస్థానం తెలుగుదేశం పార్టీలోనే.తండ్రి బాటలో తెలుగుదేశం లో పలు కీలక పదవులు చేపట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు యువత ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గా పనిచేశారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుల వల్ల పోటీ చేసే అవకాశం రాలేదు. 2014లో కొత్తగూడెం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచి 30 వేల ఓట్లు సాధించి గట్టి పోటీ ఇచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా పనిచేశారు. పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

### నామినేట్ పదవి దక్కేనా?

కొత్తగూడెం జిల్లాలో పట్టున్న కోనేరు చిన్ని సీనియర్ రాజకీయ నేతగా ఉన్నారు. సుదీర్ఘ కాలం ప్రజాసేవలో ఉన్న కోనేరు చిన్ని తెలుగుదేశం పార్టీలో ఉన్నపుడు రేవంత్ రెడ్డితో మంచి సాన్నిహిత్యం ఉంది. రాజకీయాల్లో క్లీన్ ఇమేజ్ ఉన్న చిన్నికి నామినేట్ పదవి విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకుంటారని జిల్లా రాజకీయ సమీకరణాలు పరంగా కీలక నిర్ణయం తీసుకుంటారని చిన్ని మద్దతుదారులు నమ్మకంగా ఉన్నారు. చూడాలి కోనేరు చిన్నికి కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి ప్రాధాన్యం దక్కుతుందో కొద్ది రోజుల్లో తేలనుంది.

# పర్వతగిరిలో అదనపు కలెక్టర్ తనిఖీలు

- హాస్పిటల్, తహసీల్దార్ కార్యాలయం, గురుకుల పాఠశాలలో పరిశీలన
- లోపాలపై అధికారులకు ఆదేశాలు

పర్వతగిరి, మార్చి 17 (జనం సాక్షి) : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి పర్వతగిరి మండల కేంద్రంలో మంగళవారం పలు ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేశారు. మొదట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆమె, అక్కడ నిర్వహిస్తున్న స్పెషలిస్టు వైద్య శిబిరాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. రోగులను నిపుణుల వద్దకు పంపేముందు వారి వివరాలను మెడికల్ ఆఫీసర్లు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. వ్యాక్సినేషన్ గది సహా హాస్పిటల్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. హాస్పిటల్‌లోని మరుగుదొడ్లలో నీటి సదుపాయం లేకపోవడంపై మెడికల్ ఆఫీసర్లపై ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే మరమ్మత్తులు చేయాలని జిల్లా వైద్యాధికారికి ఆదేశించారు. అలాగే హాస్పిటల్‌లో అక్రమంగా వినియోగిస్తున్న విద్యుత్ కనెక్షన్‌ను తొలగించి సంబంధితులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏడీఈకు సూచించారు. హాస్పిటల్ ఆవరణంలో వాహనాలు పార్కింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, భూ భారతి, ధరణి దరఖాస్తుల పరిష్కారం, రికార్డుల నిర్వహణ, కార్యాలయ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.భూ భారతీ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని, తప్పుడు నివేదికలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. తరువాత సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించిన ఆమె తరగతి గదులు, భోజనశాల, వంటగది, స్టోర్ రూమ్‌లు, హాస్టల్ పరిసరాలను పరిశీలిం చారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. వంటశాల పక్కన మురుగు నీరు నిల్వ ఉండటంతో వెంటనే శుభ్రం చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేసి పాఠశాలలో వసతుల గురించి తెలుసుకున్నారు. ఈ తనిఖీలలో స్థానిక తహసీల్దార్ వెంకటస్వామి, ఆర్ఐ భారతి , ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



## జవహర్ నవోదయకు మెరిట్ విద్యార్థి ఎంపిక

గోవిందరావుపేట (జనంసాక్షి) : మండల కేంద్రంలోని మెరిట్ విద్యాసంస్థల నుండి జవహర్ నవోదయకు బి. సహర్ష్ జిల్లా 43వ ర్యాంకు సాధించినట్లు సంస్థ కరస్పాండెంట్ పి కిరణ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం కిరణ్ మీడియాతో మాట్లాడుతూ పాఠశాల నుండి 43వ ర్యాంకు సాధించి జవహర్ నవోదయకు ఎంపికైన సహర్ష ను అభినందిస్తున్నామని అన్నారు. ఈ మేరకు విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపల్ పి గౌతమి కిరణ్‌లు అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని గొప్ప స్థానంలో నిలవాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. మరెందరికో ఆదర్శంగా నిలవాలని ఆశీర్వదిస్తున్నట్లు తెలిపారు.

## గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

- ప్రజలు పుకార్లను నమ్మవద్దు
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ రూరల్, మార్చ్ 17 (జనం సాక్షి) : జిల్లాలో డొమెస్టిక్,కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు ఎటువంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు.అన్ని గ్యాస్ ఏజెన్సీలలో తగినంత గ్యాస్ అందుబాటులో ఉందని తెలిపారు.గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకున్నవారికి నిర్ణీత సమయంలోపల సిలిండర్లను ప్రజలకు డోర్ డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు.ప్రజలకు ఎవరికైనా గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు కలిగితే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబరు 91005 77132 ను సంప్రదించవచ్చునని తెలిపారు.ఇప్పటికే గ్యాస్ సిలిండర్ల ఏజెన్సీ లతో సమావేశం నిర్వహించి, ప్రజలకు సరిపడినన్ని సిలిండర్లను సాఫీగా పంపిణీ చేసే విధంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.ప్రజలు ఎవరు గ్యాస్ కొరత అని వస్తున్న అసత్య వార్తలను,పుకార్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

# నగరంలో వరద ముంపు నివారణకు పక్కా ప్రణాళికలు తయారు చేయండి

- ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ ఇరిగేషన్ రెవెన్యూ సర్వే విభాగాలతో సమావేశం
- దృశ్య మాధ్యమం ద్వారా నగరంలోని నాలాల స్థితి గతుల పరిశీలన



వరంగల్ ఎంజీఎం, మార్చి 17(జనంసాక్షి): నగరం లో వరద ముంపు నివారణకు పక్కా ప్రణాళికలు తయారు చేయాల్సిన అవసరం ఉందని హన్మకొండ జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. మంగళ వారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో బల్దియా కు చెందిన ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ విభాగాలతో పాటు ఇరిగేషన్ రెవిన్యూ సర్వే విభాగాలతో నిర్వహించిన సమావేశం లో కలెక్టర్/ కమిషనర్ పాల్గొని సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా దృశ్య మాధ్యమం ద్వారా గూగుల్, డ్రోన్ సర్వే ద్వారా సేకరించిన నగర మ్యాపింగ్ సంబంధిత సమాచారాన్ని స్క్రీన్ పై ప్రదర్శిస్తూ నగరం లో ప్రధాన నాలాలు ప్రారంభమయ్యి ముగిసే వరకు గల ప్రాంతాలను ఆయా ప్రాంతాల్లో వాటి వెడల్పు లు ఇందుకు అవరోధం గా ఉన్న నిర్మాణాలు బ్రిడ్జి లు కల్వర్టు లను కలెక్టర్ కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బల్దియా వ్యాప్తంగా యూజీడీ నిర్మాణ నేపధ్యం లో స్ట్రాం వాటర్ డ్రైన్ ల ఏర్పాటుకు ఇరిగేషన్, సర్వే విభాగాలు సంయుక్తం గా సమగ్ర సర్వే చేపట్టాలని ఇందుకోసం సంబంధిత కన్సల్టెన్సీ వారితో సమావేశం నిర్వహించి డేటా సేకరిస్తారని, నగర పరిధి లో గల 130-140 వాటర్ బాడీస్ వాటికి అనుసంధానమై ఉన్న నాలాల సమాచారాన్ని ఇరిగేషన్ విభాగం వారు అందజేయాలని నగరంలోని ప్రధాన నాలాలు వాటికి కనెక్ట్ అయి ఉండే నాలాలపై సర్వే నిర్వహించి సమాచారం అందించాలని, ప్రస్తుతం ప్రాజెక్ట్ ప్రిపరేషన్ దశలో ఉన్నందున ఎన్ ఐ టి వారి సహకారాన్ని తీసుకోవాలని అన్నారు. బల్దియా పరిధి లోని 66 డివిజన్ ల పరిధి లో పక్కాగా నాలా మార్కింగ్ చేయాలని నాలా లు గతం లో ఏవిధంగా ఉండేవని ప్రస్తుతం వాటి స్థితి గతులను కలెక్టర్ అడిగి తెలుసుకు న్నారు. ఒక్కో నాలా ఎంత వెడల్పు ఉండాలి వంటి అంశాల పై సమగ్రం గా అధ్యయనం చేయాలని, నాలా విస్తరణ లో ఏమైనా నిర్మాణాలు ప్రభావితం అయ్యే అవకాశం ఉన్న వాటిని గుర్తించి అంచనాలు తయారు చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో బల్దియా ఇంచార్జి ఎస్ ఈ శ్రీనివాస్ రావు, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏ డి సర్వే శ్రీనివాసులు, ఈఈలు రవి కుమార్, సంతోష్ బాబు, ఇరిగేషన్ డి ఈ హర్షవర్ధన్, సుచరణ్ బల్దియా డి ఈ లు మొజామిల్, రోజా రాణి తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్ బ్యూరో, మార్చి 17(జనం సాక్షి): మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మహబూబాబాద్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన జనరల్ హాస్పిటల్ లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాస్పిటల్ లోని ఓపి వార్డు, ఏఎంసీ, ఐసీయూ, పిడియాట్రీషియన్, ఎస్ఎన్సియు, జనరల్ మెడికల్ వార్డు, ఆలనా సెంటర్, ప్రతి వార్డులు తిరుగుతూ వైద్యం కోసం వచ్చిన పేషెంట్లు, వారి బంధువులతో స్వయంగా మాట్లాడారు, హాస్పిటల్ లో అందిస్తున్న సేవలు, ఆహారం తదితర అంశాలపై ఆరా తీశారు, హాస్పిటల్ లోని సిబ్బంది హాజరు పట్టిక, స్టోర్ స్టాక్ రిజిస్టర్, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ రిజిస్టర్లు, డ్యూటీ ఆర్డర్స్, రిజిస్టర్, వైద్య పరీక్షలు నిర్వహించే ఇండెంట్ రిజిస్టర్, బయోమెట్రిక్ రిజిస్టర్, మెడిసిన్ స్టాక్ రిజిస్టర్ లను ఉదయం నుండి మధ్యాహ్నం వరకు సుదీర్ఘ సమయం హాస్పిటల్, వార్డులు, పరిసరాలను స్వయంగా పరిశీలించారు. వివిధ ఆరోగ్య సమస్యల వైద్యం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి నిరుపేద సామాన్య ప్రజలు తదితరులు వైద్యం కోసం రావడం జరుగుతుందని, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అత్యాధునిక పరికరాలతో వైద్య విధాన సేవలు, టెస్టులు , ప్రతి ఒక్కరికి అందాలనే ఉద్దేశంతో నాణ్యమైన, వేగమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రత్యేకంగా చిన్న పిల్లలు, డయాలసి స్ పేషంట్స్, తదితర సుదీర్ఘమైన వైద్య సేవల కోసం వచ్చిన వారికి ఆస్పత్రిలో కల్పించిన సౌకర్యాల ద్వారా వైద్య చికిత్సలు అందించాలని, పేషంట్ల సహాయార్థం వచ్చే వారికోసం ప్రత్యేక ఏర్పాట్లు చిన్నపిల్లల కోసం ఆలనా సెంటర్, లలో అన్ని సౌకర్యాలు కల్పించాలని, త్రాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, టాయిలెట్స్, అన్ని వార్డులను ఎప్పటికప్పుడు సానిటేషన్ చేస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బ్రేక్ ఫాస్ట్, భోజనం, డిన్నర్ సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు వహిస్తూ సిద్ధం చేయాలని, హాస్పిటల్ ప్రాంతంలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్పిటల్ లో ఆక్సిజన్, కావలసిన మందులు నిత్యం అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. హాస్పటల్ వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరూ కచ్చితంగా సమయపాలన పాటించాలని, వారికి కేటాయించిన సమయాలలో వైద్య సేవలు అందించడం కోసం సిద్ధంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులలో ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. హాస్పిటల్ లో పేషెంట్లకు వారి సహాయకులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా సెక్యూరిటీని ఏర్పాటు చేసి సీసీ కెమెరాలను నిత్యం పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఆస్పత్రికి వచ్చే పేషెంట్లు వారి బంధువులతో వైద్య సిబ్బంది సేవ భావంతో ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో కూడా వైద్య సేవల నిమిత్తం ప్రత్యేక క్యాంపులు నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. కలెక్టర్ వెంట హాస్పిటల్ సూపరిడెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వెంకట్ లకావత్, డాక్టర్ జగదీష్, డాక్టర్ హర్షవర్ధన్, తదితరులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
18 మార్చి 2026

# ప్రభుత్వ హాస్పిటల్‌లలో సాధారణ ప్రసవాలు పెంచాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**మేళ్లచెరువు, మార్చి 17 (జనంసాక్షి) :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో భాగంగా వైద్య నిపుణలచే ప్రతి పిహెచ్‌సిలో మెడికల్ క్యాంప్ లు నిర్వహించడం జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. మేళ్ల చెర్వు పిహెచ్‌సిలో జరిగే మెడికల్ క్యాంప్ ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మెడికల్ క్యాంప్ ల ద్వారా జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, మహిళలకు గర్భశాయ ముఖ కాన్సర్ ను గుర్తించే టాప్ స్పెయర్, కంటికి సంబంధించి కాంట్రాక్ట్ లోపం, బి పి, షుగర్, చిన్న పిల్లలో ఎత్తు, పోషకాహార లోపాలకు చెందిన వైద్య నిపుణులు రోజుకొక్క పి హెచ్ సి కి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందించటంతో పాటు ఆరోగ్యం మెరుగు పడేలా పలు సూచనలు ఇస్తారని ఇంకా ఏమైనా శస్త్ర చికిత్సలు చేయాల్సి వచ్చిన, మెరుగైన వైద్యం కోసం జనరల్ హాస్పిటల్ కి రిఫర్ చేయటం జరుగుతుందని అన్నారు. మేళ్లచెర్వులో నిర్వహించిన మెడికల్ క్యాంప్ లో 300 మంది ఓపి నమోదు అయ్యారని తెలిపారు. మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న తీరుపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పిహెచ్ సి లలో సాధారణ ప్రసవాలు పెరిగేలా ప్రజలను ఆహగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

**విద్యార్థులతో కలెక్టర్ భోజనం**

మేళ్లచెరువు మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ లో కలెక్టర్ హాస్టల్ లోని గదులను, వంట గదిని పరిశీలించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులను ప్రతి రోజు వంట బాగుంటుందా ? మెను ప్రతిరోజు అమలు చేస్తున్నారా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పదవతరగతి వార్షిక పరీక్షలలో ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్ట్ లో కనీసం 70 శాతానికి పైగా మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొనిరావాలని కోరారు. కలెక్టర్ వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ మాధవ్ కుమార్, డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్యులు యస్వంత్, మణి, ప్రజ్ఞ, సాయి శ్రీ, వెంకటేష్, సమీర, మెడికల్ అధికారి, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఇన్చార్జి తహసిల్దార్ సురేందర్ రెడ్డి, సర్పంచ్ బచ్చు పద్మావతి, ఉప సర్పంచ్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ఈఎస్ఐలో అందని వైద్యం...

- వైద్యులు, మందులు లేక తీవ్ర అవస్థలు
- ఈఎస్ఐ డిస్పెన్సరీ వద్ద కాంట్రాక్టు కార్మికుల నిరసన



**బూర్గంపహాడ్, మార్చి 17 (జనంసాక్షి) :** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక గ్రామంలో ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్యం సకాలంలో అందక... కనీస సౌకర్యాల కొరతతో కార్మికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కార్మికులకు ఈఎస్ఐ ద్వారా 24 గంటలు వైద్యం అందించడంతో పాటు అవసరమైన మందులు కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఈఎస్ఐ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మిక సంఘం జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్ సానికొమ్ము రామచంద్రారెడ్డి లు మాట్లాడుతూ డిస్పెన్సరీలతో మందులు, వైద్యులు అందుబాటులో లేకపోవడంతో కార్మికులకు ఆరోగ్యపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అత్యవసర సమయాల్లో వినియోగించాల్సిన అంబులెన్స్ సౌకర్యం కూడా లేకపోవడం దారుణమన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి డిస్పెన్సరీలో మెరుగైన వైద్యసేవలు అందించేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘాల సభ్యులు ఉర్లగొండ వీరన్న, కందాల వెంకటరెడ్డి, జగదీష్, సీహెచ్ ఆంజనేయులు, కె.నాగయ్య, చుక్కపల్లి బాలాజీ, కాంట్రాక్టు కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## రామస్వామిగుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్



**హుజూర్‌నగర్, మార్చి 17 (జనంసాక్షి) :** హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీ ని, అంతర్గత రోడ్లు, సభాస్థలిని, మొక్కలు నాటడం, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించి మిగిలి పోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ ల అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని అని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, జిల్లా ఉద్యానవన అధికారి నాగయ్య, మిషన్ భగీరథ కరుణాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**హుజూర్‌నగర్, మార్చి 17 (జనంసాక్షి) :** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం హుజూర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ లు పాల్గొన్నారు. 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పనిచేస్తూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు క్రమం తప్పకుండా ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, రోడ్లను శుభ్రంగా ఉంచడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు కలిసి పనిచేయాలని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సందర్శించి కిచెన్ షెడ్డు, త్రాగునీరు, టాయిలెట్స్, వంటశాల, 6వ తరగతి విద్యార్థులతో తెలుగు పాఠం చదివించి, మ్యాథ్స్ చేయించారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. స్కూల్ ఆవరణలో శిధిలావస్థలో ఉన్న స్కూల్ గదులను వాటి వివరాలను అడిగి తెలుసుకుని దానిని తొలగించి, సదనం చేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ తహసిల్దార్ కవిత, ప్రధానోపాధ్యాయులు నర్సిరెడ్డి, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



**మేళ్లచెరువు, మార్చి 17 (జనంసాక్షి) :** మండలంలోని మేళ్లచెరువు గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య నిపుణలచే ఏర్పాటు చేయబడిన వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ మంగళవారం సందర్శించారు. ఈ శిబిరంలో అందుతున్న వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అన్ని రకాల రిజిస్టర్ లలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ బచ్చు పద్మావతి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ శిబిరము నందు జనరల్ మెడిసిన్, స్త్రీల, దంత, ఎముకలు, కన్ను, చిన్న పిల్లల వైద్య నిపుణులు మండల వ్యాప్తంగా వచ్చినటువంటి రోగులను పరీక్షించి అవసరమైనటువంటి మందులను అందించడంతోపాటు శస్త్ర చికిత్సలు అవసరమైనటువంటి వారిని సూర్యాపేట జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా 324 మంది రోగులు హాజరైనట్లు మండల వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి మాధవ్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో ఆడపిల్లల పట్ల గౌరవం పెరగాలి



**సంగారెడ్డి, మార్చి 17 (జనం సాక్షి) :** సమాజంలో ఆడపిల్లల పట్ల గౌరవం పెంపొందించాల్సిన అవసరం ఉందని డిఎంహెచ్ఓ వసంతరావు పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, మహిళా సాధికారత కేంద్రం సహకారంతో బేటీ జన్మోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పుట్టిన ఆడ శిశువులను గౌరవిస్తూ బేటీ జన్మోత్సవ కిట్లు మరియు ప్రశంసాపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీడబ్ల్యూఓ, డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... ఆడపిల్లలు మరియు మగపిల్లలను సమానంగా చూడాల్సిన అవసరాన్ని వివరించారు. సమాజంలో ఆడపిల్లల పట్ల గౌరవం పెంపొందించాల్సిన అవసరాన్ని, బాలికల విద్య, ఆరోగ్యం మరియు భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. అలాగే పుట్టిన శిశువులకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించి, మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లి పాలనే ఇవ్వాలని అవగాహన కల్పించారు. అదనంగా, అవసరమైన సందర్భాల్లో మహిళా సాధికారత కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పటాన్చెరు ఏరియా ఆస్పత్రిలో బేటీ జన్మోత్సవ కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ , డాక్టర్ నాగనిర్మల ,మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి , ఆసుపత్రి సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

# కారు ఢీకొని ఒరిస్సా కూలీ దుర్మరణం



**పెద్దవూర, మార్చి 17 (జనం సాక్షి) :** కారు ఢీకొని కూలీ మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం మండల పరిధిలోని కార్తికేయ మిల్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సా రాష్ట్రం,మయూర్భాంచ్ జిల్లా, గోకుల్ చంద్రాపూర్ కలం గడియ గ్రామానికి చెందిన రాంరె ఎంబ్రం అనే అతను రెండు నెలల నుండి గ్రామ శివారులోని కార్తికేయ టెక్స్టైల్ కాటన్ మిల్లులో కూలిగా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి కిరాణం వస్తువులు కొనడానికి కాటన్ మిల్లు నుండి బయలుదేరి పెద్దవూర వైపు వస్తుండగా అదే సమయంలో అంగడిపేట వైపు నుండి పెద్దవూర వైపు వెళుతున్న టీఎస్‌–07–+జు–0584 నెంబర్ గల కారు డ్రైవర్ సయ్యద్ షబ్బీర్ కారును అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వెళ్లి రామ్ రే ను వెనక నుండి బలంగా ఢీకొట్టడంతో రామ్ రే రోడ్డు పక్కన పడిపోయి తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడని, మృతుడి బాబాయ్ డుంబి సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దవూర ఎస్సై వైప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కమల నెహ్రూ హాస్పిటల్ కు తరలించారు.

# దమ్మపేటలో గడువు ముగిసిన శీతల పానీయాల విక్రయం..



**దమ్మపేట, మార్చి 17 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఎక్స్‌పైరీ డేట్ ముగిసిన శీతల పానీయాలకు నిర్బంధం లేకుండా అమ్ముడవుతున్నాయి.వేసవి తీవ్రతతో చల్లని పానీయాలకు డిమాండ్ పెరగడంతో కొందరు వ్యాపారులు గడువు ముగిసిన బాటిల్స్‌ను కూడా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ఆనవాళ్లు ఉన్నాయి. బాటిల్‌పై గడువు తేదీ గురించి ప్రశ్నిస్తే “తప్పుగా వచ్చిన స్టాక్” అంటూ దుకాణదారులు సమాధానం ఇస్తున్నారు.అవగాహన లేని వినియోగదారులు చల్లదనం చూసి కొనుగోలు చేస్తున్నారు.నిపుణుల హెచ్చరికల ప్రకారం, గడువు దాటిన ప్లాస్టిక్ బాటిల్స్‌లోని పానీయాలు ఆరోగ్యానికి హానికరం.పేట్ ప్లాస్టిక్ క్రమంగా ద్రవంలో కలిసే ప్రమాదం ఉండటంతో విషతుల్య ప్రభావాలు కలగొచ్చు.రుచి,వాసన మార్పులు కూడా సంభవిస్తాయి.ఇంత జరుగుతున్నా ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ కనిపించకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గడువు ముగిసిన పానీయాల విక్రయంపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.జాగ్రత్తలు: గడువు తేదీ పరిశీలన,వేడి ప్రదేశాల్లో నిల్వ చేసిన బాటిల్స్ వినియోగం నివారణ అవసరం.

# సన్నబియ్యం సరఫరాలో అవకతవకలు



**బూర్గంపహాడ్, మార్చి 17 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సన్నబియ్యం పథకం నీరుగారిపోతుందని, బియ్యం సరఫరాలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, తెలంగాణ రైతుకూలీ సంఘం నాయకులు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ లబ్దిదారులకు సన్నబియ్యం ఇవ్వాలన్న ఆలోచన మంచిదే అయినప్పటికీ బూర్గంపహాడ్ మండలకేంద్రంతో పాటు కొన్నిచోట్ల సన్నబియ్యం కాకుండా మొద్దుబియ్యం, తుట్టెలు పట్టిన, పురుగులు చేరిన బియ్యం ఇస్తున్నారని ఆరోపించారు. రేషన్ దుకాణాల్లో సరఫరా చేసే ఈ బియ్యం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. బియ్యం సరఫరా నాణ్యతపై డీలర్లను ప్రశ్నిస్తే ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యమేనని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని, పేదలకు ఇచ్చే బియ్యం సరఫరాపై జిల్లా ఉన్నతాధికారులు గోడౌన్లు, రేషన్ షాపులను తనిఖీ చేస్తే డీలర్ల అక్రమాల్లో వాస్తవాలు వెలుగుచూస్తాయన్నారు.

# వేటగాళ్ల నుండి అడవి పంది మాంసాన్ని పట్టుకున్న అటవీ అధికారులు

- అదుపులో ఒకరు, పరారీలో మరో ముగ్గురు వేటగాళ్లు



**పెనుబల్లి, మార్చి 17 (జనం సాక్షి) :** కరెంటు వైర్లతో ఉచ్చులు పెట్టి అడవిపందిని వేటాడి మాంసాన్ని కట్ చేస్తుండగా అటవి శాఖ అధికారులు దాడి చేసి మాం సాన్ని స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొనగా ముగ్గురు వ్యక్తులు పరారైన సంఘటన పెనుబల్లి మండలంలో చోటుచేసుకుంది. తల్లాడ రేంజ్ ఎఫ్ఆర్ వో ఉమ తెలిపిన వివరాల ప్రకారం పెనుబల్లి మండలం తాళ్లపంట అటవీ సమీపంలోని పంటచేలల్లో కొంతమంది వ్యక్తులు కరెంటు వైర్లతో ఉచ్చులు వేసి అడవి పందిని వేటాడారిని సమాచారంతో అటవీ అధికారులు దాడి చేశారని తెలిపారు, ఈ దాడిలో వేటగాళ్లు అడవిపందిని వేటాడి మాంసాన్ని కట్ చేస్తుండగా దాడి చేసి పట్టుకున్నారని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనపరుచుకున్నారని, పట్టుకున్న మాంసం సుమారు 50 కేజీలు ఉంటుందని తెలిపారు, మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని తెలిపారు. స్వాధీనం చేసుకున్న సుమారు 50 కేజీల మాంసాన్ని పెనుబల్లి పశు వైద్యశాలకు పంచనామా నిమిత్తం తరలించామని తెలిపారు. ఈ దాడిలో డిఆర్ఓ సురేష్, ఎఫ్‌బిఓలు డి శ్రీనివాసరావు, మస్తాన్ రావు, నాగరాజు,ఎన్ రమేష్, వీరభద్రం, లావణ్య,సమత స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# తహసీల్దార్ సీజ్ చేసినా..ఆగని మట్టి దందా..!

- రెవెన్యూ ప్రహారీలో అక్రమ రవాణా..
- అధికారుల కళ్లు గప్పి టిప్పర్ల హల్చల్!
- మాడుగులపల్లిలో మాఫియా తెగింపు..
- ప్రభుత్వ సంపద దోపిడీకి అడ్డు, అదుపు లేదా..?



**మాడుగులపల్లి, మార్చి 17 (జనసాక్షి) :** ఆగమోత్కూరు శివారులో మట్టి మాఫియా ఆగడాలు పరాకాష్టకు చేరుకున్నాయి. తహశీల్దార్ సరోజ పావని స్వయంగా రంగంలోకి దిగి టిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన కొద్ది గంటల్లోనే, మళ్లీ అదే ప్రాంతంలో అక్రమ మట్టి రవాణా యధేచ్ఛగా సాగుతుండటం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఎటువంటి అనుమతులు లేకుండా, అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ మాఫియా సాగిస్తున్న ఈ దందా వెనుక అసలు కథ ఏమిటన్నది మిస్టరీగా మారింది.

**చర్యలు ఉత్తుత్తివేనా..?**

మీడియా కథనాలకు స్పందించి అధికారులు చర్యలు తీసుకున్నట్లు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం మారలేదు. తహశీల్దార్ టిప్పర్లను పట్టుకున్న తర్వాత కూడా మళ్లీ మట్టి తరలింపు మొదలవ్వడం చూస్తుంటే, అక్రమార్కులకు అధికారులంటే భయం లేదని స్పష్టమవుతోంది. అధికారుల కళ్లు గప్పి చేస్తున్నారా? లేక లోపాయికారీ ఒప్పందాలు ఏమైనా ఉన్నాయా? అన్న అనుమానాలు బలపడుతున్నాయి.

**నిబంధనలు గాలికి..**

ఎలాంటి పర్మిషన్లు లేకుండా ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరుపుతూ, భారీ వాహనాలతో మట్టిని తరలిస్తున్నారు. స్థానిక ప్రజలు, విలేకరులు మొత్తుకుంటున్నా అక్రమార్కులు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు.సీజ్ చేసిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే, మళ్లీ దందా మొదలైందని విమర్శలు వస్తున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

స్థానిక యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే ప్రభుత్వ సంపద హారతి కర్పూరం కావడం ఖాయం. జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు వెంటనే స్పందించి, ఆగమోత్కూరు మట్టి మాఫియాపై శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాకు పాల్పడే వాహనాలను పూర్తిగా సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# వ్యభిచార గృహంపై దాడి

- ఐదుగురి అరెస్టు




**అమీన్పూర్, మార్చి 17 (జనం సాక్షి) :** వ్యభిచార గృహం పై దాడి చేసి వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తితో పాటు ఇద్దరు మహిళలు ఇద్దరు యువకులను అమీన్పూర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. అమీన్పూర్ ఇన్స్పెక్టర్ నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం ఎస్సై ప్రభాకర్ తో పాటు హెచ్ఎంటి స్వర్ణపురి కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆ ఇంట్లో తనిఖీ నిర్వహించగా జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పింటూ అన్సారి అనే వ్యక్తి పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువతులు సీమ షేక్, మేం ఫుల్ ఖాతున్ తో వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. ఆ యువతులతో పాటు ఇద్దరు విటులు శంకర్ అభిజిత్ విశ్వాస్ ఉన్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.




# అధునాతన ఫీచర్లతో రెనో డస్టర్ రీ ఎంట్రీ..

### ధర రూ.10.49 లక్షల నుంచి ప్రారంభం

**న్యూఢిల్లీ:**ఒకప్పుడు ఎంతో ప్రజాదరణ పొందిన రెనో డస్టర్ దేశంలోకి రీ ఎంట్రీ ఇచ్చింది. మిడ్‌సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో 2026 డస్టర్‌ను రెనో మంగళవారం (మార్చి 17న) లాంచ్ చేసింది. దీని ధర రూ.10.49 లక్షలు నుంచి ప్రారంభమవుతుంది. ముందుగా బుక్ చేసుకున్న కస్టమర్లకు రూ.10.29 లక్షల ప్రారంభ ధరకు విక్రయించనున్నట్లు కంపెనీ తెలిపింది. బుకింగ్స్ ఇప్పటికే ప్రారంభం కాగా.. త్వరలో డెలివరీలు ప్రారంభం కానున్నాయి. హ్యుందాయ్ క్రెటా, మారుతీ సుజుకీ విక్టోరిస్, కియా సెల్టోస్ వంటి కార్లకు గట్టి పోటీ ఇవ్వనుంది. అథెంటిక్, ఎవల్యూషన్, టెక్నో, టెక్నో+, ఐకానిక్ వేరియంట్లలో రెనో డస్టర్ లభ్యమవుతుంది. ప్రీమియం వేరియంట్ ధర రూ.18.09 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. అంతర్జాతీయంగా లాంచ్ అయిన మోడల్‌తో పోలిస్తే ఇండియన్ వేరియంట్ చూడ్డానికి కాస్త భిన్నంగా ఉంటుంది. హెడ్‌ల్యాంప్ డిజైన్ పూర్తిగా మార్చారు. ఐబ్రో ఆకారం కలిగిన డీఆర్ఎల్ఎస్ ఇచ్చారు. 18 అంగుళాల అల్లాయ్ వీల్స్, ఇండియన్ యూజర్ల కోసం ప్రీమియం క్యాబిన్ ఎక్స్‌పీరియన్స్‌తో రూపొందించారు. డ్యూయల్ స్క్రీన్ లే ఔట్, త్రీ స్పోక్ స్టీరింగ్ వీల్ ఇచ్చారు. 10.1 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఉన్నాయి. యాంబియెంట్ లైటింగ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, డ్యూయల్ జోన్ క్లైమేట్ కంట్రోల్, స్టార్ట్/స్టాప్‌కు పుష్ బటన్ వంటి సదుపాయాలు ఇచ్చారు.ఆరు ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ఏబీఎస్ విత్ ఈబీడీ, 360 డిగ్రీల కెమెరా, రేర్ పార్కింగ్ సెన్సర్లు, నాలుగు వీల్స్‌కు డిస్క్‌బ్రేకులు, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, లెవల్ 2 ఒఅడా ఫీచర్లు ఉన్నాయి. కొత్త రెనాల్ట్ డస్టర్ వివిధ పవర్‌ట్రెయిన్ ఆప్షన్లతో లభిస్తోంది. 1.8 లీటర్ ఫోర్ సిలిండర్ డైరెక్ట్ ఇంజక్షన్ పెట్రోల్ ఇంజిన్ స్ట్రాంగ్ హైబ్రిడ్‌తో వస్తోంది. ఇది 160 బీహెచ్‌పీ, 172 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 1.3 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ 160 బీహెచ్‌పీ, 280 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సిక్స్‌స్పీడ్ మాన్యువల్, డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ ఆప్షన్‌తో లభ్యమవుతుంది.



# జీఎస్టీ లాభాలు ఆవిరి

- టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, వాహనాల ధరలు పెరగనున్నాయ్
- యుద్ధంతో పెనుప్రభావం




**న్యూఢిల్లీ:**పశ్చిమాసియా యుద్ధం సెగలు భారత ఆర్థిక వ్యవస్థకు, వినియోగదారులకు కష్టాలు తెస్తున్నాయి. గత సెప్టెం బరులో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) హేతుబద్ధీకరణ ఫలితంగా టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, వాహనాల ధరలు తగ్గాయి. ఫలితంగా ఆయా వస్తువులకు గిరాకీ పెరిగి, మార్కెట్ కుదుట పడిందని సంతృప్తి చెందే లోగా.. ప్రస్తుత యుద్ధం రూపంలో ఆందోళన పెరిగిం ది. ముడి చమురు ధర పెరగడం, సరఫరా వ్యవస్థల్లో ఏర్పడుతున్న అంతరాయం, రవాణా ఛార్జీల భారం కారణంగా వాహన రంగం నుంచి నిత్యావసరాల (ఎఫ్ఎంసీజీ) వరకు అన్ని రంగాల కంపెనీలూ ధరల పెంపు దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఫలితంగా జీఎస్టీ రూపేణ కలిగిన ప్రయోజనం ఆవిరవుతోంది. ముడి చమురు ధరలు పెరగడం, నౌకల రాకపోకలకు ఆటంకాల వల్ల ముడిసరకు లభ్యత తగ్గడం, అమెరికా డాలర్, యూరోతో పోలిస్తే రూపాయి విలువ క్షీణిస్తుండటంతో ముడి పదార్థాల ధరలు అమాంతం పెరిగాయి. ముడిచమురు ఆధారిత ఉత్పత్తులైన ప్లాస్టిక్, రెసిన్, పాలిమర్ ధరలు గత నెల రోజుల్లోనే 25% పెరిగినట్లు చెబుతున్నారు. అంతర్జాతీయంగా సరకు రవాణా రేట్లు 7-10% అధికమయ్యాయి. ఫలితంగా ఏప్రిల్ నుంచి కార్లు, టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీల ధరలు 5-6% పెరిగే అవకాశం ఉంది. వాహన కంపెనీలు 2-3%, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీసంస్థలుత 5-6% ధరలు పెంచాలని యోచిస్తున్నాయి. ఇప్పటికే మెర్సిడెస్ బెంజ్, ఆడి వంటి లగ్జరీ కార్ల కంపెనీలు ఏప్రిల్ 1 నుంచి 2%, టాటా మోటార్స్ తమ వాణిజ్య వాహనాల ధరలను 1.5% వరకు పెంచుతామని ప్రకటించాయి. ప్లాస్టిక్ విడిభాగాల సరఫరాదారులు దీర్ఘకాలిక ఒప్పందాలకు నిరాకరిస్తుండటంతో, గృహోపకరణాల ధరల పెంపు అనివార్యమని సంస్థలు పేర్కొంటున్నాయి.

రసాయనాలు, సింథటిక్ రబ్బర్ వంటి వాటి దిగుమతుల్లో జాప్యం జరుగుతోందని పరిశ్రమ పేర్కొంటోంది.పాదరక్షల తయారీకి అవసరమైన ముడిసరుకుల ధరలు పెరగడంతో ఏప్రిల్ నుంచి 8-12% ధరలు పెరిగే అవకాశం ఉందని ఒక ప్రముఖ సంస్థ పేర్కొంటోంది. రంగుల తయారీ సంస్థ బెర్జర్ 5% ధరలు పెంచనుంది. ముడి చమురు బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి 100 డాలర్లకు చేరడంతో, ఎఫ్ఎంసీజీ కంపెనీల ప్యాకేజింగ్ వ్యయాలు అధికమవుతున్నాయి. దీనిని ఎదుర్కొనేందుకు 'ష్రింక్‌ఫ్లేషన్' దిశగా అడుగులు వేస్తున్నాయి. అంటే ప్యాకెట్ ధర మార్చకుండా, లోపల ఉండే వస్తువు పరిమాణం తగ్గించడం ద్వారా కంపెనీలు తమ లాభాలు కాపాడుకోవాలని చూస్తున్నాయి. ఎల్‌పీజీ కొరత కారణంగా ప్యాకేజ్డ్ ఫుడ్ తయారీ ప్లాంట్లు ఉత్పత్తిని తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.


### పెరుగుతున్న ద్రవ్యోల్బణం

సవాళ్లు ఉన్నప్పటికీ, 2026లో భారతీయ గృహ వినియోగ వ్యయం 8.3% వృద్ధి చెందుతుందని ఫిచ్ అనుబంధ సంస్థ బీఎంఐ అంచనా వేసింది. మధ్యతరగతి వర్గాల విస్తరణ ఇందుకు దోహదం చేస్తుందని పేర్కొంది. పశ్చిమాసియా సంక్షోభంతో ద్రవ్యోల్బణం ముప్పు పొంచి ఉందని హెచ్చరించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రిటెయిల్ ద్రవ్యోల్బణ అంచనాను 5.1 శాతానికి బీఎంఐ పెంచింది. ఫిబ్రవరిలో ఇది 3.21 శాతంగా ఉన్నా, ఇరాన్ యుద్ధ పరిణామాల ప్రభావంతో మార్చిలో 3.5 శాతానికి చేరొచ్చన్నది ఇక్రా అంచనా.. మొత్తంగా చూస్తే, జీఎస్టీ హేతుబద్ధీకరణతో వినియోగదారులకు చేకూరిన ప్రయోజనాలు, ఇరాన్ యుద్ధ పరిణామాల కారణంగా క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.

# హైదరాబాద్‌లో ఈవీ ఛార్జర్ల ఉత్పత్తి కేంద్రం

హైదరాబాద్: విద్యుత్ వాహనాలకు ఛార్జింగ్ పరికరాలు, విద్యుత్ పరిష్కారాలను అందించే ఎగ్జికామ్ టెలీ సిస్టమ్స్, హైదరాబాద్‌లో తన సమీకృత ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించింది. మొత్తం 18.4 ఎకరాల్లో, 2.80 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ప్లాంటుపై రూ.216 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు సంస్థ వెల్లడించింది. దీనిద్వారా 750కి పైగా ఉద్యోగాలు లభిస్తాయని వివరించింది. సంస్థ ఉత్పత్తి సామర్థ్యాన్ని 2.5 రెట్ల మేర, ఈ ప్లాంటు తొలిదశ పెంచుతుందని పేర్కొంది. ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, లిథియం-అయాన్ బ్యాటరీ సిస్టమ్స్, టెలికాం, డేటా సెంటర్లకు అవసరమైన కీలక విద్యుత్ పరికరాల గిరాకీని ఈ కేంద్రం తీర్చనుంది. ట్రిటియంకు చెందిన ట్రై-ఫ్లెక్స్ పవర్ మాడ్యూళ్లనూ ఇక్కడ తయారు చేస్తారు. 40% పచ్చదనం, 1 మెగావాట్ రూఫ్‌టాప్ సోలార్ ప్లాంటు ఇక్కడ ఉన్నట్లు తెలిపింది. ఈవీ ఛార్జర్ల పనితీరు పరిశీలనకు టెస్టింగ్ కేంద్రాన్నీ ఏర్పాటు చేస్తామని ఎగ్జికామ్ సీఈఓ, ఎండీ అనంత్ నహతా తెలిపారు.






# 3 ఐపీఓలకు సెబీ ఆమోదం

**న్యూఢిల్లీ:**ట్రావెల్ టెక్నాలజీ సంస్థ ట్రావెల్‌స్టాక్ టెక్, లక్ష్య కోచింగ్ కేంద్రాలను నిర్వహిస్తున్న లెర్న్‌ఫ్లుయెన్స్ ఎడ్యుకేషన్, టీ కేఫ్ చైన్ టీ పోస్ట్ ఐపీఓ ప్రతిపాదనలకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. ట్రావెల్‌స్టాక్ టెక్ రూ.250 కోట్ల తాజా షేర్లను జారీ చేయబోతోంది.ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో 2,68, 52,969 షేర్లను ప్రమోటర్లు, వాటాదార్లు విక్రయించనున్నారు. లెర్న్‌ఫ్లుయెన్స్ ఎడ్యుకేషన్ రూ.246 కోట్ల తాజా షేర్లను ఆఫర్ చేయనుంది. ఓఎఫ్ఎస్‌లో 40 లక్షల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు విక్రయిస్తారు. టీ పోస్ట్ 1.43 కోట్ల తాజా షేర్లను జారీ చేయనుంది. ఓఎఫ్ఎస్‌లో 1.43 కోట్ల షేర్ల వరకు ప్రమోటర్లు విక్రయించనున్నారు. ధరల శ్రేణి, ఇష్యూ తేదీలు త్వరలోనే వెల్లడవుతాయి.జియో ఐపీఓకు 6 బ్యాంకుల సహకారం: తన టెలికాం సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ కోసం బ్యాంక్ ఆఫ్ అమెరికా సెక్యూరిటీస్, గోల్డ్‌మ్యాన్ శాక్స్ గ్రూప్‌తో పాటు 6 బ్యాంకులతో కలిసి పని చేస్తున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) తెలిపింది. జియో ఐపీఓ ద్వారా 4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.37,000 కోట్ల) నిధులను సమీకరించాలనుకుంటోంది. సిటీ గ్రూప్, జేఎం ఫైనాన్షియల్, కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, మోర్గాన్ స్టాన్లీ ఈ ఐపీఓ కోసం పని చేస్తున్నాయని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి. జియో విలువను బ్యాంకర్లు 170 బిలియన్ డాలర్లు (సుమారు రూ.15.64 లక్షల కోట్లు)గా లెక్కించారు. సవరించిన ఐపీఓ నిబంధనల ప్రకారం కనీసం 2.5% ఈక్విటీని జియో విక్రయిస్తే సరిపోతుంది.



# దీర్ఘకాలిక యుద్ధం ఉచ్చులో అమెరికా!

### ట్రంప్ సైనిక విజయం సాధించినా... రాజకీయ, వ్యూహాత్మక గెలుపులు కష్టమే

**ఇరాన్‌పై దాడులు, పరిణామాలపై నిపుణుల విశ్లేషణ**

**వాషింగ్టన్:**మెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు, దానికి ఇరాన్ ప్రతిదాడులు ప్రస్తుత యుద్ధాన్ని రోజురోజుకీ మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. ఇరు పక్షాలతో పాటు ప్రపంచ దేశాలూ దీనికి భారీ మూల్యాన్నే చెల్లిస్తున్నాయి. తొలిరోజు దాడిలో ఇరాన్ సుప్రీంలీడర్ అలీ ఖమేనీ, ఆ దేశ ముఖ్య సైనికాధికారులు చనిపోవడంతో భారీ విజయం సాధించామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. సైనికపరమైన ఈ విజయం...రాజకీయ, వ్యూహాత్మక గెలుపునకు దారితీయకపోగా దీర్ఘకాల యుద్ధంలో ఆ దేశాలు కూరుకుపోయేలా చేస్తోందని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ట్రంప్ తక్షణ లక్ష్యం ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు. తొలిరోజు విజయంతో ఈ లక్ష్యాన్ని చేరుకోవడం ఎంతో సమయం పట్టదని అంచనా వేశారు. కానీ, యుద్ధం ప్రారంభమై రెండు వారాలైనా ట్రంప్, నెతన్యాహు ఆశించినట్లు టెహ్రాన్‌లో మత గురువుల పాలన ఇప్పటికిప్పుడు ముగిసిపోయే సూచనలు కనిపించటంలేదు. పైగా ఇరాన్ పన్నిన దీర్ఘకాలిక యుద్ధం ఉచ్చులో చిక్కుకున్నట్లు అనిపిస్తోంది. యుద్ధ పరిధిని భౌగోళికంగా విస్తరింపజేయాలన్నదీ టెహ్రాన్ వ్యూహం. గల్ఫ్‌లో అమెరికా సైనిక స్థావరాలున్న దేశాలపై దాడులు దీనిలో భాగమే. అమెరికా యుద్ధం ఖర్చులను భారీగా పెంచడం, చమురు సరఫరాలను అడ్డుకోవడమే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచడం ఇరాన్ నేతల ఉద్దేశం.తన లక్ష్యం నెరవేరకపోవడంతో



ట్రంప్...ఇరాన్‌పై దాడులను మరింత పెంచే అవకాశం ఉంది. అయితే, అవి రాజకీయ, వ్యూహాత్మక, జాతీయ భద్రత విజయాలను అందిస్తాయా లేదా అన్నదే ప్రధాన ప్రశ్న. 'యుద్ధ విస్తరణ ఉచ్చు పలు దశల్లో ఉంటుంద'ని అమెరికా చరిత్రకారుడు రాబర్ట్ పపే తెలిపారు. గగనతల ఆధిపత్యంతో సాధించే విజయాలు స్వల్పంగానే ఉంటాయని గతంలో పలువురు అమెరికా అధ్యక్షులకు ఆయన సూచించారు. 'అమెరికా సైన్యం తొలి రోజు వందశాతం విజయం సాధించింది. వ్యూహాత్మక గెలుపునకు అది దోహదపడకపోవడంతో రెండో దశ ఉచ్చులోకి ప్రవేశించింది' అని రాబర్ట్ పపే పేర్కొన్నారు. 'దాడుల తీవ్రతను ఇంకా పెంచే సామర్థ్యం అమెరికాకు ఉంది. అయినా వ్యూహాత్మక విజయాన్ని సాధించలేదు. అప్పుడు మూడో దశ ఉచ్చుకు చేరువవుతుంది. అదే అసలైన సంక్షోభం. చాలా ప్రమాదకరమైన ఐచ్ఛికాల గురించి ఆలోచించాల్సి వస్తుంది. ప్రస్తుతం అమెరికా మూడోదశ ఉచ్చు అంచుల్లో ఉంది' అని రాబర్ట్ పపే అభిప్రాయపడ్డారు.

**గల్ఫ్ దేశాల్లో వ్యతిరేకత**

యుద్ధం మొదటి రోజు తగిలిన గట్టి దెబ్బతో ఇరాన్ నాయకత్వం తనదైన సొంత పంథాలో ప్రపంచ దేశాలను సంక్షోభంలోకి లాగే యత్నం చేసింది. ట్రంప్‌పై ఒత్తిడి పెంచే వ్యూహాన్ని అనుసరించడం ప్రారంభించింది. అమెరికా, గల్ఫ్ దేశాల మధ్య దూరాన్ని పెంచడం, ఆయా దేశాల్లోని ప్రజలు అక్కడి ప్రభుత్వాలను నిలదీసేలా చేయడం కూడా ఇరాన్ లక్ష్యమే. ఇజ్రాయెల్ విస్తరణవాద ఆకాంక్షలకు మనమెందుకు మూల్యం చెల్లించాలని గల్ఫ్ దేశాల ప్రజలు తమ ప్రభుత్వాధినేతలను ప్రశ్నించే పరిస్థితిని తీసుకురావడం కూడా టెహ్రాన్ వ్యూహకర్తల ఉద్దేశమని రాబర్ట్ పపే వివరించారు. ప్రస్తుతం యుద్ధం కొనసాగుతున్న తీరు నెల రోజుల క్రితం ఊహించిన దానికన్నా భిన్నంగా ఉందని అమెరికా మాజీ రాయబారి రాబర్ట్ ముల్లే తెలిపారు. ఇరాన్‌లో భూతల దాడులకు సైన్యాన్ని రంగంలోకి దించి, కీలకమైన మౌలిక వసతులను, కొంత భూభాగాన్ని స్వాధీనం చేసుకుని, కుర్దులు, లేదా ఇతర స్థానిక గ్రూపులతో అమెరికా సంప్రదింపులు జరపటం ఒక మార్గం. అయితే, ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడంలేదని పేర్కొన్నారు.

**విజయం వడ్డించిన విస్తరి కాదు**

'ఇరాన్‌పై దాడులను తీవ్రతరం చేయడం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఉన్న సులభమైన మార్గం. అయితే, ఇరానీయులు అంత తేలిగ్గా లొంగిపోరు. విజయాన్ని వడ్డించిన విస్తరిలా అందించబోరు' అని మాజీ రాయబారి రాబర్ట్ ముల్లే అభిప్రాయపడ్డారు.వియత్నాం తరహాలో ఇరాన్ యుద్ధం కూడా ఏళ్ల తరబడి కొనసాగితే పరిస్థితి ఏమిటని పలువురు అమెరికన్లు ప్రశ్నిస్తున్నారు.




# రూ.9.75 లక్షల కోట్ల బ్యాంకు రుణాల రైటాఫ్

దిల్లీ: బ్యాంకులు గత 11 ఆర్థిక సంవత్సరాల్లో రూ.9.75 లక్షల కోట్ల విలువైన రుణాలను రైటాఫ్ (సాంకేతికంగా రద్దు) చేశాయని ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌధరీ పేర్కొన్నారు. 2019-20లో అత్యధికంగా రూ.1.59 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేయగా.. 2024-25లో ఇవి రూ.47,568 కోట్లకు పరిమితం అయ్యాయి. 2014-15లో రూ.31,723 కోట్లు, 2015-16లో రూ.40,416 కోట్లు, 2016-17లో రూ.68,308 కోట్లు, 2017-18లో రూ.99,132 కోట్ల చొప్పున రుణాలను బ్యాంకులు రైటాఫ్ చేసినట్లు లోక్‌సభకు మంత్రి రాతపూర్వకంగా తెలిపారు.అగ్రగామి ఉద్దేశపూర్వక ఎగవేతదార్లు వీరే..: 2025 మార్చి 31 నాటికి అగ్రగామి 10 ఉద్దేశపూర్వక ఎగవేతదార్లు బ్యాంకులకు మొత్తం మీద రూ.40,635 కోట్ల బకాయి పడ్డట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకు తెలిపారు. అందులో ఏబీజీ షిప్‌యార్డ్ రూ.6,695 కోట్ల బకాయితో తొలి స్థానంలో ఉండగా, గీతాంజలి జెమ్స్ (రూ.6,236 కోట్లు) బీటా నాఫ్తాల్ (రూ.5,268 కోట్లు), రాకేశ్‌కుమార్ కుల్దీప్‌సింగ్ వాధ్వాన్ (రూ.4,291 కోట్లు), భూషణ్ స్టీల్ పవర్ అండ్ స్టీల్ డైరెక్టర్లు (రూ.3,810 కోట్లు), రాజా టెక్స్‌టైల్స్ (రూ.3,260 కోట్లు), గిల్ట్ ప్యాక్ (రూ.3,080 కోట్లు), ర్యాంక్ ఇండస్ట్రీస్ (రూ.2,655 కోట్లు), హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రా (రూ.2,540 కోట్లు) బ్యాంకులకు భారీ స్థాయిలో ఎగవేతలకు పాల్పడ్డాయి.

# ఫిబ్రవరిలో తగ్గిన వాణిజ్య లోటు

### రూ.2.5 లక్షల కోట్లకు పరిమితం


దిల్లీ: దేశ వస్తువుల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన ఫిబ్రవరిలో 0.81% తగ్గి 36.61 బిలియన్ డాలర్ల (సుమారు రూ.3.37 లక్షల కోట్ల)కు పరిమితమయ్యాయి. అయితే దిగుమతులు 24.11% పెరిగి 63.71 బి.డాలర్ల (రూ.5.87 లక్షల కోట్ల)కు చేరాయి. ఫలితంగా వాణిజ్య లోటు 27.1 బి.డాలర్లు (రూ.2.5 లక్షల కోట్లు)గా నమోదైంది. జనవరి లోటు 34.68 బి.డాలర్ల (రూ.3.19 లక్షల కోట్ల) కంటే ఇది తక్కువే అయినా, 2025 ఫిబ్రవరిలో నమోదైన 14.05 బి.డాలర్ల (రూ.1.29 లక్షల కోట్ల) కంటే దాదాపు రెట్టింపు.గత నెలలో పసిడి దిగుమతులు వార్షికంగా 218.55% పెరిగి 7.44 బి.డాలర్లకు, వెండి దిగుమతులు 285.23% పెరిగి 1.66 బి.డాలర్లకు చేరాయి. మన దేశం పసిడిని స్విట్జర్లాండ్ నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటుంది. ఇక్కడి నుంచి బంగారం దిగుమతి 719.3% పెరిగి 2.71 బి.డాలర్లుగా నమోదైంది. చమురు దిగుమతులు 9% పెరిగి 12.97 బి.డాలర్లుగా నమోదయ్యాయి.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఫిబ్రవరిలో దేశ ఉత్పత్తుల ఎగుమతులు 1.84% పెరిగి 402.93 బి.డాలర్లకు చేరాయి. దిగుమతులూ 8.53% అధికమై 713.53 బి.డాలర్లుగా నమోదయ్యాయి. ఫలితంగా 11 నెలల కాలానికి వాణిజ్య లోటు 310.60 బి.డాలర్లకు చేరింది. 2024-25 ఇదే కాలంలో వాణిజ్యలోటు 261.80 బి.డాలర్లు మాత్రమే. ఫిబ్రవరిలో సేవల ఎగుమతులు 39.53 బి.డాలర్లుగా ఉండగా, దిగుమతులు 16.38 బి.డాలర్లకు పరిమితమయ్యాయి. ఫలితంగా వాణిజ్య మిగులు 23.15 బి.డా. (సుమారు రూ.2.13 లక్షల కోట్లు)గా ఉంది.

# దీదీ x సువేందు

ప్రతిపక్ష నేత సువేందు అధికారి పోటీ చేస్తున్నారు. భవానీపూర్ మమత సొంత నియోజకవర్గం. 2011 నుంచి మూడుసార్లు విజయం సాధించారు. సువేందు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న నందిగ్రామ్‌లో టీఎంసీ పవిత్ర కర్‌ను బరిలోకి దింపింది. గతంలో టీఎంసీ నుంచి భాజపాలో చేరిన పవిత్ర కర్ అభ్యర్థుల జాబితా విడుదల కావడానికి కొన్ని నిమిషాల ముందే టీఎంసీలో తిరిగి చేరడం ఆసక్తికరంగా మారింది. గతంలో మమతకు నమ్మకస్తుడిగా ఉన్న సువేందు 2021 ఎన్నికల్లో భాజపా తరఫున బరిలోకి దిగి.. నందిగ్రామ్‌లో టీఎంసీ అధినేతను దాదాపు 2,000 ఓట్ల తేడాతో ఓడించారు. దీంతో రాష్ట్ర అసెంబ్లీలోకి తిరిగి ప్రవేశించడానికి మమత భవానీపూర్ నుంచి పోటీ చేయాల్సి వచ్చింది.తమ పార్టీ అభ్యర్థుల జాబితా ప్రకటించిన అనంతరం మమత మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో తమ పార్టీ 226 కంటే ఎక్కువ సీట్లలో విజయం సాధిస్తుందన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన గంటల వ్యవధిలోనే రాష్ట్ర డీజీపీ, చీఫ్ సెక్రటరీ సహా పలువురు కీలక అధికారులపై ఈసీ వేటు వేయడాన్ని తప్పుబట్టారు. ఎన్నికల సమయంలో ఘర్షణలు సృష్టించడానికే భాజపా ఈ కుట్ర పన్నిందని ఆరోపించారు. ఆ

# మార్చి ఎగుమతులపై యుద్ధ ప్రభావం

**న్యూఢిల్లీ:**ఫిబ్రవరి 28 నుంచి పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనందున, ఈ ప్రభావం మార్చి గణాంకాల్లో కనిపించే అవకాశం ఉంది. భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల మధ్య సరకు రవాణాకు సవాళ్లు ఎదురవుతున్నాయని, మార్చి ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోందని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. పశ్చిమాసియా ఘర్షణలు ప్రపంచ వాణిజ్య అనిశ్చితిని పెంచాయని భారత ఎగుమతి సంస్థల సమాఖ్య (ఫియో) అధ్యక్షుడు ఎస్‌సీ రాల్హాన్ వెల్లడించారు.కొత్త టారిఫ్‌ల విషయంలో స్పష్టత వచ్చాకే, అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ముందుకెళతామని కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ స్పష్టం చేశారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం తొలిదశ ప్రతిపాదనలకు ఇరుదేశాలు ఫిబ్రవరిలోనే ఆమోదం తెలిపాయి. దాని ప్రకారం మనదేశ ఉత్పత్తులపై సుంకాన్ని 18 శాతానికి పరిమితం చేస్తామని అమెరికా తెలిపింది. ఈ ఒప్పందంపై ఈ నెలలోనే సంతకాలు జరగాల్సి ఉంది. కానీ, ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలను ఆ దేశ సుప్రీంకోర్టు కొట్టి వేయడంతో, అమెరికా రాజ్యాంగంలోని ఆర్టికల్ 122ను ప్రయోగించి అన్ని దేశాల ఉత్పత్తులపైనా 10% టారిఫ్ విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇవి ఫిబ్రవరి 24 నుంచి 150 రోజుల పాటు అమల్లో ఉంటాయి. తదుపరి సుంకాన్ని 15% చేస్తామని తెలిపినా, ఉత్తర్వులు జారీ చేయలేదు. దీంతో టారిఫ్‌ల అంశంపై అస్పష్టత నెలకొంది. ఈలోపు భారత్, చైనా సహా 60 దేశాలపై సెక్షన్ 301 కింద వాణిజ్య విచారణ నిర్వహిస్తామని అమెరికా ప్రకటించింది. ఇవన్నీ అనిశ్చితిని పెంచాయి. అమెరికా, భారత్‌లకు పరస్పరం ప్రయోజనం కలిగేలా.. వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామని రాజేశ్ వివరించారు.



# పరిహారం పెంచితేనే రైల్వే భూ సేకరణకు పచ్చజెండా

- ప్రస్తుతం ఇచ్చే పరిహారంతో గుంట భూమి రాదు
- ఎకరానికి రూ 1 కోటి చెల్లించాలి
- సమావేశంలో అధికారులకు తేల్చి చెప్పిన భూనిర్వాసితులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్‌లో భాగంగా బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం పెంచితేనే భూ సేకరణకు అంగీకరిస్తామని భూనిర్వాసితులు అధికారులకు తేల్చి చెప్పారు. భూసేకరణలో భాగంగా మంగళవారం భూసేకరణకు సంబంధించిన భూ నిర్వాసితులతో వేములవాడ తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో ఆర్డీవో రాధాబాయ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వేములవాడ, నాంపల్లికి చెందిన భూ నిర్వాసితులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సిరిసిల్ల ఆర్డీవో, భూ సేకరణ విభాగం ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా సరైన నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. 2022 లో పలువురు భూ నిర్వాసితులుకు ఎకరానికి రూ 36 లక్షల పరిహారం చెల్లించారన్నారు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడంతో తమకు చెల్లించాల్సిన పరిహారం డబ్బులు పెండింగ్‌లో ఉన్నట్లు భూ నిర్వాసితులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మొత్తానికి 12 శాతం వడ్డీతో కలిపి ప్రస్తుతం ఎకరానికి రూ.41,13,744 నష్టపరిహారం చెల్లించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మొత్తం సరిపోదని బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.81 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సబ్‌రి జిస్ట్రార్ మార్కెట్ విలువ ప్రకారమే చెల్లింపులు జరుగుతాయని అధికారులు స్పష్టం చేశారు. మా ర్కెట్ విలువకు తక్కువగా చెల్లించడంఎలా సమఒజసం అవుతుందని నిర్వాసితులు ప్రశ్నించారు. భూములు, ఫ్లాట్లు, బోరు బావులు సర్వం కోల్పో తున్నా మని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిలో కొం దరికి నోటీసులు అందలేదని తెలిపారు. తమ సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వం స్పందించి సరైన నష్టపరిహారం అందించాలని కోరారు.





**కుటుంబానికి నేనే ఆధారం.. : విజయలక్ష్మి**

రోడ్డు ప్రమాదంలో భర్త చనిపోయాడు. అత్త మామతో పాటు తన కుమారుడిని పోషించుకోవాల్సిన బాధ్యత నా పైన ఉంది. రైల్వే లైన్ లో ఉన్న భూమి పోతుండడంతో నాకు ఎలాంటి ఆధారం లేదు . దయచేసి నాకు మరో చోట భూమితో పాటు పరిహారం ఇప్పించాలి.

**ఎకరానికి రూ 1 కోటి పైన ధర : కూరగాయల మల్లేశం**

వేములవాడలో ఎకరం బహిరంగ మార్కెట్లో రూ 1 కోటి పైన ధర పలుకుతుంది. రూ 36 లక్షలు పరిహారం చెల్లిస్తామంటే ఎకరం భూమి వస్తుందా. ప్రభుత్వం చెల్లిస్తున్న పరిహా రంతో రెండు గుంటల భూమి కూడ కొనలేము. గతంలోనే అందరికీ ఇచ్చిన ప్రకారం మాకిస్తే అప్పుడే మేము మిగతా చోట్ల భూమి కొనుగోలు చేసేవారమన్నారు.

**న్యాయం చేసే విధంగా ప్రయత్నం చేస్తా : ఆర్డీవో రాధాబాయి**

అనంతరం ఆర్డీవో రాధాబాయి మాట్లాడుతూ భూ నిర్వాసితులకు కావలసిన డిమాండ్లపై లిఖితపూర్వకంగా దరఖాస్తు ఇస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. భూ నిర్వాసితులకు న్యాయం చేసే విధంగా ప్రయత్నం చేస్తానని ఆర్డీఓ తెలిపారు. ఈ సమావేశంలో తాసిల్దార్ జయంత్ కుమార్, నాయబ్ తహసిల్దార్ సురేష్ , శ్రీధర్, రెవెన్యూ సిబ్బంది, భూనిర్వాసితులు పాల్గొన్నారు.

# కవిత్వం సర్వోత్తమమైన కళ

- ప్రముఖ కవి,సినీ టీవీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్
- ఘనంగా" పరాభవ నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళన"వేడుకలు



**కుత్బుల్లాపూర్ (జనంసాక్షి):** మనసులోని భావాలను బాహ్య ప్రపంచానికి పరిచయం చేసే కవుల కవిత్వం సర్వోన్నతమైన కళ అని ప్రముఖ కవి, సినీ టీవీ గేరచయిత మౌనశ్రీ మల్లిక్ పేర్కొన్నారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని "చైతన్య కళానికేతన్" సాహితీ సంస్థ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దుమ్ నగర్,భగత్ సింగ్ మార్గ్‌లోని చైతన్య విద్యా నికేతన్ పాఠశాల హాల్‌లో మంగళవారం సాయంత్రం "శ్రీ పరాభవ నామ ఉగాది కవి సమ్మేళనం' 'సంస్థ అధ్యక్షులు, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్. శివరాత్రి యాదగిరి, ప్రధాన కార్యదర్శి ప్రముఖ కవి వాకిటి రామిరెడ్డిల నేతృత్వంలో ప్రముఖ సామ్రాట్, కళాసింధు,ప్రపంచ మోటివేషన్ స్పీకర్ డాక్టర్. ఆలపాటి అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ 64 కళల్లో కవులు రచించే కవితలకు ఎంతో విలువైనయని ఉంటుందని తెలిపారు. రవి కాంచని చోట కవి తప్పక ప్రకాశిస్తాడన్నారు. నాటి నుండి నేటివరకు ఎంతో మంది కవులు సమాజాభివృద్ధికి కృషి చేసిన వారేనని తెలిపారు. కవుల కలం నుండి జాలువారే ప్రతి అక్షరం ఒక అద్భుతమైన కవిత అవుతుందని ఈ సందర్భంగా వివరించారు. చైతన్య కళానికేతన్ సాహితి సంస్థ ఆధ్వర్యంలో గత 32 సంవత్సరాలుగా ఉగాది కవి సమ్మేళనాలు నిర్వహిస్తూ వివిధ ప్రాంతాల కవులందరిని ఒకే వేదిక పైకి తీసుకువచ్చిన నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. కవి సామ్రాట్ డాక్టర్. ఆలపాటి మాట్లాడుతూ తెలుగుదనం యొక్క సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడేందుకు ఇటువంటి కవి సమ్మేళనాలు ఎంతో దోహదపడతాయన్నారు. చైతన్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, వాకిటి రామిరెడ్డి లు మాట్లాడుతూ కవుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసం ఇటువంటి కవి సమ్మేళనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత మూడున్నర దశాబ్దాలుగా ఎంతోమంది ఉత్తమ కవులను,కళాకారులను వేదికపై సన్మానించుకోవడం ఎంతో సంతోష కరమన్నారు. అనంతరం చైతన్య కళానికేతన్ సంస్థ నిర్వాహకులు కవులను శాలువాలతో మేమేంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజారావు త్రిపురనేని, కవులు డాక్టర్,కూర్మాచలం శంకర స్వామి,మేడ రాజేశ్వరి, డాక్టర్. నందనం సృజనాకర్, న్యాలకంటి మానయ్య,శ్రీహరి దేగెకర్, కవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వారాసిగూడలో చికెన్ మార్ట్‌పై పోలీసుల దాడి

**610 కిలోల పాడైపోయిన చికెన్ స్వాధీనం**



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** సికింద్రాబాద్ జోన్ పరిధిలోని వారాసిగూడ పోలీసు స్టేషన్ పరిధిలో భారీ ఆహార కల్తీ ఘటన వెలుగులోకి వచ్చింది. బాపూజీ నగర్,ముషీరాబాద్ ప్రాంతంలోని ఏ-1 ఫ్రెష్ చికెన్ మార్ట్‌లో అనారోగ్యకరమైన, పాడైపోయిన చికెన్‌ను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి నిర్వహించారు. మంగళవారం విశ్వసనీయ సమాచారంతో పోలీసులు సదరు మార్కెట్ షాపులో డీకాయ్ సిబ్బంది ముందుగా దుకాణాన్ని తనిఖీచేశారు. అక్కడ నిల్వ ఉంచిన చికెన్ పాడైపోయి దుర్వాసన వస్తున్నట్లు గుర్తించారు. అనంతరం సబ్ ఇన్‌స్పెక్టర్ కె. రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బృందం దుకాణంపై దాడి చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 610 కిలోల చికెన్‌ను అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ ఉంచినట్టు గుర్తించారు. ఎలుకలు, పిల్లులు సంచరిస్తున్న పరిస్థితుల్లో ఆహారం కలుషితమవుతున్నప్పటికీ, ప్రజలకు విక్రయిస్తున్నట్టు బయట పడింది. దుకాణ యజమాని షేక్ షకీల్ (40) నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, మానవ వినియోగానికి అనర్హమైన మాంసాన్ని విక్రయిస్తున్నట్టు పోలీసులు నిర్ధారించారు. అంతేకాకుండా, ఆ దుకాణానికి సంబంధించిన ట్రేడింగ్ లైసెన్స్ ఏడాది క్రితమే గడువు ముగిసినా,అదే కొనసాగిస్తున్నట్టు పోలీసుల తనిఖీల్లో బయటపడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# గురుకులాల రద్దు ప్రతిపాదనలు ఆమోదయోగ్యం కావు

- బడ్జెట్ పెంచకుండా విద్యాసంస్థలను బలోపేతం చేయలేం...
- ఉన్నత విద్యా కమిటీ మాజీ చైర్మన్ ఆర్ లింబాద్రి...
- విస్తృతస్థాయి చర్చ జరగాలి.. ప్రొఫెసర్ కోదండరాం...



**ముషీరాబాద్, (జనంసాక్షి):** ఉత్తమ ఫలితాలు అందిస్తున్న గురుకులాలను రద్దు చేయాలన్న తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సులు ఆమోదయోగ్యం కావని వాటిని తిరస్కరించాలని ఉన్నత విద్యా కమిటీ మాజీ చైర్మన్ ఆర్ లింబాద్రి అన్నారు. ఈ మేరకు మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కె.కేశవరావు, వేణుగోపాల్, పివిఎస్ ఎన్ రాజుల అధ్యక్షతన. ఫోరమ్ ఫర్ డిబేట్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఉన్నత విద్యా కమిటీ మాజీ చైర్మన్ ఆర్ లింబాద్రి, ప్రొఫెసర్ కోదండరాం,ప్రొఫెసర్ కె లక్ష్మీ నారాయణలు పాల్గొని మాట్లాడారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. విద్యా కమిషన్ సిఫార్సు లపై విస్తృత స్థాయి చర్చ జరగాలని, ఆమోదయోగ్యమైన అంశాల అమలుకు రాజకీయపరమైన ఒత్తిడి జరగాలని సూచించారు. విశ్వవిద్యాలయాల్లో విద్యా ప్రమా ణాలు పెంచే విధంగా విద్యావ్యవస్థ ఉండాలని విద్యారంగానికి బడ్జెట్ పెంచాలని తగిన సంసిద్ధత లేకుండా పూర్వ ప్రాథమిక విద్య తరగతులు ప్రారంభించడం సరికాద న్నారు. ప్రొఫెసర్ కె లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యా బోధనలో సరైన శిక్షణ పొందిన ఉపాధ్యా యు లనే నియమించాలని నివేదికలో కొన్ని మంచి సూచనలు ఉన్నప్పటికీ వాటికి అమలుకు సంబం ధించిన కార్యాచరణ సరిగ్గా లేదన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రతిపాదన వలన సుమారు 20 వేల ప్రభుత్వ పాఠశాలలు మూతబడతాయని, ఇది విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకమని పలువురు వక్తలు అన్నారు.

# మన అమ్మ హాస్పిటల్‌లో క్యాన్సర్‌కి అరుదైన శస్త్ర చికిత్స



**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని మన అమ్మ హాస్పటల్‌లో క్యాన్సర్ వ్యాధికి ఆ హాస్పిటల్ ప్రత్యేక బృందం అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. వల్లాల గ్రామానికి చెందిన మహిళ గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ వైద్యం కోసం మన అమ్మ హాస్పటల్ లో చేరారు. క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ దమ్మలూరి రాము పర్య వేక్షణలో డాక్టర్ల బృందం ఐదు గంటలు శ్రమించి శస్త్ర చికిత్స నిర్వహించి క్యాన్సర్ కణితిని, అది వ్యాపిం చిన ప్రేగు అంచులని తొలగించి, ఇలియోసికల్ అనస్టో మిస్ సర్జరీ చేసి క్యాన్సర్ కణితి ఆపరేషన్ విజయవం తంగా పూర్తి చేశారు. ఈ ఆపరేషన్ లో డాక్టర్ నాగార్జున, డాక్టర్ నాగ డాలియ వెన్న, డాక్టర్ ఇందిరా, డాక్టర్ రమేష్, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి పరిరక్షణకు కార్మికులు ఒక్కొక్కరు భగత్ సింగ్ కావాలి

**సిఐటియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ఉపాధ్యక్షులు వీరయ్య**



**గోదావరిఖని, (జనంసాక్షి) :** సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజా రెడ్డి అధ్యక్షతన "భారత కార్మికోద్యమం - సిఐటియు పని విధానం" అనే అంశం పై సెమినార్ గోదావరిఖని రెడ్డి కన్వెన్షన్ హాల్ లో జరిగింది. సింగరేణిలోని రామగుండం రీజన్, బెల్లంపల్లి రీజన్ లోని 150 యువ కార్మికులు ఈ సెమినార్ కు హాజరు అయ్యారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడుతూ కష్టం మాత్రమే తెలిసిన మీరు సింగరేణి చీకటి సూర్యలు, సింగరేణి సంస్థ రక్షణ కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై. ప్రతి యువ కార్మికుడు ఓ భగత్ సింగ్ కావాలి, ఈరోజు ప్రపంచ పరిస్థితులు చూస్తే యువత వల్లే నేపాల్‌లో, శ్రీలంకలో ప్రభుత్వాలు మారాయి అటు వంటి యువత మన సింగరేణి సంస్థలో ఉన్నారు, ప్రతి యువ కార్మికుడు భగత్ సింగ్ లై ముందు రావాలి అని చెప్పారు. ఎస్.వీరయ్య మాట్లాడుతూ నేడు ఉన్న కేంద్ర ప్రభుత్వం ప్రతి హిందువు నా బంధువు అంటూనే మన మధ్య తగాదాలు పెడుతూ. ఇన్కమ్ ట్యాక్స్, జిఎస్టిల పేరుతో ఇతర రూపాలలో దోచుకుంటూ, అమెరికా కుటిల రాజకీయాలకు ఊడిగం చేస్తున్నాడు, మోదీ ట్యాక్స్ లు, సంస్కరణలకు ఎక్కువ నష్ట పోయేది మెజారిటీగా కార్మికులుగా ఉన్న హిందువులనే..హిందువులు బంధువులు అంటూనే అదే హిందువులను రాబందులా దోచుకుంటున్నారనీ తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి, వై యాకయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ, అల్లి రాజేందర్, ఎస్ .వెంకట స్వామి, స్టేట్ ట్రెజరర్ ఈ సాయరెడ్డి, అరెపల్లి రాజమౌళి, శివరాం రెడ్డి, మెండే శ్రీనివాస్, కుంట ప్రవీణ్, బానోతు వినయ్, కమిటీ సభ్యులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల

# అమలుపై ప్రభుత్వం విఫలం

**భాజపా రాష్ట్ర నాయకుడు రామకృష్ణ**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తన మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటిలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని భాజపా రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటుతున్న ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోవడాని నిరసిస్తూ మంగళవారం వేములవాడ బిజెపి పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వో కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కాలేదని, అలాగే సంక్షేమ పథకాలు కూడా ప్రజలకు అందడం లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలో ఒకటి రెండు మినహా అమలు కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,వెంటనే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలి
- రాజన్న సిరిసిల్ల కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనంసాక్షి):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా ల్లో వేగం పెంచాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, గ్రామ సమాఖ్య, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, టాయిలెట్ల నిర్మాణాలపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈ పీఆర్, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసుకునేలా సహకారం అందించాలని సూచించారు. తుది దశలో ఉన్న ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఈ నెల ఆఖరున మెగా గృహ ప్రవేశ కార్యక్రమానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేయాలని, వారి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. వడ్రంగి, ప్లంబర్, మేస్త్రి ఇతర ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన బడ్జెట్ లోనే ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, ఆయా మండలాల్లో గుడిసె ల్లో ఉంటున్న వారి వివరాలు సేకరించాలని, వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. హౌసింగ్, మున్సిపల్ అధికారులు ఇండ్ల నిర్మాణాల ఫోటోలు ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ విషయమై జడ్పీ డిప్యూటీ సీఈవో, హౌసింగ్. ఇతర అధికారులను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు ఇండ్లను పూర్తి చేయించాలని ఆదేశించారు. జిల్లాలో గ్రామ సమాఖ్య భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్ర భవనాల పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. అన్ని భవనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా వసతులు కల్పించిన తర్వాత ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఇట్టి సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఆర్డీఓ గీత, హౌసింగ్ డీఈ సాజిద్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, చందుర్తి మండల ప్రత్యేక అధికారి, పశు వైద్య, సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల మున్సిపల్ అభివృద్ధికి అన్నివిధాలా కృషి




**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**చేవెళ్ల, మార్చి 17 (జనంసాక్షి)** చేవెళ్ల మున్సిపల్ను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజల కార్యక్రమంలో భాగంగా మంగళవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో రోడ్లను శుభ్రం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరు సహకరించాలన్నారు. తడిపొడి చెత్తను వేరు చేసిన ఇంటి ముందరకు వచ్చే చెత్తబండిలో వేయాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమతవెంకట్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశం, కౌన్సిలర్లు బండారి శైలజాఆగిరెడ్డి, శ్రీనివాస్, పైండ్ల మధుసూదన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, కృష్ణ నాయక్, మాజీ సొసైటీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, పెంటయ్య గౌడ్, బెగరి రాములు, మాజీ ఎంపీపీ.బాల్ రాజ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పోలీసుల తనిఖీలో గంజాయి పట్టివేత

**ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లామంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని గడుదలగండి ప్రాంతంలో పోలీసులు నిర్వహించిన తనిఖీలలో గంజాయి అక్రమ రవాణా కేసు వెలుగులోకి వచ్చింది. మంథని సబ్ ఇన్‌స్పెక్టర్ మంథని రమేష్ ఆధ్వర్యంలో, పోలీస్ కానిస్టేబుళ్లు శివకుమార్, ఆదేశ్ సంయుక్తంగా నిర్వహించిన తనిఖీలలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, వారి వద్ద నుండి సుమారు 120 గ్రాముల గంజాయి, 2 మోటార్ సైకిళ్లు, 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వ్యక్తుల వివరాలు ఇలా ఉన్నాయి.. 1. చందు సంతోష్ (తండ్రి: లక్ష్మణ్), గోపాలపూర్, 2. కోల శ్రావణ్ (తండ్రి: కేశవ్), చింతకాని, కాటారం, 3. అల్లెం అరుణ్ (తండ్రి: తిరుపతి), చింతకాని, కాటారం. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ, నిందితులపై చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

# ఒంటిపూట బడుల్లో పిల్లల ఈత సరదా..

- ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకునే వారు కరువు..
- పీచుపల్లి కెనాల్లో ఈతకు వెళ్తున్న పాఠశాల విద్యార్థులు..



**చిగురుమామిడి (జనంసాక్షి) :** ఎండా కాలం వచ్చిందం టే చాలు ఉక్కపోతతో తట్టుకోలేక ఉపశమనం కోసం గ్రామాల్లో ఉండే పిల్లలు,యువత కాలువల్లోకి వెళున్నా రు. అందులో దూకి ఈతలు కొడుతూ కేరింతలు కొడు తున్నారు. వేసవి తాపం తీర్చుకోవడానికి కొందరు,ఈత నేర్చుకోవడానికి మరి కొందరు,సరదాగా గడిపేందుకు ఇంకొందరు నీళ్లలో దూకి తమ ఈత ముచ్చట తీర్చుకుంటున్నారు. మండుటెండల్లో ప్రభుత్వం ఒంటి పూట బడులు నిర్వహించడంతో పాఠశాలకు వెళ్లి వచ్చిన తర్వాత విద్యార్థుల ఆట,పాటలలో ఈత సరదా ఓభాగమై పోతుంది. కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలోని పలు గ్రామాల్లోని పెద్ద ఎత్తున ప్రవహిస్తున్న కెనాల్ కాలువల్లో చుట్టుపక్కల గ్రామాలనుంచి వచ్చి చిన్నపిల్లలు సైతం ఈతకు వెళ్తున్నారు. వాగులు వంకల్లో,బావుల్లో ఈతకు వెళ్లకుండా పిల్లలకు జాగ్రత్తలు చెప్పేవారు లేకుండా పోతున్నారు. దీంతో చాలా మంది పిల్లలు తెలియకుండానే ఒకరి వెంట ఒకరు ఈతకు వెళ్తున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో ఈత విహారం విషాదానికి దారి తీస్తున్న ఘటనలు అనేక ఉన్నాయనే చెప్పవచ్చు. ఈత రాకున్నా నీటిలోకి దిగడం, ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో ఈత కొట్టడం,చెరువులు,బావుల్లో కాలువల్లో ఈత పేరుతో ప్రయోగాలు చేయడం జరుగుతున్నాయి. ఏదైనా ప్రమాదం జరగకముందే పిల్లలు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

**డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్ బ్యూరో, మార్చి 17 (జనంసాక్షి) :** మాధకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమిష్టి కృషితో డ్రగ్స్ రహిత కరీంనగర్ గా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ... పోలీస్, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో మాధకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాన్షియస్ నెస్ క్లబ్బులు చురుగ్గా పనిచేసే విధంగా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని పలు సంక్షేమ శాఖ అధికారులను డ్రగ్స్ నివారణ కార్యక్రమాల్లో, సమావేశాలు భాగస్వాములను తెలిపారు. యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రగతి ప్రణాళికలను డ్రగ్స్ నిర్మూలన ఒక ముఖ్యమైన అంశమని తెలిపారు. అందుకు తగిన రీతిలో కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ... జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలోని యాంటీ డ్రగ్ కమిటీలు చురుగ్గా పనిచేస్తున్నాయని తెలిపారు. వివిధ విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నామని, ప్రజా రవాణా ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ డ్రగ్స్ నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిషేధిత ఇంజక్షన్లు, టాబ్లెట్లు వినియోగించినా, సరఫరా చేసిన బాధ్యులపై క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. జిల్లాలో గత రెండు నెలల్లో డ్రగ్ సంబంధిత కేసులు 3 నమోదు కాగా ఆరుగురిని అరెస్టు చేశారు. 578 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, నెంబర్లు రాజేంద్రప్రసాద్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుధవారం
18 మార్చి 2026
జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY


# తెలంగాణ యువతకు ఉన్నత విద్యామండలి కొత్త కోర్సులు

- యూజీ అండ్ పీజీ విద్యార్థుల కోసం 39 స్పెషల్ కోర్సులు
- విజన్ 2047 లక్ష్యంగా కార్యాచరణ
- టి-సాట్ లైవ్ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి




**హైదరాబాద్, (జనంసాక్షి):** తెలంగాణ యువత కోసం ఉన్నత విద్యామండలి ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఆధునిక సాంకేతికతకు అనుసంధానం చేస్తూ కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. 'యూజీ అండ్ పీజీ కోర్సెస్ న్యూ అండ్ ఎమెర్జింగ్ ఏరియాస్' అనే అంశంపై మంగళవారం టి-సాట్ వేదికగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తాము ప్రతిపాదించే కొత్త కోర్సులకు సంబంధించిన వివరాలు తమ కౌన్సిల్ సభ్యుల సమక్షంలో వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కలలను నిజం చేసేందుకు తెలంగాణలోని అండర్ గ్రాడ్యుయేట్ , పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం సుమారు 39 కోర్సులకు రూపకల్పన చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి విజన్‌లో భాగమైన 2047 లక్ష్యాన్ని పూర్తి చేసే ప్రయత్నంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కొత్త కోర్సులను రూపొందించామన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు 19 కోర్సులు, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం మరో 10 కోర్సులను తక్షణమే ఉపాధి కల్పించేవిగా ఆచరణలోకి తేబోతున్నామని, ఏఈడీపీ(అప్రెంటీస్ ఎనేబుల్డ్ డిగ్రీ ప్రొగ్రామ్స్)లో భాగంగా మరో 10 కోర్సులు ప్రవేశపెడుతున్నామని స్పష్టం చేశారు. 2030 సంవత్సరానికి మూడు లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి పబ్లిక్ అండ్ ప్రయివేటు భాగస్వామ్యంతో తెలంగాణాలోని వివిధ రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు ఏర్పడే అవకాశాలున్నాయని, ఆ ఉద్యోగాలను సాధించేందుకు తెలంగాణ యువతను సిద్ధం చేయాలన్న లక్ష్యంతో ఉన్నత విద్యామండలి పనిచేస్తుందని బాలకిష్టారెడ్డి వివరించారు. కళాశాలల్లో క్వాలిటీ టీచింగ్, మానిటరింగ్, అకడమిక్ పార్టిసిపేషన్, రీసెర్చ్ తదితర అంశాలను తప్పనిసరిగా పాటించాలని ఛైర్మన్ సూచించారు. వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ, డాటా సైన్స్ వంటి ప్రత్యేక కోర్సులలో విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు కల్పించే ప్రయత్నంలో భాగంగా యూనివర్సిటీలకు, ఆయా కళాశాలకు తగిన సలహాలు-సూచనలు అందిస్తున్నామన్నారు. మండలి మరో వైస్ ఛైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు కోర్సు పూర్తి చేయడంతో పాటు నైపుణ్యం తప్పని సరిగా ఉండాలని సూచించారు. ఎన్ని ఉన్నత చదువులు చదివినా నైపుణ్యం లేని చదువువల్ల ప్రయోజనం, ఉపాధి రెండూ ఉండవన్నారు. కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ మాట్లాడుతూ యూనివర్సిటీ లేదా కళాశాల తాము నిర్వహించే కోర్సులకు సంబంధించి ఖచ్చితంగా ల్యాబ్స్ నిర్వహించాలని సూచించారు. కొత్త కోర్సులు ప్రారంభించి వదిలివేయడమే కాకుండా వాటిపై తప్పని సరిగా తమ వైపు నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

# పద్ధతి మార్చుకోకపోతే సస్పెన్షన్ వేటు!

- అడ్డంగా విధుల కోత.. ఇక పారిశుద్ధ్య పర్యవేక్షణకే పరిమితం
- "జనంసాక్షి" వార్తలపై వివరణ ఇవ్వండి
- చర్యలకు సిద్ధమైన ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్
- జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా కథనాలు..!?



**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి):** "మీ మీద పత్రికల్లో వార్తలు వస్తున్నాయి.. బయట ఫిర్యాదులు కూడా అధికంగానే ఉంటున్నాయి.. కార్పొరేటర్లు సైతం మీ వ్యవహారాలపై ఫిర్యాదు చేస్తున్నారు.. ఇకమీదట మీ పద్ధతి మార్చుకోకపోతే సస్పెన్ష న్ వేటు తప్పదు.." అంటూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య హెచ్చరించారు. ఈ హెచ్చరిక ఎవరి కో ఇప్పటికే పాఠకులకు అర్థమయ్యే ఉంటుం ది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లో కమిషనర్ స్థాయిలో విధులు వెలగబెడుతున్న ఒక అధికారి చిల్లర చేష్టలపై "జనంసాక్షి" వరుస కథనాలను ప్రచురించింది. దీంతో కార్పొరేషన్ వర్గాల్లో సదరు అధికారి నిర్వాకంపై తీవ్రమైన చర్చ జరిగింది. అలాగే అధికార యంత్రాంగం సైతం ఆయన వ్యవహార శైలిపై చర్యలకు ఉపక్రమించింది. మంగళవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య "జనంసాక్షి" పత్రిక వార్తలపై దృష్టి సారించారు. ఆ వార్తల ఆధారంగా సదరు అధికారి తీరు తెన్నులను ప్రశ్నించారు. స్వయంగా ఛాంబర్ కు పిలిచి హెచ్చరిం చారు. పద్ధతి మార్చుకోకపోతే సస్పెన్షన్ రేటు తప్పదని ఖరాకండిగా చెప్పేశారు. "జనంసాక్షి" కథనాలపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఇక ఆ అధికారి విధులను సైతం అడ్డంగా కత్తిరించి కేవలం శానిటైజేషన్ పర్యవేక్షణకే పరిమితం చేశారు. కీలకమైన ఫైళ్లు ముట్టుకోవడానికి వీల్లేకుండా తోక కత్తిరించారు. కీలకమైన ఫైళ్లు ఏమైనా ఉంటే డిప్యూటీ కమిషనర్ ద్వారానే తనకు రావాలని చెప్పకనే చెప్పారు. ఇకమీ దట అనుమతి లేకుండా తన ఛాంబర్ లోకి రావద్దని హెచ్చరిక జారీ చేశారు. మరో వైపు "జనంసాక్షి"లో కథనాలు చర్చకు దారి తీయడంతో కార్పొరేషన్‌లో కమిషనర్ స్థాయి అధికారి వ్యవహార శైలి జిల్లా కలెక్టర్ దృష్టికి చేరింది. ఆయన సైతం సదరు అధికారిని అదుపులో పెట్టాలని కమిషనర్‌కు మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.




# ఫ్లాఫ్ హిస్టరీ మీదే

## కేటీఆర్‌కు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్

**మంథని, (జనంసాక్షి) :** అనేక హామీలు ఇచ్చి మోసం చేయడం ప్రపంచ చరిత్రలోనే లేదని, మీది ఫ్లాప్ సినిమా అంటూ అసెంబ్లీలో మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై శాసనసభ వ్యవహారాల, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. 'ఏదో ఒక సినిమా ఫ్లాప్ అవడం కామన్, కానీ మీరు 2023 అసెంబ్లీ ఎన్నికలతో పాటు పార్లమెంట్, పంచా యతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఫ్లాప్ అయ్యారు' అని శ్రీధర్ బాబు ఎద్దేవా చేశారు. వాస్తవాలు మాట్లాడుతూ సూచనలు ఇవ్వాలి తప్ప, విమర్శలు చేయడం తగదని చెప్పారు. ఇలానే అవాస్తవాలు మాట్లాడుతూ పోతుంటే రాబోయే ఎంపీపీ, జడ్పిటిసి ఎన్నికల్లో సైతం బిఆర్ఎస్ ఫ్లాప్ కాక తప్పదని అన్నారు.

# ఆక్రమణలపై మరోసారి హైడ్రా ఉక్కుపాదం

## శేరిలింగంపల్లిలో దాదాపు 200 కోట్ల విలువచేసే 2 ఎకరాల పార్కు స్థలానికి విముక్తి






**శేరిలింగంపల్లి, మార్చి 17 (జనంసాక్షి) :** విశ్వ నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రజావ సరాలకు ఉద్దేశించి కేటాయించబడిన దాదాపు 11 ఎకరాల భూమిని మంగళవారం హైడ్రా కాపాడింది. మార్కెట్లో సదరు 11 ఎకరాల భూమి విలువ సుమారు 1650 కోట్ల రూపాయలవరకు ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి నియో జకవర్గం పరిధిలో సైతం కొండాపూర్ డివిజన్ పరిధి సెంట్రల్ పార్క్ కాలనీ కి సంబంధించి సర్వే నంబర్ 110/1 లో 16 ఎకరాల విస్తీర్ణంలో అప్పట్లో ఓ లేఅవుట్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్రమంలో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని దాదాపు 2 ఎకరాల స్థలాన్ని పబ్లిక్ పార్కు కోసం కేటాయించనైనది. లేఅవుట్ అప్రూవల్ లో భాగంగా మున్సిపల్ అధికారులు సదరు 2 ఎకరాలను పార్కు స్థలంగా హద్దులు నిర్ధారించి ప్రహరీ కూడా నిర్మించారు. ఈ క్రమంలో ఈ మధ్యకాలంలో పార్కు కోసం కేటాయించిన భూమి తమదంటూ కొంతమంది ఆక్రమణలకు పాల్పడడం, కాలనీవాళ్లు అడ్డుకుంటే వారిని బెదిరించడం వంటి ఘటనలు, దుశ్చర్యలు పలుమార్లు జరిగిన నేపథ్యంలో సదరు కాలనీవాసులు ప్రజావాణి కార్యక్రమం ద్వారా హైడ్రా అధికారులకు సమగ్రమైన సమాచారంతో ఫిర్యాదు చేయగా ఆ ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జిహెచ్ఎంసి అధికారుల తోకలసి హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. తమవద్దనున్న ఆధారాలు, ప్రభుత్వ రికార్డులను సరిచూసుకొని సర్వే నెంబర్ 110/1 లోని రెండు ఎకరాలు పార్కు స్థలంగా నిర్ధారించింది. హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం పార్కులో తాత్కలికంగా వేసిన షెడ్డులను తొలగించింది. 2 ఎకరాల పార్కు స్థలం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. పార్కు స్థలం విలువ బహిరంగ మార్కెట్లో 200 కోట్లకు పైమాటేనని అధికారులు భావిస్తున్నారు.

# వైద్యురాలిగా నటిస్తూ .. మత్తు ఇస్తూ ..

## దోచుకుంటున్న భార్య భర్తలు అరెస్టు

- 11తులాల బంగారు ఆభరణాలు, ఒక మారుతీ సుజుకీ బాలెనో కారు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం




**సికింద్రాబాద్ (జనంసాక్షి):** భర్తతో కలిసి ఆసుపత్రుల్లో వైద్య నిపుణురాలిగా నటిస్తూ రోగులకు మత్తుమందు ఇచ్చి బంగారు ఆభరణాలు దోచుకుంటున్న మహిళను, ఆమెకు సహకరిస్తున్న భర్తను సికింద్రాబాద్ టాస్క్ ఫోర్స్, మార్కెట్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిందితురాలు గౌండ్ల శిరీష (25) ఫార్మ్-డి విద్యార్థిని. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తన భర్త ఎడులపల్లి సాయి కుమార్ గౌడ్ (30)తో కలిసి ఈ దోపిడీలకు పాల్పడింది. శిరీష డాక్టర్ వేషంలో ఆసుపత్రుల్లోకి ప్రవేశించి, ముఖ్యంగా వృద్ధ మహిళా రోగులను లక్ష్యంగా చేసుకునేది. తన వెంట తెచ్చుకున్న 'డయాజెపామ్' మత్తు ఇంజక్షన్‌ను వారికి ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేసి, అనంతరం వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించి పారిపోయేది. మార్చి 11న సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రి, అలాగే చందానగర్‌లోని సిటిజన్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఇదే విధంగా చోరీలకు పాల్పడ్డారు. దొంగిలించిన సొమ్మును విలాసాలకు, షాపింగ్‌కు వినియోగించేవారు. పోలీసులు నిందితుల వద్ద నుంచి సుమారు 11 తులాల బంగారు ఆభరణాలు, ఒక మారుతీ సుజుకీ బాలెనో కారు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 70/2026, చందానగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.274/2026 కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సికింద్రాబాద్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జె. రాజశేఖర్ నేతృత్వంలోని బృందం పాల్గొన్నారు.

# చండూరు దాడి ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సిలో ఫిర్యాదు



**చండూరు, (జనంసాక్షి) :** చండూరు పట్టణంలో ఈ నెల 15న చోటు చేసుకున్న దాడి ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవు తోంది. బీజేపీ కార్యకర్తలపై జరిగిన హత్యాయత్నం ఘటనతో పాటు, అనంతరం పోలీసులు ప్రదర్శించిన నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బాధితుల తరఫున న్యూ ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్ సి)లో అధికారిక ఫిర్యాదు నమోదైంది.బాధితుల తరఫున అడ్వొకేట్ వినోద్ హిందుస్థానీ ఈ ఫిర్యాదును దాఖలు చేశారు. ఫిర్యాదులో దాడి ఘటనను వివరంగా ప్రస్తావిస్తూ.. బాధితుల ప్రాణాలకు ముప్పు ఏర్పడిందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఘటన అనంతరం పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని, కేసు నమోదు విషయంలో ఆలస్యం జరిగిందని ఆరోపించారు. ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకో వాలని ఎన్‌హెచ్‌ఆర్‌సి ను కోరారు. అలాగే బాధితులకు న్యాయం కల్పించడంతో పాటు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఫిర్యాదులో స్పష్టం చేశారు.స్థానికంగా ఈ ఘటన రాజకీయ వర్గాల్లో ఉద్రిక్తతకు దారితీసింది. బాధితుల కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు పోలీసుల వ్యవహారంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పారదర్శక విచారణ జరగాలని డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికే ఈ ఫిర్యాదును స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సి సంబంధిత అధికారుల నుంచి నివేదిక కోరే అవకాశముంది. తదుపరి చర్యలపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# రికార్డు స్థాయిలో జమ్మికుంట అంగండి వేలం



**జమ్మికుంట, మార్చి 17 ( జనంసాక్షి):** జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మెన్ మొలుగు ప్రశాంత్, కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ అంగడి వేలం పాటలొ 55లక్షల 35వేలకు పరకాల గ్రామానికి చెందిన పోరండ్ల రమేష్ దక్కించుకున్నాడు.గతంలో 2025-26 సంవత్సరానికిగాను 40లక్షల 61వేలకు ఇదే పోరండ్ల రమేష్ దక్కించుకోగా నేడు నిర్వహించిన వేలం పాటలో పోటాపోటీగా వేలం పాట పాడి పోరండ్ల రమేష్ 55లక్షల 35వేలకు దక్కించుకున్నట్లు మున్సిపల్ చైర్మెన్ మొలుగు ప్రశాంత్ కుమార్, కమిషనర్ మహమ్మద్ అయాజ్ లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ జి.రాజిరెడ్డి,ఆర్ ఐ భాస్కర్ లతో పాటు పలువురు గుత్తేదారులు పాల్గొన్నారు.

# భూ మూలకాలు, సంబంధిత ఖనిజాల రంగంలో కీలక పరిణామం

## ఎన్ఎండీసీ, జీఎండీసీ అవగాహన ఒప్పందంపై సంతకాలు




**హైదరాబాద్, 17 మార్చి (జనంసాక్షి):** భారతీయ మైనింగ్ దిగ్గజాలైన ఎన్ఎండీసీలిమిటెడ్, జీఎండీసీ లిమిటెడ్, అరుదైన భూ మూలకాలు, సంబంధిత ఖనిజాల రంగంలో సహకారాలను అన్వేషించేందుకు సోమవారం ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. భారతదేశం కోసం ఒక సమీకృత, సుస్థిరమైన కీలక ఖనిజ సరఫరా గొలుసును అభివృద్ధి చేయడమే ఈ బలాధారిత భాగస్వామ్యం మార్గదర్శకం. ఈ భాగస్వామ్యం, దేశంలో అరుదైన భూ మూలకాల నిక్షేపాల అన్వేషణకు, అలాగే ఈ ఉప-రంగంలో పరిశోధన, అభివృద్ధిసామర్థ్యాల విస్తరణకు, కార్బన్ ఉద్గారాల పట్ల అవగాహనతో కూడిన కార్యక్రమాలకు మార్గం సుగమం చేస్తుంది. హైదరాబాద్‌లోని ఎన్ఎండీసీ ప్రధాన కార్యాలయంలో, ఇరుపక్షాల సీనియర్ అధికారుల సమక్షంలో, ఎన్ఎండీసీ సీఎండీ అమితావా ముఖర్జీ, జీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్, ఐఏఎస్ రూప్‌వంత్ సింగ్ సమక్షంలో ఈ రెండు కంపెనీలు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. మార్చి 16, 2026 నుండి రెండు సంవత్సరాల కాలానికి అమల్లోకి వచ్చే ఈ అవగాహన ఒప్పందం, ప్రతిపాదిత సహకారాన్ని మూల్యాంకనం చేసి, సుసంపన్నం చేయడానికి ఒక స్టీరింగ్ కమిటీ, వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేస్తోంది. ఈ ఒప్పందం దేశవ్యాప్తంగా అరుదైన ఖనిజాల తవ్వకం, డౌన్‌స్ట్రీమ్ కార్యకలాపాల అభివృద్ధిని బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. అమితావా ముఖర్జీ మాట్లాడుతూ, "అరుదైన ఖనిజాల పట్ల భారతదేశానికి ఉన్న ఆసక్తి ఇప్పుడు ఒక వ్యూహాత్మక జాతీయ ప్రాధాన్యత. ఈ ఖనిజాలు ఇంధన భద్రత, రక్షణ సామర్థ్యం, నిజమైన ఆత్మనిర్భర భారత్ సాధనలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ సందర్భానికి తగినట్లుగా స్పందించాల్సిన అవసరం మైనింగ్ కంపెనీలకు ఏర్పడింది. దేశం కోసం వీలైనంత త్వరగా ఒక పటిష్టమైన కీలక ఖనిజ సరఫరా గొలుసును నిర్మించడానికి ఎన్ఎండీసీ, జీఎండీసీతో కలిసి నిశ్చయించుకుంది." కీలక ఖనిజాల మిషన్, అరుదైన ఖనిజాల కారిడార్‌లో తమదైన వేగంతో, ఎన్ఎండీసీ, జీఎండీసీ ఒక జాయింట్ వెంచర్, స్పెషల్ పర్పస్ వెంచర్ అవకాశాలను కూడా పరిశీలిస్తున్నాయి.

# బిసి హాస్టల్ స్థలాన్ని కబ్జాల నుంచి కాపాడాలి... సంక్షేమ సంఘాల డిమాండ్



**శేరిలింగంపల్లి, (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం గోపినగర్ పరిధి శేరిలింగంపల్లి మండల బిసి బాలుర వసతి గృహం స్థలాన్ని కబ్జాల నుంచి కాపాడాలని గోపినగర్, బాపునగర్, నెహ్రూనగర్ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్, శేరిలింగంపల్లి మండల తహసిల్దార్ మహిపాల్ రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, రంగారెడ్డి జిల్లా బిసి డెవలప్మెంట్ అధికారి డిప్యూటీ డైరెక్టర్ కేశురాంలతో పాటు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ కు మంగళవారం బిసి వసతిగృహం స్థలాన్ని కాపాడాలంటూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంక్షేమ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థుల అవసరం నిమిత్తం బిసి వసతిగృహం నిర్మితమై దశాబ్దాలు గడుస్తున్నా ప్రహరీ నిర్మాణం చేపట్టడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహానికి రక్షణ లేకపోవడంతో వసతిగృహం ప్రాంగణం కబ్జాలకు గురవుతుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బాలుర వసతి గృహం స్థలాన్ని పరిరక్షించాలని ఈ సందర్భంగా సంక్షేమ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. అధికారులకు వినతిపత్రాలను సమర్పించిన వారిలో గోపినగర్, బాపునగర్, నెహ్రూనగర్ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ఆయా ప్రాంతాల ప్రజలు, బస్తీల వాసులు పాల్గొన్నారు.

# పరిహారం కోసం పక్కదారులు

- ప్రైవేట్ స్థలంలో ఇంటి నిర్మాణాలు
- ఆర్ అండ్ ఆర్ కాలనీ పట్టా చూపెడుతున్న వైనం
- రైల్వే లైన్ భూసేకరణలో పలువురి వింత ఆలోచనలు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే నిర్మాణంలో భాగంగా భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుంది. ఇప్పటికే ఎకరాలు సేకరించిన అధికారులు మరో 107 ఎకరాలు సేకరించేందుకు సమాయత్తమ య్యారు. వేములవాడ, నాంపల్లి, అనుపురం ఆర్ అండ్ ఆర్ కాలనీలో కొన్ని ఇంటి నిర్మాణాలు, అనుపురం శివారు,శాత్రాజుపల్లిలో భూములు కోల్పోతున్నారు. ఒక్కో ఎకరానికి 12 శాతం వడ్డీతో కలిపి రూ.41,13,744 పరిహారం చెల్లించాలని అధికారులు నిర్ణయించారు. అయితే రైతులు బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక్కో ఎకరానికి రూ.1 కోటి వరకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

**అనుపురం ఆర్అండ్ఆర్ కాలనీలో పరిహారం కోసం**

రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా వ్యవసాయ భూములతో పాటు అనుపురం ఆర్అండ్ఆర్ కాలనీలో కొందరి ఇండ్లు కోల్పోతున్నారు. మిడ్ మానేరు జలాశయంలో అనుపురం గ్రామం ముంపునకు గురవడంతో నిర్వాసితులకు కరీంనగర్ సిరిసిల్ల ప్రధాన రహదారిలో ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటుచేసి ఇంటి స్థలం పట్టాలను అందించారు. దీంతో నిర్వాసితులు ఇక్కడ ఇంటి నిర్మాణాలు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు.ఈ క్రమంలో రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా సుమారు 15 ఇండ్లు తొలగించాలని అధికారులు గుర్తించారు. అయితే ప్రైవేటు స్థలాల్లో ఇంటి నిర్మాణాల్లో చేసుకున్న కొంతమంది తమకు ఆర్ అండ్ ఆర్ కాలనీలో వచ్చిన పట్టా తోనే ఇంటి నిర్మాణం చేపట్టామని ఆఇంటిని చూపిస్తున్నట్లు సమాచారం. అందుకు కారణం ప్రభుత్వం నుండి ఆర్అండ్ఆర్ స్థలంతో పాటు పరిహారం అధికంగా వస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికోసం పలువురు నాయకుల మధ్య పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు స్థానికంగా చర్చ కొనసాగుతుంది. ప్రభుత్వ ధనం దుర్వినియోగం కాకుండా జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# బాసర పంచాయతీ కార్యాలయం చుట్టూ ఆక్రమణలు

**అటువైపు కన్నెత్తి చూడని అధికారులు**

**నిర్మల్ బ్యూరో/బాసర, (జనంసాక్షి):** నిర్మల్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో గ్రామపంచాయతీ కార్యాలయం పరిసరాల్లో పెరుగుతున్న అక్రమ ఆక్రమణలు తీవ్ర ఆందోళనకు దారితీస్తున్నాయి. కార్యాలయానికి ఆనుకుని, గేట్ ముందు చుట్టుపక్కల ఏర్పాటు చేసిన దుకాణాలు వెంటనే తొలగించాలని స్థానిక ప్రజలు, యువకులు గ్రామపంచాయతీ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న ఈ షాపులు ప్రభుత్వ భవనానికి అడ్డుగా నిలిచి, అధికారుల పనితీరుకు ఆటంకం కలిగించడంతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, పంచాయతీ భవనం బయట నుంచి కనబడని పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొన్నారు.

**అడ్మినిస్ట్రేషన్‌కు ఆటంకాలు**

కార్యాలయం ముందు ఆక్రమణల వల్ల అధికారులు, గ్రామస్తుల వాహనాలకు పార్కింగ్ సమస్య తీవ్రంగా మారింది. మండల కేంద్రానికి వచ్చే ఇతర గ్రామాల ప్రజలకు కూడా పంచాయతీ కార్యాలయం గుర్తించడం కష్టంగా మారిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధికి ప్రతీకగా ఉండాల్సిన పంచాయతీ కార్యాలయం చుట్టూ ఇలాంటి పరిస్థితులు ఉండటం తగదని స్థానికులు అంటున్నారు. తక్షణమే ఆక్రమణలు తొలగించి పరిసరాలను శుభ్రపరచి సుందరీకరణ చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి తరచూ వచ్చే అధికారులు ఈ ఆక్రమణలను గమనించకపోవడం పట్ల గ్రామ స్తులు ఆశ్చర్యం చేస్తున్నారు. ఈ అంశంపై జిల్లా పంచాయతీ అధికారి, డివి జన్ ,మండల స్థాయి అధికారులు స్పందించి తీసుకోవాలని కోరుతున్నారు.



**అక్రమాలకు సౌకర్యాలు ఎలా?**

రైల్వే స్టేషన్ నుంచి బాసరకు వచ్చే ప్రధాన రహదారి డ్రైనేజీపై వందల సంఖ్యలో ఏర్పడిన అక్రమ నిర్మాణాలకు విద్యుత్, నీటి సరఫరా ఎలా అందుతోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంపై విచారణ జరిపి బాధ్యు లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. 2027లో జరగనున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని, ఇప్పటికైనా ఆక్రమణలను తొలగించి ఫుట్‌పాత్‌ల ఏర్పాటు, శుభ్రత చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

# బ్యాంక్ మేనేజర్‌పై ఘాతుకం

## సెలవు అడిగితే ఇవ్వలేదని కాల్చి చంపిన సెక్యూరిటీ గార్డ్

- ఘజియాబాద్‌లో దారుణ ఘటన



**న్యూఢిల్లీ, మార్చి17 (జనంసాక్షి) :** ఘజియాబాద్‌లో ఓ సెక్యూరిటీ గార్డు ఘాతుకానికి పాల్పడ్డాడు. సెలవులు, జీతం విషయంలో విభేదాలు రావడంతో అందరూ చూస్తుండగా బ్యాంక్ మేనేజర్‌ను కాల్చి చంపాడు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఘజియాబాద్‌లోని పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో రవీంద్ర హుడా అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతడికి సెలవుల గురించి తరచుగా బ్యాంక్ మేనేజర్ అభిషేక్ కుమార్ (34)తో విభేదాలు తలెత్తుతుండేవి. ఎప్పుడు అడిగినా మేనేజర్ సెలవు తిరస్కరిస్తుండడంతో అతడిపై రవీంద్ర తీవ్రంగా కోపం పెంచుకున్నాడు. సోమవారం రాత్రి అభిషేక్ క్యాబిన్‌లోకి వెళ్లిన రవీంద్ర, తుపాకీతో అతడిపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన అభిషేక్‌ను ఇతర సిబ్బంది హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు వెంటనే రవీంద్రను అదుపులోకి తీసుకున్నారు. మేనేజర్ హత్యలో రవీంద్రకు సహకరించిన శిశుపాల్‌ను కూడా అరెస్ట్ చేశారు. తాను ఎప్పుడు లీవ్ అడిగినా మేనేజర్ నిరాకరించేవాడని, బ్యాంక్‌కు రాని రోజును సెలవుగా పరిగణించకుండా జీతం కట్ చేసేవాడని, ఆ కోపంతోనే అతడిని కాల్చి చంపానని పోలీసుల విచారణలో రవీంద్ర తెలిపాడు. సెలవుల విషయంలో మేనేజర్‌తో తరచుగా తనకు గొడవలు జరుగుతుండేవని చెప్పాడు. తాను కాల్పులు జరిపిన సమయంలో స్నేహితుడు శిశుపాల్ పక్కనే ఉన్నట్టు కూడా పోలీసుల విచారణలో రవీంద్ర చెప్పాడు. ఆర్మీలో పని చేసి 2018లో రిటైర్ అయిన రవీంద్ర బ్యాంక్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా జాయిన్ అయ్యాడు.

# కండ్లలో కారం కొట్టి.. కోటీ లూటీ

## కూకట్‌పల్లిలో దోపిడీ దొంగలు



**హైదరాబాద్, మార్చి17 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో భారీ దోపిడీ కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దుండగులను పట్టుకునేందుకు బృందాలు రంగంలోకి దిగాయి. సోమవారం రాత్రి సుమారు 9:40 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో స్కూటీపై డబ్బులు తరలిస్తున్న ఇద్దరిపై దుండగులు దాడి చేసి కోటి రూపాయల నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పిలర్ నెంబర్ 825 సమీపంలో, ఏసీపీ కార్యాలయం పక్కనే జరగడం మరింత సంచలనంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం మహ్మద్ ఖుస్రూ (42), మహ్మద్ అజీముద్దీన్ (38) అనే ఇద్దరు వ్యక్తులు స్కూటీపై కోటి రూపాయల నగదును తరలిస్తున్నారు. వీరు బహదూర్‌పురాకు చెందిన ఏసీ మెకానిక్స్. అనుమానం రాకుండా ఉండేందుకు గోల్డ్ డ్రాప్ కార్టన్ బాక్స్‌లో కోటి రూపాయలను పెట్టుకుని బైక్‌పై తరలించే ప్రయత్నం చేశారు. కూకట్ పల్లి పిల్లర్ నెంబర్ 825 వద్ద ఏజెంట్లు డబ్బు కలెక్ట్ చేసుకున్నారు. అయితే వీరిని ముందుగానే గమనించిన దుండగులు మూడు బైక్‌లపై ఫాలో అయ్యారు. డబ్బు కలెక్ట్ చేసుకుని కేవలం 100 మీటర్ల దూరం ప్రయాణించగానే.. నలుగురు దుండగులు స్కూటీపై వెళ్తున్న వారిపై కారం పొడి చల్లి దాడి చేశారు. దీంతో బాధితులు కింద పడిపోగా.. వెంటనే నగదు ఉన్న బాక్స్‌ను తీసుకుని దుండగులు పరారయ్యారు. ఈ ఘటనలో ఉపయోగించిన బైక్‌లు ప్యాషన్ ప్లస్, ఎఫ్‌జెడ్ మోడల్స్‌గా పోలీసులు గుర్తించారు. డబ్బు హవాలా నగదై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అలాగే డబ్బు తరలింపు సమాచారం ముందుగానే తెలిసిన వ్యక్తులే ఈ దోపిడీకి పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన అనంతరం పోలీసులు బాధితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డబ్బు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరిది? వంటి వివరాలను సేకరిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో నగరంలో భద్రతా వ్యవస్థపై మరోసారి చర్చ మొదలైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## ఆశ్రయమిచ్చిన ఇంటికే కన్నం

బంధువే కదా ఆశ్రయమిస్తే రాబంధువుగా మారి దోచుకున్నది. ఇంట్లో చోటిచ్చిన పాపానికి బంగారు నగలు, డబ్బు అంతా ఊడ్చుకెళ్లింది. ఆ కిలాడీ లేడీ అంతర్గతంగా వేసిన స్కెచ్ గుర్తు పట్టని ఆ దంపతులు.. సొమ్ము పోయిన తర్వాత లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. సీన్ కట్ చేస్తే జస్ట్ 24 గంటల్లోనే కిలాడీ లేడీని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన హైదరాబాద్‌లో జరిగింది. బీహెచ్‌ఈఎల్ కాలనీ పరిధిలోని ఆదర్శనగర్‌లో పురోహితులైన యర్రవల్లి మణికంఠశర్మ, హేమబిందు దంపతుల ఇంటికి వచ్చింది ఓ మహిళ. ఆమె పేరు చెరకుపల్లి లక్ష్మి స్వరాజ్. తాను తీవ్రమైన ఆర్థిక కష్టాల్లో ఉన్నానని, ఉండటానికి చోటు లేక ఇబ్బంది పడుతున్నానని ప్రాధేయపడింది. బంధుత్వంపై ఉన్న గౌరవం.. ఆమె పరిస్థితిపై ఉన్న జాలితో ఆ దంపతులు ఆమెకు తమ ఇంట్లోనే ఉండేందుకు ఆశ్రయం ఇచ్చారు. కొన్ని రోజులు.. ఆ దంపతుల నమ్మకాన్ని గెలుచుకుంది లక్ష్మిస్వరాజ్. వారి ఇంట్లో ఒక మనిషిగా ఉన్నట్లుగానే మెదిలింది. కానీ ఆ తర్వాత ఆమె తన కన్నింగ్ ఆలోచనలకు తెరతీసింది. ఇంట్లో ఉన్న విలువైన ఆభరణాలపై కన్నేసింది. మార్చి 13న వాటిని కొట్టేసేందుకు ప్లాన్ చేసింది. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం.. ఆ దంపతులకు నిమ్మరసంలో మత్తు పదార్థం కలిపి ఇచ్చింది. ఆ పానీయం తాగిన కొద్దిసేపటికే మణికంఠశర్మ, హేమబిందు ఇద్దరూ స్పృహ కోల్పోయారు. వారు అపస్మారక స్థితిలోకి వెళ్లగానే.. లక్ష్మీస్వరాజ్ తన ముఠా సభ్యులైన పర్వతం కిరణ్‌కుమార్, కోనపర్తి యశ్వంత్, భారడి దీపక్, శివను ఆ ఇంటికి రప్పించింది. ముఠా సభ్యులతో కలిసి ఇంట్లోని అల్మారాలను బద్దలుకొట్టి దాదాపు 30 తులాల బంగారం, 2.3 కిలోల వెండి, 3 ఖరీదైన సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. బాధితులు స్పృహలోకి వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉండటం.. లక్ష్మీస్వరాజ్ కనిపించకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు వెంటనే బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కాలనీలోని సీసీ కెమెరాల ఫుటేజీ, నిందితులు వాడిన వాహనాల నంబర్లు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. కేవలం 24 గంటల వ్యవధిలోనే ప్రధాన నిందితురాలు లక్ష్మీస్వరాజ్‌తో పాటు మిగిలిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి దోచుకెళ్లిన పూర్తి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బంధువులైనా, తెలిసిన వారైనా సరే ఇంటికి వచ్చినప్పుడు పూర్తి జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా ఆర్థిక స్థితిగతులు, బంగారం ఎక్కడ దాస్తారో వంటి వ్యక్తిగత విషయాలను ఎవరికీ వెల్లడించవద్దని కోరారు.

# భార్యను కత్తితో పొడిచి హతమార్చిన భర్త

## ప్రేమించి పెండ్లి చేసుకుని.. నాలుగు నెలల గర్భిణిపై ఘాతుకం



**జగిత్యాల, మార్చి17 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లాలో దారుణం జరిగింది. నాలుగు నెలల గర్భవతిగా ఉన్న భార్యపై భర్త కత్తితో దాడి చేసి చంపాడు. కోరుట్ల మండలం మాదాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ప్రాథమికంగా తెలిపిన వివరాల ప్రకారం.. 8 నెలల క్రితం కోరుట్లకు చెందిన చిత్తరి హరిబాబు, మాదాపూర్‌కు చెందిన వైష్ణవి (19) ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి అతను మాదాపూర్‌లోనే నివాసముంటున్నారు. హరిబాబు ప్రభుత్వ ఆస్పత్రిలో ఒప్పంద పద్ధతిలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వైష్ణవి రీల్స్ చేస్తూ యూట్యూబ్ ఛానల్ నడిపిస్తోంది. కొద్దిరోజులుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం వేకువ జామున 4 గంటలకు వైష్ణవిపై హరిబాబు కత్తితో దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం కుటుంబసభ్యులు చూసేసరికి రక్తపుమడుగులో వైష్ణవి పడి ఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

# దరఖాస్తు కట్టలతో వెళ్లడంపై భద్రతా సిబ్బంది అభ్యంతరం

## అసెంబ్లీ గేటు వద్ద బిజెపి ఎమ్మెల్యేల నిరసన



**హైదరాబాద్, మార్చి17 (జనంసాక్షి) :** తెలంగాణ అసెంబ్లీ ఎంట్రీ వద్ద బీజేపీ ఎమ్మెల్యేలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులతో అసెంబ్లీకి వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యేలు... ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద బీజేపీ ఎమ్మెల్యేలను భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. పేపర్ కట్టలు లోపలికి తీసుకెళ్లడానికి అనుమతి లేదని భద్రతా సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యేలు తీవ్రంగా వాదించారు. దీంతో బీజేపీ ఎమ్మెల్యేలు, పోలీసు-భద్రతా సిబ్బంది మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు భద్రతా సిబ్బంది పేపర్ బండిల్స్‌ను తీసుకొని బీజేపీ ఎమ్మెల్యేలను అసెంబ్లీ లోపలికి అనుమతించారు. అసెంబ్లీ ఎంట్రీ వద్ద బీజేపీ ఎమ్మెల్యేలు నిరసనకు దిగారు. కాగా.. రైతు సమస్యలపై బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నిరసనకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఈనెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆదిలాబాద్ కేంద్రంగా బీజేపీ ఎమ్మెల్యే పర్యటించారు. రైతుల నుంచి పంటల బీమా పథకానికి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. రైతులు ఎదుర్కొంటున్న పంట నష్టాలకు తగిన న్యాయం జరగాలంటే బీమా పథకం అమలు అవసరమని బీజేపీ ఎమ్మెల్యే పట్టుబట్టారు. వెంటనే రైతుబంధు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేస్తున్నారు.

## 'ఆ కార్ నేషనల్ ఫెస్ట్'లో నెగ్గి

# బాసర త్రిబుల్ ఐటీకి కీర్తిప్రతిష్టలు తీసుకొచ్చి..

## ఆర్జీయూకేటీ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రథమ బహుమతి




**ముధోల్, మార్చ్ 17(జనం సాక్షి) :** ఐఐటీ బాంబేలో మార్చి 15, 2026న నిర్వహించిన ప్రతిష్టాత్మక 'ఆకార్' ఫెస్ట్‌లో బాసర ఆర్జీయూకేటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన మూడు బృందాలు పాల్గొని, 'ఓపెన్ రోడ్స్ డిజైన్' పోటీలో ప్రథమ బహుమతి సాధించడం బాసర త్రిబుల్ ఐటీకి గర్వకారణం. దేశవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి విద్యా సంస్థల నుంచి వచ్చిన పోటీదారులను ఎదుర్కొని, రోడ్డు మౌలిక సదుపాయాల రూపకల్పనలో మన విద్యార్థులు అసాధారణ మైన సాంకేతిక నైపుణ్యం, వినూత్న డిజైన్ దృక్పథం, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రదర్శించి విశ్వవిద్యాలయానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చారు. ఈ అద్భుత విజయం సాధించిన విద్యార్థులను బాసర త్రిబుల్ ఐటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఇ. మురళీ దర్శన్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల కఠోర శ్రమ, టీమ్ వర్క్, అంకితభావాన్ని అభినందించారు.

# రాజకీయాల్లో నిఖార్సయిన నేత ఓంకార్

## ఓంకార్ శతజయంతి ఉత్సవాల్లో మంత్రి సీతక్క



**హైదరాబాద్, మార్చి17 (జనంసాక్షి) :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, కమ్యూనిస్ట్ దిగ్గజ నేత మద్దికాయల ఓంకార్ ఉన్నత విలువలు కలిగిన నాయకుడని, ప్రజా ఉద్యమాల్లో ఆయన పాత్ర విశేషమని మంత్రి సీతక్క గుర్తుచేశారు. అండర్ గ్రౌండ్ నుంచి ఓవర్ గ్రౌండ్ వరకు ఆయన సాగించిన పోరాటం అపార అనుభవాన్ని అందించిందని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో కూడా ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నానని తెలిపారు. రవీంద్ర భారతిలో మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఉద్యమాలు, క్రమశిక్షణ, ప్రజాసేవ వంటి విలువలను ఓంకార్ నుంచి నేర్చుకున్నానని సీతక్క వెల్లడించారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేశారని, ఆయనలేని లోటు నర్సంపేటకే కాకుండా యావత్ తెలంగాణకే తీరని లోటుగా మిగిలిందని అన్నారు. 6 దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎలాంటి ఒత్తిడులకు లొంగ కుండా రాజకీయాలకు విలువ లు అద్దిన రాజకీయ దురంధ రుడని కొనియాడారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ చట్టసభల్లో గళం వినిపించిన నిస్వార్థ ప్రజాసేవకుడిగా ఓంకార్ నిలిచారని చెప్పారు. అలాంటి గొప్ప నాయకుడి చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. సురవరం ప్రతాప్ రెడ్డి, గద్దర్, అందెశ్రీ వంటి ప్రముఖుల చరిత్రను ప్రజలకు తెలియ చేస్తున్నామని, అదే విధంగా ఓంకార్ సేవలను కూడా రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. అలాగే ట్యాంక్‌బండ్‌పై ఓంకార్ విగ్రహం ఏర్పాటు చేయాలని అభిమానులు కోరుతున్నారని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై దాడులు చేస్తున్నాయని మంత్రి సీతక్క ఆందోళన వ్యక్తం చేశారు. ఒక దేశాధినేతను హతమార్చే హక్కు అమెరికాకు ఎవరిచ్చారని ప్రశ్నించారామె. ఇరాన్ మీద దాడిని కూడా ఖండించలేని పరిస్థితుల్లో మన దేశ ప్రభుత్వం ఉందని విమర్శలు గుప్పించారు. ఇలాంటి పరిస్థితుల్లో మన దేశం మౌనం వహించడం సరైంది కాదని, కేంద్ర ప్రభుత్వం అమెరికా యుద్ధోన్మాదాన్ని ఖండించాలని డిమాండ్ చేశారు.

# రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

**పెద్దపల్లి, మార్చి17 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందారు. ఈ ఘటన పాలకుర్తి మండలం బసంత్‌నగర్ సమీపంలో పెద్దపల్లి - రామగుండం రాజీవ్ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు, బసంత్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎడ్ల శ్రీనివాస్ (47), రజిత (40) దంపతుల కుమార్తె హైదరాబాద్‌లో చదువుకుంటోంది. ఆమెను చూసేందుకు వారు కారులో వెళ్లారు. కలిసిన అనంతరం తిరిగి స్వస్థలానికి వెళుతున్న క్రమంలో బసంత్‌నగర్ గ్రామ శివారు వద్ద కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు.

# 20న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్‌మేళా

- 100 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ

**హైదరాబాద్, మార్చి17 (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 20 న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. అపోలో ఫార్మసీ లోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, మరియు ఏదైనీ డిగ్రీ చేసిన యువతి యువకులకు18 నుండి 35 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ.16,383 నుండి రూ.19,769 వేల వరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు. 8247656356 ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో నేరుగా హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

# తుపాకీతో రీల్ చేయబోయి.. గుండెల్లో కాల్చుకుని

## రీల్స్ వ్యామోహంతో ప్రాణాలు కోల్పోయిన యువకుడు



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** కొందరు యువతీ యువకులు రీల్స్ వ్యామోహంలో పడి ప్రాణాలు కోల్పోతున్నాడు. తాజాగా ఓ వ్యక్తి గన్‌తో రీల్స్ చేశాడు.. చివరకు ఆ గన్‌లోని బుల్లెట్‌కు ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాదకర ఘటన తూర్పు ఢిల్లీలో జరిగింది. మృతుడుని పవన్‌గా గుర్తించారు. ఢిల్లీకి చెందిన ఈ కుర్రోడు గన్‌తో స్టంట్ చేయబోయి ప్రాణాలమీదికి తెచ్చుకున్నాడు. పవన్ ఈ రీల్ చేస్తుండగా పక్కనున్న స్నేహితుడు దాన్ని రికార్డు చేశాడు. బటన్ ఎలా నొక్కాలో మిత్రుడు చెబుతుంటే.. పవన్ తుపాకీని లోడ్ చేశాడు. ఆ తర్వాత గన్‌ను ఛాతికి గురిపెట్టుకుని కెమెరా వైపు చూసి నవ్వాడు. వీడియో రికార్డు చేస్తున్న వ్యక్తి కాల్చొద్దు అన్నా అని చెప్పినప్పటికీ పవన్ కంగారులో ట్రిగ్గర్ నొక్కేశాడు. అంతే... బుల్లెట్ అతని గుండెల్లోకి దూసుకెళ్లడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. ఈ తుపాకీ వీడియో రికార్డు చేసిన పవన్ స్నేహితుడిదేనని పోలీసులు తెలిపారు. దానికి లైసెన్స్ ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# మరోమారు భగ్గుమన్న పసిడి ధర

- సగటున పది గ్రాములపై 1200 పెరుగుదల

**న్యూఢిల్లీ, మార్చి17 (జనంసాక్షి) :** కొంతకాలంగా తగ్గుతూ వస్తున్న పసిడి ధరలు మంగళవారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో మేలిమి బంగారం ధర సగటున రూ.1200ల మేర పెరిగింది. వెండి ధర కూడా సగటున రూ.5 వేల మేర ఎగబాకింది. ధరలు దిగివచ్చినప్పుడు వందల్లో దిగుతూ.. పెరిగితే వేలల్లో పెరగడం గమనార్హం. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,58,620లకు ఎగబాకింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే రూ.1200ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ పసిడి ధర కూడా రూ.1100ల మేర పెరిగి రూ.1,45,400కు చేరుకుంది. నగరంలో వెండి ధర రూ.4 వేల మేర పెరిగింది. కిలో వెండి ప్రస్తుతం రూ.2.8 లక్షలు పలుకుతోంది. ఇక చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,820గా ఉంది. ఢిల్లీలో రూ.1,58,770 వద్ద కొనసాగుతోంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ పసిడి ధర రూ.1,58,620గా ఉంది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర చెన్నైలో రూ.1,46,500గా, ఢిల్లీలో రూ.1,45,550గా ఉంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా నగరాల్లో రూ.1,45,400గా ఉంది. చెన్నైలో కిలో వెండి రూ.2.8 లక్షలకు చేరుకోగా ఇతర ప్రధాన నగరాల్లో రూ.2.75 లక్షల వద్ద కొనసాగుతోంది.

# గ్యాస్ రీఫిల్లింగ్ ముఠా అరెస్ట్!

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బండ్లగూడలోని గ్యాస్ గోదాముల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు అకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం జరిపిన సోదాల్లో అక్రమంగా గ్యాస్ రీఫల్లింగ్ చేస్తున్న ముఠా పట్టుబడింది. గృహ వినియోగం సిలిండర్లలోని గ్యాస్‌ను వాణిజ్య సిలిండర్లలోకి నింపుతున్న వారిని టాస్క్‌ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల నుంచి గ్యాస్‌ను వాణిజ్య సిలిండర్లలో నింపి సొమ్ము చేసుకోవాలనుకున్న ముఠా ప్రయత్నాన్ని టాస్క్‌ఫోర్స్ బృందం భగ్నం చేసింది. మెరుపు దాడులు జరిపి అదుపులోకి తీసుకుంది. వారి దగ్గరి నుంచి 96 డొమెస్టిక్, 58 వాణిజ్య సిలిండర్లు, నాలుగు గ్యాస్ రీఫిల్లింగ్ యంత్రాలు, 50 చిన్న సిలిండర్లు, తూకం మిషన్లతో పాటు ఇతర సామగ్రిని టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370